సంగవిద

(గణితము + సాహిత్యము)

సంక్షిప్త గణిత విశ్వదర్శిని

ఆచార్య పి.వి. అరుణాచలం

ఫౌండర్ వైస్ ఛాన్సలర్

ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

సుశీల ప్రచురణలు:

526, బాలాజీ కాలని, తిరుపతి – 517502.

2026.

Sangavidha

Dr. P.V. Arunachalam

© Anurahda, Sai Ravindran

Published by:
Suseela Prachuranalu,
526 Balaji Colony, Thirupathi - 517 502.
Email: anu.ravin@yahoo.com
Cell: 7702503997

సాంకేతిక సహకారం: **పెద్ది సాంబశివరావు,**
బృందం తెలుగుతేజం, గుంటూరు –6.
ఫోన్: 94410 65414
గాలం రమేష్, 97043 42313
వై. భవాని, బి.కాం, 96529 89521

Price: **Rs. 250/-**

Printed at:
Rainbow Print Pack
Ameerpet, Hyderabad.
Cell: 9246271620

విషయసూచిక

1.	**అరుణాచలం సృజించిన అపూర్వ విజ్ఞాన సాహిత్య వల్లరి**	**xxi**
2.	**విశ్వదర్శ**	**xxx**
3.	**"ఒక చక్కని కృషి"**	**xxxiii**
4.	**మనసులోని మాట**	**xxxviii**
5.	**కృతజ్ఞతలు**	**xliii**
6.	**లగధ**	**1**
	బౌధాయనుడు	
	విరహాంక, హేమచంద్ర, గోపాల	
7.	**మాధవ**	**2**
	పరమేశ్వర	
	నారాయణ పండితుడు	
8.	**పింగళాచార్యుడు**	**3**
	నీలకంఠ సోమయాజి	
	జ్యేష్ఠ దేవ	
	ఎలుగంటి పెద్దన	
9.	**శ్రీధర**	**4**
	Evariste Galois	
10.	**మల్లికార్జున సూరి**	**5**
	హలాయుధుడు	
	ఆపస్తంభుడు	
	గోవిందస్వామి	
11.	**ఆర్యభట్టు**	**6**
	ఆర్యభట్టు	
	భాస్కర	
	శ్రీపతి	
12.	**వరాహమిహిరుడు**	**7**
	శంకర నారాయణ	
	పావులూరు మల్లన	

13. మహావీరాచార్యుడు **8**
భాస్కరాచార్య
బ్రహ్మగుప్త
ఆచార్య ఎస్. మీనాక్షీ సుందరం
14. వల్లభామాత్యుడు **9**
15. పిడపర్తి కృష్ణమూర్తి శాస్త్రి **10**
ఆర్.వైద్యనాధస్వామి
ప్రశాంత చంద్రమహలనోబిస్
జగన్నాధ సమ్రాట్
16. శ్రీనివాస రామానుజన్ **11**
బదరీనాధ్ ప్రసాద్
పి.యల్. భట్నగర్
17. విష్ణు వాసుదేవ్ **12**
ఎ. నరసింగరావు
గణేష్ ప్రసాద్
18. అవధాని శ్రీహర్షచక్రవర్తి **13**
19. ఎన్. రుద్రయ్య **14**
వి. కణ్ణన్
20. వేదము లక్ష్మీనారాయణ **15**
తడకమళ్ల వెంకట కృష్ణారావు
తెన్నేటి వేంకట సుబ్బారావు
హరిశ్చంద్ర
21. R.C. Gupta (1935-2024) (Jhansi) **16**
సాతమంగలం రంగఅయ్యంగార్ శ్రీనివాస వరదన్
సి.టి. రాజగోపాల్
ఒమ్మి రామస్వామి

22.	**ఎస్. మీనాక్షీ సుందరం**	**17**
	దత్తాత్రేయ రామచంద్ర కప్రేకార్	
	టి. వెంకట్రాయుడు	
	మతుకుమల్లి వెంకటసుబ్బారావు	
23.	**కందుల సీతారామ్**	**18**
	భోజరాజ్ సేత్	
	స్వామి దయాళ్ నిగమ్	
	J.N. Kapur	
24.	**పి.ఎస్. శేషాద్రి**	**19**
	ఎస్. చంద్రశేఖర్	
	C.R. Rao	
25.	**విజయకుమార్ పటొడీ**	**20**
	ఎస్.వి. సుబ్రహ్మణ్యం	
	మంజుల్ భార్గవ్	
26.	**ఎం. సత్యనారాయణ**	**21**
	కె.వి. మునస్వామి రెడ్డి	
	నక్కా రామారావు	
	పొన్నలూరు సూర్యనారాయణ	
27	**S3 : S.S. సుబ్రహ్మణ్యం**	**22**
	P.S. Rao	
	తెన్నేటి సూర్యనారాయణ	
	సుందరేశన్	
28.	**ఎస్.కె. లక్ష్మణరావు**	**23**
	దేవినేని జగన్మోహనరావు	
	ఎం.ఎస్. రఘునాధన్	
29.	**జొన్నలగడ్డ గోపాలకృష్ణ**	**24**
	వి.లక్ష్మీకాంతం	
	కొమరవోలు చంద్రశేఖరన్	

30. కె. ఆనందరావు **25**

జయంత్ విష్ణు నార్లేకర్

పి.వి. కృష్ణయ్య

31. పి. కృష్ణారెడ్డి **26**

వి. గణపతి అయ్యర్

32. ఎం. వెంకటరామన్ **27**

G.S.R. Sarma

వ్యాస్

మణీంద్ర అగ్రవాల్

33. బాబయ్య నాయుడు **28**

పి. ధర్మారావు

వసంతపిళ్ళై

V.K. Balachandran

34. K.S. Amur **29**

C.T. Rajagopal & M.S.Rangachari

M. Venkataraman

35. శరత్‌చంద్రశంకర్ శ్రీఖండే **30**

Akshay Venkatesh

36. కంభంపాటి పట్టాభిరామశాస్త్రి **32**

డి. సూర్యనారాయణ

డి. రామకోటయ్య

37. భావనారి సత్యనారాయణ **33**

యు.ఎం. స్వామి

కె.ఎల్.ఎన్. స్వామి

కె. శ్రీనివాసరావు

38. **వి.వి. సుబ్రహ్మణ్యశాస్త్రి** **34**
ఆర్. సీతారామస్వామి
వనజా అయ్యంగార్
39. **సుజాతా రామదొరై** **35**
ఐ.హెచ్. నాగరాజారావు
శ్రీబాల
లంక రాధాకృష్ణ
40. **ఎం.ఆర్. గోవిందరెడ్డి** **36**
శ్రీధర చంద్రశేఖరశాస్త్రి
కె. జగన్మోహనరావు
41. **సిహెచ్. వి. నరసింహారావు** **37**
పి.ఎస్.ఎన్. శాస్త్రి
డి.ఎస్.ఎన్. శాస్త్రి
ఎస్.వి. రమణయ్య
42. **శైలేష్ షిరాలి** **38**
పి. శేషప్ప
వెంకటేశ్ మూర్తి
43. **వి. శివరాం ప్రసాద్** **39**
వై. వెంకటేశ్వర రెడ్డి
కె. సత్యనారాయణ
ఎ. రాధాకృష్ణ
44. **వి.జి. టికేకర్** **40**
ఎన్.ఎం. బుజుర్కే
B.S. Kirangari
ఎస్. భార్గవ
45. **కె.బి. నాయుడు** **41**
జి.వి. కృష్ణారెడ్డి
ప్రహ్లాద చంద్రవైద్య
వేణుగోపాల్ హేరూర్

46. ఎం. వెంకటాచలప్ప **42**
కె. శ్రీనివాసరావు
పి. కందసామి
ఆర్. బాలకృష్ణన్
47. ఎస్. కుమరేశన్ **43**
I.R.B. శర్మ
T. Amarnadh
48. S.G. Dani **44**
రవి పి. అగర్వాల్
రతన్ పి. అగర్వాల్
49. ఎం.ఆర్. అధికారి **45**
కె.వి.వి. సత్యనారాయణ
వి.ఎన్. సింగ్
S.N. Majhi
50. ★దినేష్ సింగ్ **46**
స్వాధీన్ పట్టనాయక్
వీరవల్లి శేషాద్రి వరదరాజన్
కె.ఎం. శాస్త్రి
51. బి.ఆర్. సేత్ **47**
హంసరాజ్ గుప్త
M.K. Jain
అడ్లూరి నరసింహమూర్తి
52. కె. ప్రభాకర్ **48**
జె. ప్రకాశ్
పూజ్యం కామేశ్వరశర్మ
అల్లాడి కృష్ణస్వామి
53. కె.ఎస్.ఎస్. నంబూద్రి పాద్ **49**
A.M. Mathai
దామోదర ధర్మానంద కోశాంబి

54. జె. హనుమంతాచారి **50**
టి. ఫణీంద్ర
టి. విజయరాఘవన్
55. రామానుజ సంస్థ **51**
బి. మహేశ్వరి (1955)
టి. త్రివిక్రమన్
ఐనంపూడి చంద్రమోహన్
56. ఎం. శ్యాంబాబు **52**
నందనూరు భాస్కరరెడ్డి
రవీంద్రనాధ్ బాబు
ఎస్. లీల
57. కొత్తపల్లి రామమోహనరావు **53**
జి.సి. రావు
ఎల్. నాగమునిరెడ్డి
డి. రాధాకృష్ణరెడ్డి
58. టి. లింగరాజు **54**
R.P. Bambah
సర్వదమన్ చావ్లా
59. కె.రామసుబ్రమణియన్ **55**
ఆర్.ఎస్. మల్లికార్జునమ్
సి. సంజీవరావు
రేమెళ్ళ అవధానులు
60. అంబట్ విజయకుమార్ **56**
ఎ.ఎస్. వత్సల
రామన్ పరిమళ
టి.ఎ. సరస్వతి అమ్మ

61.	**★రతన్ శంకర్ మిశ్రా**	**57**
	ప్రఖ్య సత్యనారాయణ శర్మ	
	ఎ.ఎం. వైద్య	
62	**డి.వి. కృష్ణ**	**58**
	డి.ఆర్.వి. ప్రసాదరావు	
	జి. బాలసుబ్రహ్మణ్యం	
	వంగీపురం శ్రీనివాసన్	
63.	**జి. సరోజమ్మ**	**59**
	వీరవల్లి శ్రీనివాసన్	
	ఇ. సంపత్కుమార్	
	బిభూతి భూషణ దత్తా చిటగాంగ్	
64.	**కె.వి. శర్మ**	**60**
	కృపాశంకర్ శుక్లా	
	బాపుదేవశాస్త్రి నరసింహ దేవపరంజపే	
	సువర్ణ	
65.	**పి. సుందరం**	**61**
	మారుతి ప్రసాద్	
	వై.ఎన్. రెడ్డి	
	సుభాష్ ఎం. బుసునూర్ మఠ్	
66.	**Keith Devlin**	**62**
	టీ. వేంకటేశ్	
	పరశురాం పిళ్ళై	
	శ్రీహరి నాగూర్	
67.	**ఆర్. బాలసుబ్రమణియన్**	**63**
	నల్లూరి విజయప్రసాద్	
	ఎం. సుందరమూర్తి	
	పి.కె. శ్రీనివాసన్	

68. కె. వజ్రవేలు **64**
జి.పి. రాజశేఖర్
నల్లూరు మహేశ్వరరావు
కుంచం శ్యాంప్రసాద్
69. టి.కె.వి. అయ్యంగార్ **65**
జి. రాధాకృష్ణమాచార్య
నందూరి శ్రీనివాసాచార్యులు
ఎస్.బి. రావు
70. బి.ఎల్.ఎస్. రావు **66**
హుజూర్ బజార్
మోహన శ్రీఖండె (1945)
యూక్లీడ్
71. సత్యం శివం సుందరం **67**
డా॥ డి.ఆర్.కె. సంగమేశ్వరరావు
72. డా॥ లక్కోజు సంజీవరాయశర్మ **69**
73. ధూళిపాళ అర్కసోమయాజి **71**
74. శ్రీపద్మావతి **72**
ఆచార్య నల్లాన్ చక్రవర్తుల పట్టాభిరామాచార్యులు
75. Claudius Ptolemy **74**
76. Archimedes of Syracuse **75**
Nicolaus Copernicus
Zeno of Elea
77. Pythagoras of Samos **76**
Leonardo Pisano Fibonacci
Leonardo da Vinci
78. Omar Khayyam **77**
Pappus of Alexandria
Apollonius of Perga
Alkhwarizmi

79.	**Hypatia of Alexandria**	**78**
	Diophantus of Alexandria	
	Eratosthenes of Cyrene	
	Plato	
80.	**Thales of Meletus**	**79**
	Hippasus of Metapontum	
	Tartaglia (Niccolo Fontana)	
	Hippocrates of Chios	
81.	**Menaechmus**	**80**
	Ahmes	
	Nicole Oresme	
	Aristotle	
82.	**Roger Bacon**	**81**
	AntoriZygmund Warsaw	
	లియొనార్డ్ ఆయిలర్	
83.	**సర్ ఐజక్ న్యూటన్**	**83**
	John Willard Milnor	
	Johann Carl Friendrich Gauss	
84.	**Sir William Rowan Hamilton**	**84**
	Tyco - Brahe	
	George Neville Watson	
	Evgeny Michailovich Lifshiftz	
85.	**Gottfried Wilhelm Von Leibniz**	**85**
	Johannes Kepler	
	Neils Henrik Abel	
	Bernoulli Family	
86.	**Georg Fridrich Bernhard Riemann**	**86**

87. **Ernst William Hobson** 87
Paul Richard Halmos
Tom M. Apostol
Andrew Russell Forsyth
88. **James Clerk Maxwell** 88
Jan Luitzen Egbertus Brouwer
Charles Babbage
Janos Bolyai
89. **Andrew Wiles** 89
Georg Keith Batchelor
Galileo Galilei
90. **Gotthold Eisenstein** 90
John Forbes Nash Jr.
Arthur Cayley
Eric Temple Bell
Walter William Rouse Ball
91. **George Dantzig** 91
Tobias Dantzig
Ludwig Prandtl
Sir Michael James Lighthill
92. **Rene Des Cartes** 92
S.S. Pillai
93. **Louis Nirenberg** 93
Stephen Hawking
Albert Einstein
94. **Rolf Hermann Nevanlinna** 94
Blaise Pascal
Arthur Erdelyi
Abraham De Moivre

95. **Harry Bateman** **95**
Joseph Louis Lagrange
Pierre de Fermat
Jean Le Rond D'Alembert
96. **Edmund Georg Hermann Landau** **96**
Brook Taylor
Jean Alexandre Eugene Dieudonne
John Von Neumann
97. **Guiseppa Peano** **97**
Julius Wilhelm Richard Dedekind
George Andrews
Pierre Simon Laplace
Sergei Sobolov
98. **Georg Ferdinand Ludwig Philipp Cantor** **98**
Vito Volterra
99. **Leopold Kronecker** **99**
Ivan Matveyevich Vinogradov
Johann Peter Gustav Lejeune Dirichlet
Marin Mersenne
100. **Jules Henri Poincare** **100**
Grigori Yakovlevich Perelman
Ferdinand Georg Frobenius
101. **Henri Leon Lebesgue** **101**
John Venn
Nikolai Ivanovich Lobachevsky
శకుంతలా దేవి
Simeon Denis Poisson

102. Oliver Heaviside **102**
Edward Thomas Copson
David Hilbert
Erik Ivar Fredholm
103. John Napier **103**
Jacques Saloman Hadamard
Sofia Kovalevskaya
Emmy Amalie Noether
Marie Sophia Germain
104. Ruth Moufang **104**
George Polya
Benoit Mandelbrot
Horace Lamb
Bertrand Arthur William Russell
105. Alfred North Whitehead **105**
Godfrey Harold Hardy
106. Andrey Nikolaevich Kolmogorov **106**
Kazimierz Kuratowski
Stanisław Marim Ulam
Ludwig Josef Johann Wittgenstein
107. Andre Weil **107**
Joseph Fourier
Edmund Taylor Whittaker
Hermann Klaus Hugo Weyl
Norbert Weiner
108. Augustus De Morgan **108**
Girard Desargues
Rene Thom
Lotfi A. Zadeh
George Boole

109.	**Edwend John Routh**	**109**
	Stephan Banach	
	Edouard Jean Bapliste Goursat	
	Kurt Godel	
	George Gabriel Stokes	
110.	**Ernt Friedrich Ferdinand Zermelo**	**101**
	George Green	
	Friedrich Wilhelm Bessel	
	Carl Gustav Jacob Jacobi	
	Ernt Edward Kummer	
111.	**Adrien Marie Legendre**	**111**
	Yau Shing Tung	
	Hua Loo Keng	
	Chern Shiing Shen	
	Seki Kowa alias Seki Tawakazu	
112.	**Michael Francis Atiyah**	**112**
	Yaug Hui	
	Kenjiro Shoda	
	Hans Hahn	
113.	**Alfred Haar**	**113**
	Emile Borel	
	Edward Lorenz	
	Benjamin Bannekar	
	Hermann Minkowsky	
114.	**Marius Sophus Lie**	**114**
	Lars Valerian Ahlfors	
	Constantin Caratheodary	
	Clifford Ambrose Truesdell	
	Garret Birkhoff	

115. **Felix Christian Klein** **115**

Ervin Rudolf Josef Alexander Schrodinger

Max Karl Ernst Ludwig Planck

Ludwig Boltzman

116. **Bernard Placidus Johann Nepomuk Bolzano** **116**

Claude Louis Marie Henri Navier

Richard Courant

Louis Victor Pierre Raymond duc de Broglie

117. **Hermann Ludwig Ferdinand Von Helmholtz** **117**

Theodore Von Karman

Heinrich Eduard Heine

Christian Goldbach

118. **Josiah Willard Gibbs** **118**

Yakuta taniyama

Oliver Dimon Kellog

Gustav Kirchoff

Thomos John I'Anson Bromwich

119. **Sergi Lang** **119**

Gespard Monge

Jean Victor Poncelet

William Kingdon Clifford

Pafnuty Lvovich Chebyshev

120. **Andrei Markov** **120**

Gregorio Ricci - Curbastro

Magmus Gosta Mittag - Leffler

Alexander Grothendic

Maryam Mirzakhani

121. C.E. Weatherburn 121
Marie Ennemond Camille Jordan
Martin Gardner
John Edensor Littlewood
122. Stephen Smale 122
Augustus Edward Hough Love
Louis Melville Milne Thomson
Theodor Wilhelm Karl Weierstass
123. Alan Turing 123
Girolamo Cardano & Lodovico Ferrari
Pierre Laurent Wantzel
Ferdinand, Von Lindemann
124. Johann Heinrich Lambert 124
Charles Hermite
Israel Nathan Herstein
Nathan Jacobson
125. Paul Cohen 125
Alfred Tarski
Donald Knuth
David Blackwell
Emil Artin
126. Terence Tao 126
Van der Waerden
Francois Viete
John Wallis
John Charles Fields
127. Donald J. Newman 127
Waclaw Sierpinski
Charles Jean de la Valle Poussin
Augustin Louis Cauchy

128. Joseph Liouville 128
Yitang Zhang
129. Hermann Schlichting 129
Theodore Von Karman
Issac Barrow
Bourbaki
Sri Thomos Browne
130. Alexander Gelfond 130
Joseph Bernstein
Daniel Kan
Alexander C. Aitkin
131. Haris Aziz 131
Jamal Nazrul Islam
Abram Samoilovitch Besicovitch
Cora Ratto de Sadosky
132. Javier Perez Capdevila Guantanamo 132
Amit Miriam
Kang Tae Kim
Sangtae Kim
133. Sergei Novikov 133
Freeman Dyson
William Dunham
Sir Roger Penrose
134. Atle Selberg 134
John Henry Coates
Ada Lovelace

135. బాబేజు శిష్యురాలై **135**
Alberto Calderon
Bela Bollobas
Ken Ono
136. **Takashi Ono** **136**
Sir Arthur Eddington
137. **Paul Erdos** **137**
138. **Andrew weil** **138**
139. **"Tribute To Srinivasa Ramanujan"** **138**
140. **Leonard Euler*** **144**
141. **Fall Season in New Jersey** **146**
142. **Rene Descartes** **147**
143. గణగణఘంటా! **149**

అద్వితీయమైన క్లాసికల్, పాపులర్ సైన్స్ తెలుగు కంద పద్యమంజరి

అరుణాచలం సృజించిన అపూర్వ విజ్ఞాన సాహిత్య వల్లరి

''... విశాల విశ్వమున భూరి రహస్యములెల్ల విప్ప ఈ మానవజాతి మనుగడకు మంచియగున్ గణితమ్ము వల్లనే–''

''గణితము సౌందర్యమునకు వినియోగమునకు నెలవని వివరింపదగున్
వినియోగము సేవక వృత్తిని సౌందర్యమ్ముదాత్త తేజము దెలుపున్''

''పరిశీలన పరిశోధనలిరు తెరగుల వృద్ధి గోరి హేరాళముగా
వరలను గణిత నమూనాల్ కొరముట్లై శాస్త్ర ప్రగతి కొరకీధరలో''

–అని ఆచార్య పుదూరు విశ్వనాథ అరుణాచలం (1935–2020) గణిత శాస్త్ర ప్రయోజనాన్నీ, ఇంకా గణితానికుండే సేవక స్వభావాన్ని, సౌందర్య ఉదాత్తతను చాలా స్పష్టంగా చెప్పడమే కాక; ఈ శాస్త్రానికి సంబంధించి అబ్జర్వేషన్, రీసెర్చ్ విభాగాలలో మ్యాథమెటికల్ మోడల్స్ ఎలా దోహదపడతాయో కూడా ఈ 'సంగవిద'తొలి పుటల్లోనే వివరిస్తారు.

ఆద్యంతమూ అద్వితీయంగా సాగిన అద్భుతమైన రచన 'సంగవిద'! ఈ పేరు 'సంగవిద' అనగానే ఇదేమిటని అందరికీ సందేహం వస్తుంది. 'సంక్షిప్త గణిత విశ్వదర్శని' అంటే గణిత ప్రపంచాన్ని సంక్షిప్తంగా దర్శింప చేసేదని అర్థం. అయితే ఈ నాలుగు మాటలలోని తొలి అక్షరాలను స్వీకరించి, కొత్త అక్షర సమ్మేళనాన్ని డా. పి వి అరుణాచలం సృజించారు. ఇలాంటి ప్రక్రియను ఇంగ్లీషులో అయితే 'అక్రొనిమ్'అని అంటాం, తెలుగులో దీన్ని 'హ్రస్వరూపం' అనొచ్చు. అంటే శ్రీరంగం శ్రీనివాసరావుని శ్రీ శ్రీ అనడం లాగా అన్నమాట,లేదా జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రిని జరుక్ శాస్త్రి అన్నట్టు! పెద్దలు అరుణాచలం ఇలాంటి ప్రయోగాన్నితరచూ చేశారు. హైస్కూల్ స్థాయిలలో 'క సా గు', 'గ సా భా తరహాలోనే వీరు 'లంబ స్పర్శ రేఖల ఖండన బిందు పథం'అనే దానిని 'లస్పథం'అని వాడారు.

అలాగే'వక్ర నాభుల మార్గం'అనేదానికి 'వనామార్గం'అనే ప్రయోగం చేశారు. ఇలాంటివి ఇంకొన్ని ఉండే ఉంటాయి. మన మాతృభాషలో విజ్ఞానం అనే దృష్టీ, ప్రయత్నం అనేవి మనకు తీవ్రంగా ఉంటే కానీ ఆయన తపన మనకు బోధపడదు.

తర్వాత ఈ పుస్తకం పేరులోనే బ్రాకెట్లో గణితము ప్లస్ సాహిత్యము అని కూడా కనబడుతోంది. అంటే ఇందులో మ్యాథమేటిక్స్, లిటరేచర్ కలిసి ఉంటాయని రచయిత, కాదు కవి సూచిస్తున్నారు. దీన్నే మరో విధంగా చెప్పాలంటే వస్తువు గణితమైతే, వ్యక్తీకరించే విధానం సాహిత్యరూపం అంటే పద్యం. పుస్తకం శీర్షిక క్రింద గణితాత్మకమైన పరిభాషలో కొన్ని చిహ్నాలు కూడా వాడారు. వాటన్నిటిని ఇప్పుడే వివరించి పాఠకులను గాబరా పెట్టాల్సిన అవసరం లేదు. శ్రీశ్రీ పదబంధాలను అనుకరిస్తూ, ఆ స్టాంజాలో ముప్పాతికను స్వీకరిస్తూ ''గణితమ్మొక పద్మవ్యూహం... కవిత్వమొక తీరని దాహం'' అని పెద్దలు అరుణాచలం అనడమే కాదు, ఆ మాటలను పుస్తకం ఇన్నర్ కవర్ మీద దర్శింప చేస్తారు. ఇది ఈ పుస్తకం నామకరణపు అంతరార్థం గురించి స్థూలంగా చెప్పే సమాచారం లేదా అది పాఠకులకు కలిగించే అవగాహన.

ఎనిమిదో తరగతిలో సుదీర్ఘమైన ఆల్జీబ్రా లెక్క పూర్తి చేశాక మా టీచరును నేనే అడిగాను, ''ఇలాంటి క్యాలిక్యులేషన్‌ల వల్ల ప్రయోజనం ఏమిటి, ఎక్కడ పనికి వస్తాయి?'' అని. ఆయన చాలా మంచివారు కనుక చివాట్లు పెట్టలేదు కానీ నాకు సంతృప్తికరమైన జవాబు మాత్రం ఇవ్వలేకపోయారు. అయితే ఆ విషయాన్ని మేము గమనించినా ఆయన దబాయించలేదు. నేను ఎమ్మెస్సీ ఫిజిక్స్ పూర్తి చేసిన తర్వాత, రీసెర్చ్‌కి వెళ్లే ముందు కొన్ని నెలలు హిందూపురం కళాశాలలో పాఠాలు చెప్పినప్పుడు ఇంట్లో ఏడో తరగతి గణితశాస్త్రం టెక్స్ట్ బుక్ తారసపడింది. ఆ పుస్తకం ముందుమాటలో, ''విశ్వాంతరాళంలోని రెండు వస్తువుల మధ్య దూరాన్నీ, ఆ రెండింటి మధ్య పని చేసే బలాలను లెక్క కట్టడానికి గణిత శాస్త్రం పనికి వస్తుం''దని వివరించారు. నిజానికి ''ఏమి చదువులో... ఎందుకో'' అనే మాటలు చాలా తరచుగా అంటూ ఉంటారు. కానీ అలా ఏమీ ఉండవేమో! ఎనిమిదో తరగతి మాస్టరు నాకు అర్థమయ్యేట్టు చెప్పి ఉండేవారు తనకు తెలిసి ఉంటే, అది జరగలేదు. స్కూల్లో పాఠాలు బోధించే టీచర్లు గానీ, ఇంట్లో పిల్లల బాధ్యతను గమనించే తల్లిదండ్రులు కానీ ఆ పుస్తకాల మొదటి పేజీల్లో ఉండే ఉపోద్ఘాతాలు లేదా మున్నుడిగా రాసినవి చదివితే ఇలాంటి ధర్మసూక్ష్మాలు బోధపడతాయి. అలాంటి ధోరణి లేకపోవడం వల్లనే మనకు చాలా చిన్న చిన్న విషయాలు తర్వాత తర్వాత

మరీ అర్థం కాని జటిలమైన గందరగోళాలుగా మిగిలిపోతాయి. అంటే మనం నేర్చుకునే విద్య, సాధించే నైపుణ్యం ఎవరికోసం, ఎందుకోసం అనే స్పష్టత తెలిసి ఉండాలి. అప్పుడే చదివిన చదువుకే కాదు, జీవితానికి కూడా అర్థం ఏమిటో కొంచెం సిద్ధిస్తుంది. నాకు గుర్తుంది, ఎమ్మెస్సీలో ఫిజిక్స్ ప్రొఫెసర్ ''టెక్స్ట్ బుక్ అంటే ఏమిటి'', అని ఒక రోజు అడిగారు, మా క్లాస్మేట్స్ లో కొందరు కొన్ని కొన్ని జవాబులు చెప్పారు. కానీ వాటినన్నింటిని పక్కకు తోసి Text book is one, which gives the concepts అని ఆయన చాలా సూక్ష్మంగా, అర్థవంతంగా చెప్పారు. గైడ్లు, కొశ్చెన్ బ్యాంకులు వంటివి మాత్రమే చదువుకునే ఎంతోమందికి ఇది ఆశ్చర్యంగాను, అర్థం లేని విషయంగానూ అనిపించవచ్చు.

"imagination is more important than knowledge" అని శాస్త్రలోకపు కుల గురువైన Albert Einstein అంటారు. ఇదే విషయాన్ని అరుణాచలం కవితాత్మకంగా ''జ్ఞానము కన్నను ప్రముఖమైనవి భావమ్ములూహలని నుడివిన ఐన్‌స్టైను'' అని పద్యానువాదం ఇందులోనే కనబడుతుంది. దీన్ని లోతుగా పరికిస్తే మరిన్ని విషయాలు మరింత మార్మికంగా మనకే గోచరమవుతాయి. అందుకే ఆ ఐన్ స్టైన్ మహాశయుడే "Pure Mathematics is in its way, the poetry of logical ideas" అని చెప్పిన విషయాన్ని ముందు పేజీలోనే రచయిత మనకు గుర్తు చేస్తారు. అంతేకాదు, గణిత శాస్త్రజ్ఞుడు సంపూర్ణం కావాలంటే ఎంతో కొంత కవిత్వాంశ ఉండాలని Karl Weierstrass చెప్పిన మాటను కూడా గుర్తు చేస్తారు. ఇంకా Sofia Kovalevskaya మహనీయుడు ''ఆత్మలో కవి కానివాడు గణిత శాస్త్రజ్ఞుడు కానేకా''డని చెప్పిన సంగతిని ఇక్కడే గుర్తు చేస్తారు. G.K Chesterton ఇదే భావనను ఇంకొంచెం సృజనాత్మకంగా,''కవి స్వర్గలోకంలోకి తల దూర్చాలని ప్రయత్నిస్తే; గణిత శాస్త్రవేత్త ఆ స్వర్గలోకాలనే తన మస్తిష్కంలోకి అమర్చుకోవాలని వాంఛిస్తా''రని మనం అదిరిపోయేట్టు చెప్పారు. ఒక్క క్షణం ఆలోచన చేయండి. గణితం, కవిత్వం ఈ రెండిటిని సమన్వయం చేసిన మహాతత్వవేత్తలను, ఉత్తమ సాహితీమూర్తులను అన్వేషించి వారు చెప్పిన ఉత్తమ అభిప్రాయాలను మనకందించారు అరుణాచలం. ఒకరికి మించిన రీతిలో మరొకరు చెప్పిన భాషితాలను చూస్తే కొంగ్రొత్త తాత్విక దృక్కోణాలు తరిచి చూచేకొద్దీ

తారసపడతాయి. అదే సమయంలో ఆచార్య అరుణాచలం ఎంత కాలంగా ఈ ప్రత్యేకమైన బాణీలో అధ్యయనం చేశారో కొంత అవగాహన కూడా కలిగే అవకాశం ఉంది.

స్థూలంగా ఆయా గణితాత్మకమైన వ్యక్తుల గురించి వివరించడానికి కంద పద్యాలని ఎంచుకున్నారు డా.పి.వి.అరుణాచలం. ఇందులో తెలుగువారు, భారతీయులు, ఆసియావాసులు, ప్రపంచవాసులు ఇలా ఎంతోమందిని అలాగే ఇప్పుడు ఉన్నవారితో పాటు గతంలో గొప్ప చరిత్రను సృష్టించి మహనీయులుగా మన మదిలో నిలిచిపోయిన వారి గొప్పతనం లేదా రూపొందించిన పద్ధతి లేదా సూత్రం మొదలైన వాటిని జటిలమైనవిగా పేరుగాంచిన కందపద్యాలలో సులువుగా వ్యక్తీకరించారు ఈ కవి. పద్య నిర్మాణానికి సంబంధించి మాట్లాడినప్పుడు అరుణాచలం గారిని కవి అని మాత్రమే మనం సంబోధించాలి, ఎందుకంటే వారి సాహితీ నైపుణ్యం అలా ఉంది. తెలుగు పద్య నిర్మాణంలో అత్యంత క్లిష్టమైనది అని పేరుగాంచిన కందపద్యాన్నే ఈ రచనలో విస్తృతంగా వాడారు ప్రస్తుత కవి. దీనికంటే ముందు ఆయన ఈ విషయాలను చెప్పడానికి వచనం కాకుండా చందోబద్ధమైన పద్య ప్రక్రియను ఎందుకు ఎంచుకున్నారని కూడా కొంత తర్కించాలి. మాటలు చెప్పలేని మెలో డ్రామాని, మనో సంక్లిష్టతను చెప్పడానికి సినిమాలో పాట అవసరమవుతుందని వేటూరి సుందర రామ్మూర్తి ఓ ఇంటర్వ్యూలో చెప్పినట్టు గుర్తు. కొందరికి ఐదారు పద్యాలు లేదా ఇంకొంచెం ఎక్కువ రాసి ఉండవచ్చు. అదే సమయంలో ముగ్గురికి, ఆ మాటకొస్తే బెర్నూలి వంశపు శాస్త్రవేత్తలు ఎనిమిది మందికి కలిపి ఒక పద్యం రాసిన సందర్భం వంటివి కూడా ఈ పుస్తకంలో కనబడతాయి. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి అన్నట్టు వచనమంటే విజ్ఞానమే. దీనినే మనం ఇంకోరకంగా తర్కించి పద్యం అంటే కొంత మార్మికతే అని కూడా చెప్పుకోవాల్సి ఉంది. ఆయా గణిత శాస్త్రపు వ్యక్తుల కృషిలో లేదా ఫలితాల్లో నెలకొన్న జీవనమకరందపు పద్య వ్యక్తీకరణలో ఏదో ఒక రకమైన మేలి ముసుగు వంటి మార్మికత లేకపోతే రక్తి కట్టదు. ఒక పద్యం రాసినా, నాలుగు పద్యాలు రాసినా కవి ఆయా వ్యక్తుల జీవన మర్మాలను అధ్యయనం చేసే ఈ పద్యాలను చెక్కారు. నిజానికి మాట్లాడితే ప్రతి శీర్షికా పద్యానికి లేదా పద్యాల మాలికకు

నేపథ్యం, ఉద్దేశం, సాధించిన ఫలితం అని మూడు కోణాలలో పాఠకులకు విశ్లేషించాల్సి ఉంది. మాస్టారు అరుణాచలం గతించిన ఐదు సంవత్సరాలకు ఈ 'సంగవిద' ప్రచురణ సాకారం అవుతున్నది. మరి 'సంగవిద' ఆధారమైన టీక, తాత్పర్యాలను పోలిన 'సంగవిద కోశము' ఎవరు, ఎప్పుడు చేస్తారు?? ఇప్పుడైతే మనం కలనైనా దాన్ని ఊహించలేము!

(మా) క్లాస్‌రూమ్‌లో యూలర్‌గా పలకబడిన లియోనార్డ్ ఆయిలర్ (Leonhard Euler) శీర్షికన ఏడు పద్యాలు కనబడతాయి. ఈ మహానుభావుడు ఎవరు? 1707–1783 మధ్యకాలం జీవించిన గణిత శాస్త్రవేత్త, భౌతిక శాస్త్రవేత్త, ఖగోళవేత్త, తర్కవేత్త, ఇంజనీరు వగైరా! ఇంకా.. గ్రాఫ్ థియరీ, టోపాలజీ వంటి విభాగాలను ఆవిష్కరించిన ఈ శాస్త్రవేత్త అనలిటికల్ నంబర్ థీరీ, కాంప్లెక్స్ అనాలసిస్ మొదలైన విభాగాలలో కూడా చెప్పుకోదగ్గ ఆవిష్కరణలను ప్రవేశపెట్టారు. అంతకుమించి ఆధునిక గణిత శాస్త్రంలో సరికొత్త చిహ్నాలనూ పదజాలాన్ని వారు ప్రవేశపెట్టారు. పై(π), క్యాపిటల్ సిగ్మా(€), క్యాపిటల్ డెల్టా(Δ) వంటి వాటిని తొలిసారి వినియోగించి ప్రాచుర్యంలోకి అర్థవంతంగా తెచ్చిన ఆలోచనాశీలి, సృజనాత్మక మేధావి ఈ శాస్త్రవేత్త. ఇంకా చాలా విషయాలు ఆయన ప్రతిభ గురించి, సాధన గురించి అందుబాటులో ఉన్నాయి. అంతకుమించి ఆయన జీవితం చాలా తృప్తికరంగా, ఆనందంగా సాగింది. ఆయన భార్య మంచి చిత్రకారిణి కూడా. ఆర్కిమెడిస్, న్యూటన్, గౌస్ తర్వాత గొప్ప వ్యక్తిగా అయిలర్ ను పండితులు పేర్కొలేదు గానీ, వారికి తీసిపోని మహానుభావుడని అరుణాచలం ఈ తొలి పద్యాల్లో వాక్రుచ్చారు.

''గణితము శాస్త్రమొ? కళయో? మనకీ మీమాంస వలదు; మహిలో శాస్త్రమ్మున కాత్మాయగున్, కళకు ఘన భూషణమై చెలంగు'' అని 'గణగణ ఘంటా'అనే పద్యాలలో ఒకచోట అంటారు కవి. దీనిని మనం వివరించనక్కరలేదు. క్రీస్తుపూర్వం 1200 కాలానికి చెందిన లగధ ముని గణిత శాస్త్రపు గొప్పదనాన్ని శ్లోకంగా చెప్పిన పండితుడు, వేదాంగ జ్యోతిష్యాలలో ఘనుడు అంటూ వారికి నమస్సులర్పించి ఈ రచనకు శ్రీకారం చుడతారు. క్రీస్తుపూర్వం 800–740 మధ్యకాలంలో జీవించిన మన భారతీయుడు బౌధాయనుడు 'సమ కోణత్రిభుజపు

సూత్రం' (ఆధునిక పరిభాషలో పైథాగరస్ థీరమ్) ప్రతిపాదించినా కూడా ఆ కీర్తి ఆయనకు దక్కలేదంటూ ''చరిత్ర నిటువంటి ఘటనలు కొల్లల్'' అని ఆ పద్యాన్ని ముగిస్తారు. కేరళ ప్రాంతానికి చెందిన క్రీస్తు శకం 1350-1425 కాలానికి చెందిన మాధవ గురించి ఆ ప్రాంతపు గణిత సంబంధమైన కృషికి ఆద్యుడని కొనియాడుతూ, గణిత శాస్త్రంలో మొదటి విశ్లేషణ చేసిన తొలి శాస్త్రజ్ఞుడు భారతీయుల భాగ్యమంటూ గుర్తు చేయడం మనకు మహదానందంగా ఉంటుంది. ఇలా విరహాంక, హేమచంద్ర, గోపాల, నారాయణ పండితుడు, పరమేశ్వర, పింగళాచార్యుడు, ఎల్లయ్య మంత్రి, శ్రీధర, వేదము లక్ష్మీనారాయణ, తడకమళ్ళ వెంకట కృష్ణారావు, మల్లికార్జున సూరి, వల్లభామాత్యుడు, హరిశ్చంద్ర, పిడపర్తి కృష్ణమూర్తి, తెన్నేటి వెంకటసుబ్బారావు, ఆర్.సి.గుప్తా, ఆర్. వైద్యనాథస్వామి, సి. టీ.రాజగోపాల్, గోవిందస్వామి, ఆర్యభట్టు 2, ఆర్యభట్ట 1, భాస్కర 1, ఒమ్మి రామస్వామి, ఎస్.మీనాక్షిసుందరం, శ్రీపతి, పీ.సీ.మహల్నబీస్, వరాహమిహిరుడు, దత్తాత్రేయ రామచంద్ర కాప్రేకర్, శంకరనారాయణ, లక్కోజు సంజీవరాయ శర్మ, పావులూరు మల్లన, పి.ఎస్.శేషాద్రి, శకుంతలా దేవి, మహా వీరాచార్యుడు, శ్రీనివాస రామానుజన్, బ్రహ్మ గుప్త వంటి భారతీయుల గురించి వారి గొప్పతనం గురించి ఖణేల్ ఖణేల్ అంటూ పద్యాలు పడుతూ ఉంటే మనకు పులకలు రాకమానవు. న్యూటన్, టైకోబ్రాహీ, గెలీలియో, లైబ్నిజ్, బెర్నోలి, మాక్స్వెల్, బాబేజీ, కోపర్నికస్, ఐన్‌స్టీన్ మొదలైన వారి గురించి చెప్పనక్కర్లేదు, అద్భుతమైన పద్యాలు ఉన్నాయి.

కొందరు అద్భుతమైన శాస్త్రవేత్తల గురించి అమోఘమైన పద్యాలు ఇలా ఉన్నాయి:

ఇరాన్‌కు చెందిన క్రీస్తు శకం 1048 -1131 కాలానికి చెందిన ఉమర్ ఖయ్యూమ్ గురించి:

పంచాంగపు లెక్కల సవ
రించిన గణితజ్ఞుడు, కవి, ఇంకెన్నో సా
ధించిన ఘటికుడు ఖయ్యామ్
నెంచి హృదయపూర్వకముగ నిత్తు నివాళిన్

ఎంతో ప్రసిద్ధి చెందిన 'ది మెన్ అఫ్ మ్యాథమెటిక్స్'పుస్తకాన్ని రచించిన స్కాట్లాండ్ రచయిత ఈ.టీ. బెల్ (1883–1960) గురించి:

గణితజ్ఞుల జీవిత కథలను వారి
గణితములను కలగలిపిన విల
క్షణమైన పుస్తకము బెల్
ప్రణీతము లభించె మనదు భాగ్యము పండెన్

మన దేశానికి చెందిన క్రీస్తు శకం 598–670 కాలానికి చెందిన బ్రహ్మగుప్తుడి గురించి:

భారత గణిత పతాకను
తారాపథమున నునిచిన ధన్య చరితుడౌ
సూరి గద బ్రహ్మగుప్తుడు
అరబ్బులు మెచ్చ రతని ఆవిష్కరణల్

ఇటలీకి చెందిన 1564–1642 కాలానికి చెందిన గెలీలియో గెలీలి గురించి:

గణితమ్మును గతి శాస్త్రమును
వినియోగించి ప్రకృతి మోహన సత్యాలను కనబరచిన మహనీయుని,
శాస్త్రజ్ఞుని గలీలెయోను స్తుతింతున్

ఆంధ్రప్రదేశ్ కడప ప్రాంతం, ప్రొద్దుటూరుకు చెందిన 1907–1998 కాలపు లక్కోజు సంజీవరాయ శర్మ గురించి:

పుట్టుకతో లేవు కనులు
దిట్ట గణిత ఖేలనమున – తికమక పరచే
గట్టి సమస్యలనెన్నో
అట్టే ఎదుర్కొనెను శర్మ అతనిని దలతున్

మన గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ కు ఇంగ్లండ్ లో ఎంతో సాయం చేసిన జి.హెచ్.హార్డీ గురించి:

భారత గణిత జ్యోతికి
ప్రేరణ గల్పించి పెంచి పెద్దగా జేసెన్
కారణజన్ముడు హార్డీ
గౌరవపాత్రుడు సతతము గణిత ధరిత్రిన్

అంతర్జాతీయంగా స్టాటిస్టిక్స్ లో గొప్ప ఖ్యాతి పొందిన భారతీయ, తెలుగు శాస్త్రవేత్త సి.ఆర్.రావు గురించి:

కళ, శాస్త్రము, సాంకేతిక
తలు ముప్పేటలుగా వికసితమ్మై విజ్ఞా
నులకు వరము సాంఖ్యకమని
పలికె సి ఆర్ రావు గారు ప్రాజ్ఞులు మెచ్చన్

మన దేశానికి చెందిన, ఏ కాలపు వారో పూర్తిగా తెలియని ఎల్లయ మంత్రి గురించి:

గణితమున కృతులు, వ్యాఖ్యలు
గణనీయముగా రచించి ఘనుడయ్యెన్ తెనుం
గున – నెల్లయ మంత్రి వరుడు
ప్రణుతించ వలయు నతని పరిణత ధిషణన్

అలాగే 12వ శతాబ్దికి చెందిన తెలుగు ఘనుడు ఎలుగంటి పెద్దన గురించి:

తెలుగున గణిత గ్రంథం
బులు రచియించుట సకృతు పూర్వము, ధృతితో
నెలుగంటి పెద్దనార్యుడు
వెలయించే నొక గణిత కృతి – వినతుల తనికిన్

తిరుపతివాసి, కెనడాలో గణితవేత్తగా రాణించిన మతుకుమల్లి వెంకట సుబ్బారావు (1921–2006) గురించి:

అంకెల కాననమందు వి
శృంఖలముగా తిరిగినట్టి సింహమనంగా

వెంకట సుబ్బారావ్ మో
దంకర బోధకుడు, గురువు తలతును ప్రీతిన్

– ఇలా ఏ పద్యానికాపద్యాన్ని అద్భుతంగా గణిత మనోరంజకంగా ఆచార్య పుదూరు విశ్వనాథ అరుణాచలం తీర్చి సృజించారు. ఎవరికి వారు గణిత శాస్త్రమర్మాలను ఎరిగి విజ్ఞాన సాహిత్యపు లోతులను తనివితీరా ఆనందపు మునకల్లో మేళవించుకోవచ్చు.

ఇక పద్య నిర్మాణంలో పెద్దలు అరుణాచలం ఎంత సంప్రదాయవాదో, అంతకు మించిన రీతిలో ప్రయోగశీలి అని కొన్ని పద్యాలలోని వారి పోకడలు గమనిస్తే బోధపడుతుంది. ఒకటవ ఆర్యభట్టు గురించి రాసిన పద్యంలో π (పై) ని అంతర్భాగంగా చేసేశారు. అలాన్ టూరింగ్ (1912–1954) గురించి రాసిన పద్యం ఇలా సాగుతుంది:

టీ సీ ఎస్, ఏ ఐ లను భాసిల్లగ జేసి తనదు పరిశోధనలన్
వాసిగని అలాన్ టూరింగ్ సూసైడుకు పాల్పడియెను క్షోభ మిగిల్చెన్

ఇందులో థీరిటికల్ కంప్యూటర్ సైన్స్ (టీ సీ ఎస్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ) అనే మాటలను కుదించిన రూపంలోనూ ఇంకా అలాన్ టూరింగ్, సూసైడు పదాలను అలాగే కందంలో అందంగా అమర్చేశారు అరుణాచలం గారు. కనుక ఛందోబద్ధమైన పద్యం రాశారు కనుక, వీరు కరుకు సంప్రదాయవాది అని తీర్మానించాల్సిన పనిలేదు. హాయిగా ఇంగ్లీషు అదే సైన్సు పదాల్ని అలాగే తెలుగు పద్యంలో మిళితం చేసేశారు.

ఇది సంక్షిప్త గణిత విశ్వదర్శిని మాత్రమే కాదు, అరుణాచలం మహాశయుడి అమోఘ వైజ్ఞానిక సాహిత్య క్రీడా నైపుణ్యపు ప్రదర్శిని!

– డాక్టర్ నాగసూరి వేణుగోపాల్

ఆకాశవాణి పూర్వ సంచాలకులు , ప్రముఖ సైన్స్ రచయిత

విశ్వదర్శనం

ఈ పుస్తకం పేరు **'సంగవిద'** అంటే **'సంక్షిప్త గణిత విశ్వదర్శిని'**: ఈ పేరుని సంక్షిప్తం చేసి 'సంగవిద' అనే చిన్న నామం ఇచ్చారు రచయిత ఆచార్య పుదూరు విశ్వనాథ అరుణాచలం. ఈ శీర్షికే ఒక మహా సందేశాన్ని ఇస్తుంది. అదేమిటంటే సంక్షిప్తత గణితానికి ప్రాణం అని. ఒక రకంగా చెప్పాలంటే ఏ విషయాన్నయినా సంక్షిప్తంగా చెప్పడం గణితశాస్త్రపు ప్రధాన లక్షణం. ఎంత చిన్న గణిత సూత్రమైనా తక్కువ మాటలతో ఎక్కువ జ్ఞానాన్ని అందించే విధంగా నిర్మితమౌతుంది. ఆదిలోనే చదువరికి అవగత మయ్యేది ఏమిటంటే ఈ పుస్తకంలో చిన్న చిన్న పద్యాల ద్వారా గణితశాస్త్ర చరిత్రని, ఆ శాస్త్రవేత్తలనేకుల ప్రతిభా విశేషాలని ఒక చక్కని సినిమాలా ప్రదర్శించబోతున్నారని. అంతేకాదు వారందరూ ఆవిష్కరించిన విజ్ఞానం, తద్వారా వారు ఇతర శాస్త్రజ్ఞులకీ ప్రజలకీ అందించిన సందేశాలు, ఇంకా అనేక గణిత విన్యాసాలూ తాను దర్శించబోతున్నానని. ఏ విధంగా గణితశాస్త్రం మిగతా శాస్త్రాలకి ఆధారంగా నిలబడుతోందో తద్వారా ఏవిధంగా మానవాళికి పట్టుగొమ్మవుతోందో, గణిత శాస్త్రజ్ఞులు మానవాభ్యుదయానికి ఎంతగా కృషి చేశారో ఈ పుస్తకం సూచనప్రాయంగా, సంక్షిప్తంగా తెలియజేస్తుంది.

రచయిత ఆచార్య అరుణాచలం గారు గణిత శాస్త్రాన్ని ఆపోశన పట్టిన పరిశోధకుడే కాక ఒక విశ్వవిద్యాలయంలో తన బోధన ద్వారా అనేక మంది గణిత శాస్త్రజ్ఞులని ప్రపంచానికి అందించిన ప్రాచార్యుడు. తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో తెలుగులో గణితశాస్త్ర గ్రంథాల తయారీలో రచయితగా, సంపాదకుడిగా అపార కృషిచేసిన విజ్ఞుడు. విశేషించి ఎందరో గణితశాస్త్ర అధ్యాపకులకి ప్రియమిత్రుడు. ఇటు గణితంలో ఇంత ఉన్నతితో పాటు తెలుగు భాషా పాండిత్య కవిత్వ రంగాలలో ప్రశస్తిగాంచిన కవిచంద్రుడు. ఈ విధంగా అనేక రంగాలలో తలపండిన **ఆచార్య అరుణాచలం** గారికీ ప్రౌఢ వయస్సులో కలిగిన మహా సంకల్ప జనితమే ఈ పుస్తకం. ప్రపంచాభ్యుదయంలో కీలకపాత్రని అనాదిగా పరోక్షంగా నిర్వహిస్తున్న గణితశాస్త్రపు విశ్వరూపాన్ని పాఠకుల కళ్లకి కట్టేటట్లు ఆవిష్కరించడమే ఆ

మహాసంకల్పం. అటువంటి మహాకార్యానికి పూనుకున్న ఆయన అందుకోసం చేసిన కృషి ఒక మహాయజ్ఞాన్ని మించిపోయింది. గణితశాస్త్ర మహాసౌధానికి మూలస్తంభాలుగా నిలిచిన, నిలుస్తున్న ఎందరో మహాత్ముల గాథలని, వారి శేముషిని, వారి కృషిని అనేక గ్రంథాల నిశిత పరిశీలన ద్వారా ఆకళింపు చేసుకుని రచనకి తేలికయిన తేటగీతులనీ ఆట వెలదులనీ కాదని క్లిష్టమైన కందపద్యాల ద్వారా అశేషాంధ్ర పాఠక లోకానికి ప్రదర్శించడం అంటే సామాన్యమా? క్రీస్తు పూర్వం 1605 ప్రాంతాల నుంచి గణిత శాస్త్ర మహా వటవృక్షం ఎలా పెరిగిందో సంక్షిప్తంగా ఒక చలనచిత్రంలా ప్రదర్శించే ఈ మహా యాగానికి ఋత్విక్కూ, కర్తా తానే అయి నిర్వహించిన **ఆచార్య అరుణాచలం** గారి కృషీ, శేముషీ, కవితాశక్తీ మాటలకి అందనంత ఉన్నతాలు. ఈయన ఎంచుకున్న కందపద్యాలు కూడా సంక్షిప్త సుందరాలై రమ్యమైన శైలిలో మరీ మరీ చదివించే విధంగా అలరారుతున్నాయి. మచ్చుకి మూడు పద్యాలని ఉదాహరిస్తాను.

సౌందర్యమును గణితమున
సందర్శించిన గణిత విశారదులందున్
ముందుగ రామానుజునకు
వందనమిడి పిదప దలతు పౌల్ ఎర్డోసున్ (Pawl Erdos)

ఒక కొంత కవిత్వాంశము
ప్రకటించని గణితవేత్త పాండిత్యము పూ
ర్ణ కళా సంశోభితమగు
ట కుదరదని చెప్పె ''వయరు స్ట్రాస్'' (Weier Strass) స్తుతమతియై

జ్ఞామితిపితగా ఖ్యాతిన్
భూమండల మందు పొంది పుణ్యపురుషుడౌ
శ్రీమంతుని **"యూక్లీడు"** సు
ధీమంతుని అతని గణిత దీప్తిని దలతున్

"కందం చెప్పిన వాడేకవి, (అడవి) పందిని కొట్టిన వాడే వీరుడు" అని నానుడి. ఈ పుస్తకంలో ఎన్నో అందమైన కంద పద్యాల ద్వారా అశేషాంధ్ర పాఠక లోకాన్ని రంజింపచేస్తూ 'సంక్షిప్తత'కి పెద్ద పీట వేసిన **ఆచార్య అరుణాచలం** గారిని మనసారా అభినందిస్తూ ఈ నాలుగు మాటలు రాసే అవకాశం నాకిచ్చినందుకు ఆనందిస్తూ వారికీ చదువరికీ నడుమ నుంచి ఇక తప్పుకుంటాను.

4-12-2019

భవదీయుడు,

పొన్నపల్లి వెంకటకృష్ణయ్య

విశ్రాంతాచార్యుడు

గణితశాస్త్ర శాఖ, ఆంధ్రవిశ్వకళాపరిషత్తు

విశాఖపట్నం.

''ఒక చక్కని కృషి''

బాబా ఆటమిక్ ఎనర్జీ ప్రధాన క్షేత్రపాలకుడుగా వుండిన డా॥ రాజా రామన్న అద్వైత వేదాంత విషయపరిజ్ఞానం పుష్కలంగా వున్నవాడు. మంచి సంగీతాభిరుచీ వున్నవాడు.

భారత మాజీ రాష్ట్రపతి కీ.శే. డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం, గొప్ప శాస్త్రజ్ఞుడే, అయినా గొప్ప సంగీతాభిమాని, వైణికుడు కూడా.

కీ.శే. లక్కోజు సంజీవరాయశర్మ అంధుడే అయినా గొప్ప గణితజ్ఞుడు, వాయులీన విద్వాంసుడు కూడా.

కీ.శే. జయంతి రామయ్య పంతులు గారు సహాయ కలెక్టరుగా గొప్ప పదవిలో వుండినవాడు, శాసన పరిశోధకుడు.

ఒకప్పటి కలెక్టరు, విద్యాశాఖ మహోన్నతాధికారి ఎన్. రామేశన్ గారు సాహిత్య, చారిత్రక పరిశోధకుడు.

ఇప్పటి కె.వి. రమణాచారిగారు, ఐఏయస్ అధికారి. తెలుగు సాహిత్యంలో పరిశోధకులు.

ఇలాంటివి అనేకోదాహరణలు ఒకవిషయాన్ని తెల్పటం గమనించ వచ్చు. వృత్తులకు, ప్రవృత్తులకు సంబంధమే లేదని నిరూపించే 'ఇతివృత్తాలు' ఇవి.

ఇప్పుడీ చర్చ అంతా యెందుకు? అంటే డా॥ పి. అరుణాచలం గారు వర్తమాన భారతదేశంలోని గణిత శాస్త్రవేత్తలలో అగ్రేసరులనిపించుకున్న వారిలో ఒకరు.

దేశంలో యెక్కడ 'గణిత శాస్త్ర సంబంధ సభలు, చర్చలు, గోష్ఠులు, కార్యశాలలు, పరీక్షలు' ఏం జరిగినా అవశ్యం సాక్షాత్కరించే ఉత్తమ మనిషి, ఆంధ్రప్రదేశ్లో కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయానికి తొలి ఉపాధ్యక్షులు.

ఆయన గురించి యిప్పుడెందుకు? అంటే– శ్రీయుత పి. విశ్వనాథ అరుణాచలం గారు కేవలం గణిత శాస్త్రజ్ఞులు మాత్రమే కాదు.

వారొక సాహిత్య పుంభావ సరస్వతి. పద్యం, గద్యం, చరిత్ర సాహిత్య సంబంధిత విషయమేదయినా కూలంకష ప్రజ్ఞావిశేషాలు కల ఘనాపాఠి.

ఒక ప్రముఖ గణిత మేధావికి, వర్తమాన కాలంలో ఇంతటి సాహిత్య పరిచయమెలా సాధ్యం?

(వర్తమానం అనడం యెందుకంటే గత శతాబ్దాలలో ఇదేమీ అబ్బురం కాదు. వరాహమిహిర, కాళిదాస, భాస్కర, ఆర్యభటాదులు, ఉమర ఖయాం, డావిన్సీ, ప్లాటో, వాల్టేర్ వంటి వైదేశికులు, మహా వీరాచార్యాది జైన పండితులు, పావులూరి మల్లన, ఎల్లయ మంత్రి, ఎలుగంటి పెద్దనాది ఆంధ్ర పండితులు కవులయినా – గణితాసక్తులయి వుండిన చరిత్ర వున్నది కనుక)

ఎలా అంటే – అరుణాచలం గారికీ, కార్వేటినగర సంస్థానికి అపూర్వాను బంధం వున్నది కనుక. కార్వేటి నగరసంస్థానం సకల కళలకు కాణాచిగా ఒకప్పుడు ''విజయనగరం (రెండూ), గద్వాల, ఆత్మకూరు, వెంకటగిరి సంస్థానాలకు దీటుగా'' విరాజిల్లినది కావడం.

ఆ సంస్థానంలో ఎందరెందరో పదకర్తలు, పద్యకవులు, నృత్య శిఖా మణులు ప్రతిభకు మించి కీర్తులందించినారు కనుక,

ఆ నేలలో పుట్టి, ఆ గాలీ నీరూ, పంటలూ, విద్యా,అనుభవించి మేధ పెంచుకొనిన అరుణాచలం గారికీ ఆ వాసన సోకకుండా ఎలా వుంటుందీ?

అందుకే ఇంతటి సాహిత్యరంగప్రవేశార్హత వారికి కలిగింది. వారు చాలామంది అధ్యతన కవుల రచనలకు పీఠికలు వ్రాసినారు. కార్వేటి నగర స్థానకవుల చరిత్ర రచించినారు.

గణిత శాస్త్రానికి సంబంధించిన పలుప్రక్రియ రచనలనూ వెలయించినారు.

అటువంటి ధిషణామూర్తికి ఒక ఆలోచన ఇటీవల అంకురించినది. గణితము – సాహిత్యము' సంబంధం కలవే కదా?

ఆ మాటకు వస్తే 'గణితంలో సంబంధం లేని' ఒక్క 'విషయమైనా వుందా?' అని ప్రశ్న.

సంగీతం, సాహిత్యం, శిల్పం, చిత్రం, నృత్యం, ఛందస్సు, వ్యాకరణం, జ్యోతిషం, ఖగోళ, భూగోళ, పౌర సామాజిక శాస్త్రాలు, వ్యవసాయం, అంతెందుకు, మానవ జీవిత సర్వస్వమూ తల్లిగర్భంలో ప్రవేశించినది మొదలు పుడమితల్లి గర్భంలో శయనించేంత వరకూ సమస్తమూ గణిత సంబంధమే కదా!

అలాంటిది సాహిత్యంతో సంబంధం లేకుండా ఎలా వుంటుందీ?

ఆ 'గణిత – సాహిత్య సంబంధ' నిరూపణార్ధమే ఒక అంశాన్ని సంకల్పించుకొని – ఇదిగో ఈ 'సంగవిద' రచనను పద్యరూపంలో ప్రపంచానికి అందించడంలో కృతకృత్యులయినారు.

'సంగవిద' – చాలా క్రొత్తగానూ, వింతగానూ కనిపిస్తూ, వినిపిస్తూ ఇదేదో 'బౌద్ధ సంబంధమో, జైన సంబంధమో' అయిన గాథ కాబోలు! అనిపించేలా తోస్తుంది.

కానీ ఇది అచ్చమైన తెలుగే. ''సంక్షిప్త గణిత విశ్వదర్శిని'' అనే దీర్ఘ వాక్యానికి ''పొట్టి పేరు సంగవిద''

అదే మరి గణిత మేధావి మేధాచాతుర్యం ఒక గణితజ్ఞుని పద్యమా! అని అధిక్షేపించవలసిన పనే లేని అనర్గళ ధారా వర్షితమైన రచన.

నిస్సందేహంగా, పద్యాన్ని ''మాట్లాడుకుంటున్నట్లు'' పాడు కొంటున్నట్లూ కూడా వ్రాయగల ప్రజ్ఞ శ్రీ అరుణాచలం గారిది.

వారు తమ రచనలో దాదాపు ఐదువందల మంది దేశ, విదేశ గణిత శాస్త్రవేత్తల విశేషాలను లలిత సుందరమయిన 'పద్యబంధాలలో' అలంకరించి వివరించినారు.

గణితం అంటేనే 'అబ్బో' ఒక డ్రై సబ్జెక్టు మళ్లీ అది పద్యంలోనా? అని పాఠకులెవరు కూడా భయపడ వలసిన పనిలేనంత సులలితంగా సుతారంగా పద్యం చెప్పిన తీరు తప్పక మెచ్చుకొని తీరవలసినదే.

ఇంచుమించు 'కందపద్యాలలోనే' అనేకం చెప్పడం జరిగింది. ఎక్కడో ఒకటి రెండుచోట్ల ఇతర ఛందస్సు తేటగీతి వంటిదీ, వృత్తాలలో చెప్పడం జరిగింది.

ఏ పద్యమయినా – సుందర సుకుమార శైలిలో చెప్పిన తీరు అమోఘం. కొన్ని పద్యాలయితే 'గలగల పారుతున్నట్లే' వినిపిస్తాయి కూడా చూడండి!

''టక్కరి, రక్కసి, రూపసి
యొక్కతె, నెమ్మనమున పెను ఉద్రేకపు కై
పెక్కించగ, క్రొవ్వలపుల
ముక్కోణములోన జిక్కి ముగిసెను గ్యాల్వా!''

అంటూ ''గ్యాల్వా'' గణితజ్ఞుని గూర్చి శబ్ద సుందర పద్యం రచించాడు. అలాగే 'హెరాల్డ్ హార్డీ' గురించి

''భారత గణిత జ్యోతికి
ప్రేరణ గల్పించి పెంచి పెద్దగ జేసెన్
కారణ జన్ముడు హార్డీ
గౌరవ పాత్రుడు సతతము గణిత ధరిత్రిన్''

అంటూ అందమైన కందాన్ని అందించినారు.

ఇక మాటలాడుకునేట్లుగా వ్రాసిన పద్యాలు అధికంగానే అవుపిస్తాయి. వాక్య నిర్మాణంలో పదాలకోసమో గణాల కోసమో తడ బడి పూరణార్థకాలు చేర్చి ముగించిన పద్యాలు మచ్చుకైనా కనబడక పోవటం 'ఆచార్యుల'వారి విశిష్టత.

మరి వృత్త పద్య రచన అందామా! చూడండి! ''మహదాశ్చర్య కర త్వదీయ పటుధీమాహాత్మ్యమున్ గాంచి ప్రత్యహమున్ తతగతిన్ గురించిన వ్రతముల్ యాగముల్ సేయుమీ, గృహదైవములు తల్లిదండ్రులు మహాదృష్ట ప్రమోదాత్ములై రహియింపన్ గణిత క్రియా విజయ విక్రాంతుండవై వెల్గుమా, అంటూ గణితావధాని 'కానాల శ్రీహర్షచక్రవర్తిని ప్రబంధ ధారణా ఘనుడు తండ్రి' నలచక్రవర్తి వలె

ఆశీర్వదిస్తూ చెప్పిన పద్యం వంటివి అక్కడక్కడా కనిపించి ఆశ్చర్యానికి గురిచేస్తాయి.

ఒక సుప్రసిద్ధ గణిత శాస్త్ర సాగరమగ్నుడు, ఇంత చక్కని పద్య సాహిత్య స్రష్ట కావడం సరస్వతీ కటాక్ష వీక్షణాలబ్ధ వరమే.

నిజానికి ఆధునిక కవిత్వ ప్రస్థానంలో బహుశా ఇదే ''తొలి గణిత పద్య రచన' అనినా అసంభావ్యమేమీ కాదు.

శ్రీ పి.వి. అరుణాచలం గారి అమృతలేఖిని నుండి మరిన్ని ఇటువంటి 'గణిత పద్య రచనలు' వెలువడుతాయని ఆశించటంలో దురాశయేమీ లేదనుకుంటాను.

జి. సుబ్రహ్మణ్య శాస్త్రి
పూర్వకార్యదర్శి, సూరన సారస్వత సంఘం.

మనసులోని మాట

ఆచార్య పి.వి. అరుణాచలం గారు సంక్షిప్త గణిత విశ్వదర్శిని (సంగవిద) అనే గ్రంథాన్ని వెలువరించడం ముదావహం. ఇందులోని వస్తువు ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుల మౌలిక ఆవిష్కరణలను పద్య రూపంలో పొందు పరచడం. ప్రతి గణిత శాస్త్రజ్ఞుని దేశకాలాదులను ఇందులో తెలిపియున్నారు. వీరు గణుతించిన గణితశాస్త్రజ్ఞులు ప్రపంచ వ్యాప్తంగా నున్నారు.

వీరు ఈ గ్రంథము నందు గణితశాస్త్రజ్ఞులనే కాక గణిత పండితులను, వీరి సహోద్యోగులను, గణిత ప్రచారకులను, అసాధారణ మేధావులను (ఉదా॥శ్రీ సంజీవరాయ శర్మగారిని) గుర్తించి ప్రస్తావించినారు. అంటే గణితంలో ప్రజ్ఞాపాటవాలున్న ప్రాచీనుల నుండి ఆధునికుల వరకు ప్రాచ్యులను మరియు పాశ్చాత్యులను ఇందు పరిచయము చేసియున్నారు. పుస్తకము పేరు విశ్వదర్శినిలోనే ఇది సూచింపబడియున్నది.

వీరు ఈ గ్రంథ రచనకు ఎన్నుకొన్న చంధస్సు కంద పద్యము. ఒక శాస్త్రవేత్తకు ఒక కందపద్యము లేదా రెండు, మూడింటిని కూడ వాడియున్నారు. కందములనే కాక, చంపకమాలాదులను కూడ అరుదుగా వాడియున్నారు. వీరు కందములను తన రచనలకు ఎన్ను కొనుటలో వీరికి కందము పైన గల ఎక్కువ మక్కువను తెలియ జేయుచున్నది. విషయమును సంక్షిప్తముగా చెప్పదలచినచో కందమే ప్రథమశ్రేణిలోనిదని చెప్పక తప్పదు. పాశ్చాత్య గణిత శాస్త్రజ్ఞుల పేర్లను కందములో చొప్పించడం కష్టసాధ్యమైన కృషి, సీస పద్యాదుల వలె కాక కందమునకు చంధోరీత్యా కఠిన నియమములున్నవి. కాని రచయిత చాల నేర్పుతో పై కార్యమును నెరవేర్చినారు. అందువలన వీరి కవిత్వములోని శయ్యామాధుర్యము ఎంత మాత్రము కొరవడలేదు.

ఉదా॥ భూకేంద్ర వాదపుష్టికి
శ్రీకారము చుట్టినట్టి శిష్టుడు, కృతులన్
లోకోత్తరముగ కూర్చెను
వాకొనవలె **టాల మీ**ని వందనములతో

జ్యామితి పితగా ఖ్యాతిన్
భూమండల మందు పొంది పుణ్యపురుషుడా
శ్రీమంతుని **యూక్లిడు** సు
ధీమంతుని అతని గణిత దీప్తినిఁ దలతున్.

పై పద్యములు సుగమములు మరియు సుందరములు. కంద పద్యమే ఇతని శ్వాస అని చదువరులు గుర్తింపగలరు.

సంస్కృత, ఆంధ్ర కవివర్యులను గూర్చి ఒక్కొక్క కంద పద్యములో ఒకరిని గూర్చి చెప్పబడిన రచనలు ఇదివరలో రచింపబడియున్నవి. కాని సాంకేతిక నిపుణులను గూర్చి ఇటువంటి ప్రయత్నము జరగలేదు. ఆ భాగ్యము ఆచార్య అరుణాచలం గారిని వరించినది. వేరు శాస్త్రజ్ఞులను గురించి వ్రాయగోరు వారికి ఇది స్ఫూర్తిదాయకముగా నిలువగలదు.

వీరు, గణిత విద్యాధ్యయనము మొదలు, పరిశోధన, పాశ్చాత్య గణిత శాస్త్రజ్ఞుల పరిచయము, బహుగ్రంథ పఠనము, దీర్ఘకాల విద్యాబోధనలలో విహంగ వీక్షణముతో పాటు అపారలోకజ్ఞానమును గడించినందునఈ గ్రంథ రచనకు ఎనలేని న్యాయమును చేకూర్చి యున్నారనిచెప్పక తప్పదు. గణిత శాస్త్రపు ప్రపంచ సీమాంతములను, అవి పోవు పోకడలను, వాటి కారణ భూతులను వీరు క్షుణ్ణముగా గుర్తించి యున్నారు. ఈ సాధికారత గ్రంథములో ఎడనెడా ప్రస్ఫుటమగుచున్నది. ఈ దృష్టితో రచయితను సందర్శించిన ఈ రచనలలోని అపూర్వ విలక్షణత, ఇతర సాధ్యత్వము తేటతెల్లమగుచున్నది. ఈ గ్రంథ పాఠకులు పద్య అవగాహనా సామర్థ్యము, గణితశాస్త్ర ప్రవేశము కలిగి యుండవలెను.

గణితమును గూర్చి వీరు వ్రాసిన రెండవ గ్రంథమిది. మొదటిది ఆంగ్లములో ఇదివరకే వెలువడి యున్నది.

భారతీయ పాశ్చాత్య గణిత నిపుణులతోటి గణిత క్రొత్త పోకడలు మరియు వారితో నిరంతర చర్చ ఆదాన ప్రదానాలు నెరపియున్నారు.

వీరు అనేక గణిత సమ్మేళనాలలో, అధ్యక్ష పదవితోపాటు సమన్వయ కర్తగా వ్యవహరించి పలువురి దృక్పథములను లోతుపాతులను ఆకళింపు చేసికొని

యున్నారు. వీరు అనేక నూతన గ్రంథములకు భూమికలను వ్రాసి కొత్త రచయితలను ఆశీర్వదించి యున్నారు.

ఈ గ్రంథ పఠనము వలన మనకు తెలియని ఎన్నో అపూర్వ విషయములు తెలియవచ్చుచున్నవి.

తెలుగు పద్యాలలో గణితశాస్త్రం గురించి ఎన్నో విషయాలను 11వ శతాబ్దములోని పావులూరి మల్లన విరచించియున్నారు.

ప్రాచీన భారతీయులు ప్రథమముగా అనేక విషయములను ఆవిష్కరించి నప్పటికి అవి వెలుగులోకి రాకుండ అవే విషయాలను పాశ్చాత్య శాస్త్రజ్ఞులు ప్రథమముగా కనిపెట్టినట్లు గణితశాస్త్రములో ప్రచారములో నున్నది.

కేరళలో పెక్కురు గణిత శాస్త్రజ్ఞులు ఉన్నట్లు ప్రస్తావించినారు. వీరిని గురించి చాలామంది గణితశాస్త్రజ్ఞులకే తెలియక పోవచ్చును. ఇది ఒక కనువిప్పు.

జన జీవితంలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొన్నట్లే గణితశాస్త్రజ్ఞులు కూడ వాటిని ఎదుర్కొని, అధిగమించి క్లిష్ట పరిస్థితులలోను తమ శాస్త్ర ఆవిష్కరణలకు ఎనలేని సేవచేసియున్నారు. ఇవి దేశకాలాతీతమైనవి. వీరిలో ఎందరో విషాద జీవితమును చవిచూచినవారు, అల్పాయుషులు, విధివంచితులున్నారు. ఈ మేధావుల జీవితములను తలచుకొన్నచో కన్నులు చమర్చక మానవు. కొందరు గణిత శాస్త్రజ్ఞులు అప్పటి రాజకీయ, సాంఘిక పరిస్థితులు ప్రతికూలముగానున్నను, దానికి వెరవక వారి ఆవిష్కరణలనుబహిర్గత మొనర్చినారు. వీరిని గూర్చి ఒక ప్రత్యేక గ్రంథమే వ్రాయవలసిన అవసరమున్నది.

గణితమున లోతైన అవగాహన, పరిశోధన, ఆవిష్కృతులు, గణిత ప్రౌఢిమ శుభలక్షణములని రచయిత నుడివియున్నారు.

వీరు విద్యార్థిగా నున్నప్పుడే పద్యరచన, ఆశుకవిత్వము అలవరచుకొన్నారు. వీరు ఉద్యోగ జీవితమును ఉపన్యాసకులుగా ప్రారంభించి క్రమ క్రమముగా వివిధ పదవులను అలంకరించి ద్రవిడియన్ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా పదేళ్లు పదవి నలంకరించి విరమణ చేసి పిదప తిరుపతిలో ప్రస్తుతము ప్రశాంత నిరాడంబర

జీవితమును గడుపుచున్నారు. ఆబాల గోపాలమునకు అందుబాటులో నుండి వారి సందేహముల నివృతి చేయుచున్నారు. విద్యార్థుల స్థాయిని బట్టి వారికి సుబోధమగునట్లు వారి సందేహములను తీర్చుట వీరికి వెన్నతో పెట్టిన విద్య.ఉన్నత పాఠశాల నుంచి సర్వకళాశాల సమావేశ ఆహ్వానములను మన్నించి వారికి తగిన రీతిని సూచనలను సలహాల నిచ్చి ప్రోత్సహించేవారు.

వీరి జీవిత ప్రగతికి ముఖ్య ఆలంబనమైన గణితశాస్త్రమునకు ఈ అరుదైన గ్రంథమును కానుకగా సమర్పించి కొంతమేర తన ఋణమును తీర్చుకొన్నారు. ఇది వీరి విశిష్టత. వీరి జీవితముతో సన్నిహిత సాన్నిధ్యమున్న వారికి వీరికి ఒక కన్ను గణిత శాస్త్రమైనచో మరియొక కన్ను ఆంధ్ర సాహిత్యమని సులభముగ తెలియగలదు.

వీరికి విశ్వేశ్వరుడు ఆయురారోగ్య ఐశ్వర్యములిచ్చి, ఇటు వంటి మరెన్నో గ్రంథ రచనలకు కావలసిన జవసత్వాలు, మనో బలాలను అనుగ్రహించవలెనని మనసారా వేడుకొనుచున్నాను.

శుభమస్తు!

సీకాయపట్టెడ కె. సుదర్శనం,

కె.ఆర్. నాగరాజన్, ఎం.ఎ., ఎం.ఇడి.,

≈ Pure Mathematics is in its way, the poetry of logical ideas.

- Albert Einstein

≈ The difference between the poet and the mathematician is that the poet tries to get his head into the heavens while the mathematician tries to get the heavens into his head.

- GK. Chesterton

≈ A mathematician who is not also something of a poet will never be a complete mathematician.

- Karl Weierstrass

≈ Mathematics is very much like poetry...... what makes a good poem-a great poem is that there is a large amount of thought expressed in very few words.

- Lipman Bers

≈ It is imposible to be a mathematician without being a poet in soul.

- Sofia Kovalevskaya

≈ ‘‘Chebyshev said it, but I’ will say it again; There’s always a prime between n and 2n’’

- Nathan Fine

≈ ‘‘Minus times minus is equal to plus, The reason for this we will the need not discuss’’.

- W.H. Auden

కృతజ్ఞతలు

ప్రసిద్ధులైన మా నాన్నగారు, ఆచార్య విశ్వనాథ అరుణాచలం గారు, తన తొలినాళ్ళనుంచీ తెలుగు సాహిత్యం పైన ఎంతో మక్కువతో జీవించారు. ఆయన తీరికలేని ఉద్యోగజీవితానికి సాహిత్య సృజన నిరంతరాయమైన ఉపనదిలా సాగివచ్చింది. ప్రసిద్ధులైనగణిత శాస్త్రవేత్తలపైన ఆయన రాసిన ఈ పద్యాలనన్నింటినీ సంగవిద అనే యీ పుస్తకంగా రూపొందించి ప్రచురిస్తున్నాము. ఈ సందర్భంగా సహధర్మచారిణిగా ఆయనకు అన్ని రకాల సహాయ సహకారాలను అందించిన మా అమ్మ, శ్రీమతి సుశీల గారిని స్మరించుకుని స్ఫూర్తిని పొందుతున్నాము. వారిరువురికీ ఇష్టమైన పుస్తకాలను ప్రచురించి తెలుగు పాఠకలోకానికి సమర్పించగలిగినందుకు ఆనందిస్తున్నాము .

మానాన్నగారి మిత్రులు, అభిమానులు, శిష్యులు అనేకమంది తోడ్పాటు లేకపోయివుంటే ఈ పని యింత సమగ్రంగా జరిగి ఉండేది గాదు. వారందరికీ మా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు.

ఈ పుస్తకానికి ఆలోచనాత్మకమైన ముందుమాటను అందించిన డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ గారికి నిండుమనస్సుతో కృతజ్ఞతలు.

సీకాయ పట్టెడ సుదర్శనం గారు ,ఆచార్య సుందరమూర్తి గారు ,ఆచార్య మిన్నల్ రఘుపతి గారు, ఆచార్య నందలూరు భాస్కర రెడ్డి గారు, జె. భాస్కర్ గారి తోడ్పాటును కృతజ్ఞతలతో గుర్తుచేసుకుంటున్నాము.

ఈ గ్రంథ ప్రచురణకు వివిధ దశలలో సహకరించిన దివంగత ప్రొఫెసర్ జె. మునిరత్నం గారికి మరియు శ్రీ బి. రామలింగారెడ్డి గారికి మా ప్రత్యేక ధన్యవాదాలు.

ముఖచిత్రం ఫోటోలను అందించిన పులికల్ భాస్కర్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.....

పెద్ది సాంబశివరావుగారి తోడ్పాటు లభించడం వల్లనే ఈ పుస్తకాన్ని యింత అందంగా తీసుకురాగలుగుతున్నాము . వారి బృందానికి మా ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ పుస్తక రూపకల్పనకు కావలసిన సహాయ సహకారాలనందించిన ఆచార్య మధురాంతకం నరేంద్రగారికి ధన్యవాదాలు.

పుస్తకప్రచురణ మాత్రమేగాకుండా మిగిలిన అన్ని రకాల చేయూత నందించిన రెయిన్‌బో ప్రింట్ ప్యాక్ అధినేత నరేంద్ర బాబుగారికి కృతజ్ఞతలు.

పుదురు సాయి సుదర్శన్
పుదురు సాయి పతంజలి
అనురాధ సాయి రవీంద్రన్

లగధ

(క్రీ.పూ. 1200) (భారతదేశం)

గణిత ప్రతిష్ఠను గురిం
చిన చక్కని శ్లోకమొకటి చెప్పిన విద్వ
న్మణి, వేదాంగ జ్యోతిష
మును గూర్చిన ఘనుడు **లగధ**మునికి నమస్సుల్.

బౌధాయనుడు

(క్రీ.పూ. 800–740) (భారతదేశం)

సమకోణ త్రిభుజపు సూ
త్రము బౌధాయన కృతము – పిథగొరసు సిద్ధాం
తముగా స్థిరపడి పోయె జ
గమున – చరిత్ర నిటువంటి ఘటనలు కొల్లల్

జ్యామితి సిద్ధాంతాలకు
భూమికగా శుల్వసూత్ర పుంజములమరెన్
ధీమంతులు, **బౌధాయన**
నామస్వామి ప్రభృతుల వినమ్రత గొలుతున్

విరహాంక, హేమచంద్ర, గోపాల

(భారతదేశం) (క్రీ.పూ. 65) (1088–1173) (క్రీ.పూ.1135)

విరహాంక హేమచంద్రులు
మరి**గోపాల** ప్రభృతులు – నమస్సులు గొనుడీ
ధర ''ఫిబొనాషీ'' సంఖ్యల
వరసలు మున్నెన్నడొ వెలువడె మీ వలనన్

మాధవ

(క్రీ. పూ.1340–1425) (సంగమగ్రామం, కేరళ)

కేరళ గణిత ప్రగతికి
కారకులగు బుధుల నగ్రగణ్యుండై వి
స్తారముగా ఫలితాలను
కూరిచె మాధవుడతనిని కొండాడ వలెన్

గణితక్రియలో విశ్లే
షణమును వెలయించిన తొలి శాస్త్రజ్ఞుడుగా
గణనీయుడైన **మాధవు**
ప్రణుతింతును భారతీయ భాగ్యమటంచున్

పరమేశ్వర

(1370 – 1460) (కేరళ)

గణిత రచనలకు వ్యాఖ్యల్,
గణిత సృజనము, నొనరించి గాంచెన్ ప్రఖ్యా
తిని **పరమేశ్వరుడీ** ధీ
మణికిన్ కేరళ సుతునకు మరిమరి జోతల్

నారాయణ పండితుడు

(1340–1400) (కేరళ)

కేరళ గణిత కళానిధి
నారాయణ పండితుడు, జనప్రియ కృతి దా
గూరి చెను గణిత కౌముది
గా రాజిల్లునది శాస్త్రగణ్యుండతడే

పింగళాచార్యుడు

(క్రీ.పూ. రెండో శతాబ్దం) (భారతదేశం)

పింగళ నామక విబుధుడు
మంగళకరముగ గణితము, మరి ఛందమునున్
ముంగిట ముత్యములుగ నిలి
పెంగద – స్తవనీయుడతని పేర్మికి జేజేల్

నీలకంఠ సోమయాజి

(1444 – 1544) (కేరళ)

మును తంత్రశాస్త్ర సంగ్రహ
మను నుత్కృష్టగణిత కృతి నందించిన స
జ్జన హితుడు నీలకంఠము
ఘనచరితుడు, **సోమయాజి**, కైమోడ్పులివే

జ్యేష్ఠ దేవ

(1500 – 1575) (కేరళ)

మళయాళ భాషలో ను
జ్జ్వల పాండిత్యమును, గణితశాస్త్రమ్మున కౌ
శలము గల **జ్యేష్ఠ దేవుడు**
విలిఖించెను ''యుక్తిభాస'' విజ్ఞులు మెచ్చన్

ఎలుగంటి పెద్దన

(12వ శతాబ్ది) (భారతదేశం)

తెలుగున గణిత గ్రంథం
బులు రచియించుట సకృత్తు పూర్వము, ధృతితో
నెలుగంటి పెద్దనార్యుడు
వెలయించె నొకగణిత కృతి వినుతు లతనికిన్

శ్రీధర

(870–930) (వంగదేశం)

పాటీ గణితము వ్రాసిన
మేటిగ బీజగణితమున మేధావి, ఘనా
పాటిగ ప్రశంసల గొనును
నేటికిని తలకు ముదమున నేన్ **శ్రీధరు**నిన్

Evariste Galois (1811-1832) (France)

ఆధునిక గణిత దీప్తికి
నాధారస్తంభమటుల ఆద్యుడు గ్యాలోయిస్
బాధాకరమా యువకుని
గాథనువిన కనులనీరు కాల్వలు గట్టున్

నీ కడపటి రాతిరి స్థితి
నే కవి వర్ణింపజాల డెవరిస్ట్ గ్యాలోయిస్
''నాకు వ్యవధిలేద'' నుచునె
కోకొల్లలుగ గణితమును గుప్పించితివే

టక్కరి, రక్కసి, రూపసి
యొక్క, నెమ్మనమున పెను ఉద్రేకపు కై
పెక్కించగ, క్రొవ్వలపుల
ముక్కోణములోన జిక్కి ముగిసెను గ్యాల్వా

మరణించు క్షణము, తనసో
దరుండు కన్నీరు గార్చ – తమ్మునితో ''నే
నిరువదికే మరణించెడి
తరి ధైర్యమొసగ వలెను గద వగవకు మ''నెన్

మల్లికార్జున సూరి

(12వ శతాబ్దం) (ఆంధ్రప్రదేశ్)

అమరిచెను సూర్యసిద్ధాం
తమునకు వ్యాఖ్యాన ప్రభను – తన కాలములో
ప్రముఖులలో మేటిగ వర
లె **మల్లికార్జునుడు, సూరి,** లెక్కల విభుడై

హలాయుధుడు

(10 – 11వ శతాబ్దము) (భారతదేశం)

రమణీయము పాస్కలు త్రిభు
జము పాస్కలుకు మునుముందె ఛంద స్సూత్రా
ర్థములను మేరు ప్రస్తా
రముల, **హలాయుధుడు,** త్రిభుజ రమ్యత జూపెన్

ఆపస్తంభుడు

(క్రీ.పూ.600) (భారతదేశం)

శుల్వ సహిత సూత్రములకు
చెల్వము చేకూర్చి నట్టి సిద్ధుని బుద్ధిన్
నల్వుని **నాపస్తంబుని**
పల్విధముల నుతులముంతు పరితోషముతోన్

గోవిందస్వామి

(క్రీ.పూ.800) (భారతదేశం)

పూర్వపు గణిత వ్యాఖ్యలు
సర్వోత్తమముగ రచించె శాస్త్రజ్ఞుండై
గర్వింప జేసె భారతి
నుర్విన్ **గోవిందసామి** ఉజ్వల రీతిన్

ఆర్యభట్టు

(476-550) (భారతదేశం)

పై విలువను (3.1416) ప్రవచించిన
భావధనుం**డార్యభట్టు** (I) బహుతెరగుల ప్ర
జ్ఞా విలసితుండయిన వి
ద్యా వాచస్పతి, మహోన్నత చరిత్రుడహో

ఆర్యభట్టు

(920-1000) (భారతదేశం)

వాసిగనిన విజ్ఞాని మ
హా సిద్ధాంత కృతికర్త **ఆర్యభటుడు** (II)వి
ద్యాసింధువు గగన గణిత
శాసకుడు, సమీకరణ కుశలుడు స్తుతింతున్

భాస్కర

(600-680) (భారతదేశం)

గణితమున విశిష్టరచన
లను జేసె స్థితిగతులంకెలకు సున్నకు కూ
ర్చిన గణితజ్ఞుడు, జగమెరి
గినధీనిధి **భాస్కరుండు** కీర్తించవలెన్

శ్రీపతి

(1019-1066) (మహారాష్ట్ర)

జ్యోతిషమును గణితమ్మును
ప్రీతిగ, కూలంకషముగ **శ్రీపతి** నేర్చెన్
వ్రాతలు కొల్లలు కృతులై
ఖ్యాతి గూరిచే నతనికి గర్వప్రదమై

వరాహమిహిరుడు

(505–587) (భారతదేశం)

గణితఖగోళ జ్ఞానము
గణితముగ గలిగి వెలిగిన ఘనునిన్, విలసత్
గుణుని **వరాహ మిహిరు**ని ధ
రణీజల నిలయవిదుని నిరతము దలంతున్

ప్రముఖముగు పంచసిద్ధాం
తములు, బృహత్ సంహితను విరగుండు వరా
హ మిహిరుడు రచించెను గణి
తమహాకేతన మతండు ధన్యత గాంచెన్

శంకర నారాయణ

(840–900) (భారతదేశం)

తొలి భాస్కరు కృతులకు వ్యా
ఖ్యలను రచించిన మనీషి గణితకళా కౌ
శలమున గణనీయుండై
విలసిల్లెను **శంకరుండు** – వినుతులతనికిన్

పావులూరు మల్లన

(11వ శతాబ్దం) (ఆంధ్రదేశం)

తెలుగున గణితము రాసిన
తొలిపండిత రత్నముగ నతులిత యశమునన్
వెలుగు కవి, శాస్త్రరవి, పా
వులూరు మల్లన దలతు మిగుల నుత్సుకతన్

మహావీరాచార్యుడు

(800–870) (భారతదేశం)

తనకాలమున తనకు తెలి
సిన గణితవిషయములొకట జేర్చి మివుల చ
క్కని గ్రంథమునొక్కటి వ్రా
సిన **వీరాచార్యుని** తలచి నుతించవలెన్

భాస్కరాచార్య

(1114 –1185) (భారతదేశం)

భరతోర్విని గణితమునకు
గురుదేవుడు **భాస్కరుండు**, కూతురి పేరన్
విరచించెను లీలావతి.
ని రమ్యమైన గణిత కృతిని బుధులు మెచ్చన్

బ్రహ్మగుప్త

(598–670) (భారతదేశం)

భారత గణిత పతాకను
తారాపథమున నునిచిన ధన్యచరితుడౌ
సూరిగద **బ్రహ్మగుప్తుడు**
అరబ్బులు మెచ్చి అతని ఆవిష్కరణల్

ఆచార్య ఎస్. మీనాక్షీ సుందరం

(1913–1968)

మాక్షోణిన్ తనవంటి సద్గణితసమ్రాట్టుల్ సకృత్తన్నచో
ఆక్షేపించరు పండితోత్తములు విద్యాంభోధి యైనట్టి మీ
నాక్షీ సుందర దేశికోత్తముని జ్ఞానానంద సంస్కార వై
లక్షణ్యప్రతిభున్ దలంచెదము ప్రహ్లాన్నాంతరంగమ్మునన్

గురుకులము వోలె శిష్యుల
దరిజేరిచి కూడు గూడు తదుపరి విద్యన్
గరపించెడి మాష్టారు లె
వరు గల ''రెసెమెసు'' (SMS) ను బోలు వరగురుదేవుల్?

మీ పాండిత్యము మెచ్చిరి
ఓపెన్హైమరు ప్రభృతుల హో మాష్టారూ
మీ పరిశోధనలకు నిక
షోపలమయ్యేయెస (IAS) య్యె నుజ్వల చరితా

IAS: Institute of Advanced Studies, Princeton USA

''తనుప్రేమించిన సజ్జను
లనీశ్వరుండు భగవన్నిలయమున కున్జే
ర్చును సత్వరముగ'' ననెడి మ
న నానుడిని నిజమొనర్చిన మహాపురుషా!

గణితజనులు సభలందున
నిను ప్రస్తావించినపుడు నింగికెగిరిన
ట్లని పించును నా హృదయము;
తనువున పులకలు పొడముగదా మాష్టారూ!

వల్లభామాత్యుడు

(ఆంధ్రప్రదేశ్) 16వ శతాబ్దం

(1529–1542 వరకు అచ్యుత దేవరాయల ఆస్థానాధికారి)

గడియించె వల్లభామా
త్యుడు కవిదేవేంద్ర బిరుదు, నుత్తముడని పే
ర్వడసెను, అచ్యుతరాయ హి
తుడని, గణితవిదుడని దలతునతని చరితన్

పిడపర్తి కృష్ణమూర్తి శాస్త్రి

(1897–1977) (రాజమహేంద్రవరం)

తెనుగున లీలావతి వ్రా
సిన **పిడపర్తి** కులతిలక సిద్ధాంతిని శా
స్త్రిని, కృష్ణమూర్తిని దలతు
గణితమ్మున కతని సేవ గణనీయమహో!

ఆర్.వైద్యనాథస్వామి

(1894–1960) (తిరుపతి, చెన్నై)

శ్రీవైద్యనాథ గురువరు
భావించెద భక్తిమయి ''టొపాలజి'' పై నెం
తో విజ్ఞతతో తొలికృతి
దైవారగ జేసినట్టి ధన్యుడటంచున్

ప్రశాంత చంద్రమహలనోబిస్

(1893–1972) (కలకత్తా)

జగతిని గణాంక శాస్త్ర
ప్రగతికి శ్రమియించి ఖ్యాతి బడసిన మహనీ
య గురువును **మహలనోబిసును**
సుగుణాన్వితుని సతతమ్ము స్తుతియించవలెన్

జగన్నాధ సమ్రాట్

(1690 – 1750) (జైపూర్, రాజస్థాన్)

గ్రీకుగణితశాస్త్రకృతుల
ప్రాకటముగ సంస్కృతమున వ్రాసి **జగన్నా
ధా** కీర్తిగాంచితివి ధర
జీకాంతుడు జయపురమున నిన్నలరించెన్

శ్రీనివాస రామానుజన్

(1887–1920) (భారతదేశం)

గణితజ్ఞులచ్చెరువు పడ
గణితము సృష్టించి దేశకాలాల్ మించెన్
ప్రణుతిన్ గాంచిన చిర జీ
విని **రామానుజుని** తలతు వినయము తోడన్

బదరీనాథ్ ప్రసాద్

(బి.ఎన్.ప్రసాద్) (1899–1966) (అలహాబాదు)

అలహాబాద్ కేంద్రముగా
వెలిగిన గణితరవి – దేశవిజ్ఞానపు టె
ల్లలు విస్తారించిన ధీ
లలితుడు బీ.ఎన్. ప్రసాద్ తలతునాఘనునిన్

పారిసు (Paris) గణితవేత్తల
గౌరవములు, దేశ దేశగణితజనపుర
స్కారమ్ములందిన ప్రసాద్
పారగుడు వివిధ గణిత విభాగములందున్

పి.యల్. భట్నగర్

(1912–1976) (రాజస్థాన్, అలహాబాదు, బెంగుళూరు)

"బీజీకే" మోడల్ అని
రాజిలు శాస్త్రాంశ మిచ్చి ప్రఖ్యాతుడయెన్
పూజిత గురు తల్లజధీ
తేజము – **భట్నగరు**ను వినుతించెదనెపుడున్

విష్ణు వాసుదేవ్

(వి.వి.) (1908–1991) నార్లేకర్

విద్యారంగములో తన
ఉద్యోగము నిర్వహించె నుత్తమ రీతిన్ – సద్యశమును బొందెను పలు
విద్యార్థుల పూజలందె **వి.వి. నార్లేకర్**
''సాపేక్షత'' సిద్ధాంతము
నాపోశన పట్టి దేశమందగ్ర శ్రే
ణీ పరిశోధన సంస్కృతి
స్థాపించెను నార్లెకరు ప్రశంసల నందెన్

ఎ. నరసింగరావు

(1893–1967) (అణ్ణామలై, ఆంధ్ర యూనివర్సిటీలు – MIT, చెన్నై)

వినియుక్త గణితశాస్త్రగ
గనతల రవిబింబమై ప్రకాశించిన జ్ఞా
న నిధి **నరసింగరావు**ను
వినయమున దలచి నుతింతు విజ్ఞుల ఎదుట

గణేష్ ప్రసాద్

(1876 – 1935) (Cambridge (UK), Gottingen (Germany) & India)

ఇరువదవ శతాబ్దమున, తొ
లి రోజులపుడొక వెలుగు వెలిగిన గణిత స
ద్గురువు, గణిత సంస్కృతి వి
స్తరణకు కడుకృషియొనర్చె ధన్యుండు గణేష్

అవధాని శ్రీహర్షచక్రవర్తి

శ్రీగణితభారతి దయ గురియు కతమున
సాటిలేని మేటి గణిత చక్రవర్తి
వయి, శతావధాన కిశోరమయి విశిష్ట
రీతిని పురస్కృతులు స్వీకరించినట్టి
సాధు గుణ కీర్తి శ్రీహర్ష చక్రవర్తి
పలుకళాశాల లున్నతపాఠశాల
లును మరెన్నియో సంస్థలు, వినుతి గొన్న
విశ్వవిద్యాలయమ్ములు వేదికలుగ
గణితశాస్త్ర ప్రవీణులుగాంచి వారు
నీదు గణితపాండిత్యమ్ము మేదురముగ
నిన్ను జాతి సంపద యని సన్నుతించి
బిరుదముల నిచ్చి మెచ్చిరి ప్రీతితోడ
దేశమున ప్రజలికమీద దీక్షబూని
సాధనలు లేని పలు సమస్యలకు సాధ
నలగురించి శ్రమించుము కలుగు కీర్తి
సంఖ్యలను గెల్చు శ్రీహర్ష చక్రవర్తి
పూర్వజన్మ పుణ్యఫలమొ? పుట్టుకనిడిన
తల్లి దండ్రులొనర్చిన ధర్మఫలమొ?
నోచినట్టి నీమము గల నోము ఫలమొ?
గణితవాణి నీదురసనాగ్రమున నాట్య
మాడు, చూచు వారెల్లరు నబ్బుర పడ
అద్భుత ప్రతిభామూర్తి, శ్రీహర్షచక్ర
వర్తి కృషి ఫలితంబుగా వాసిగాంచి
గణితభారతి నౌకకొంత గర్వమంది
వరలుగావుత ఇదియ మద్వాంఛితమ్ము

అరుదైన బిరుదములతో
వరశేముషికి నిలయమయి వర్ధిలు శ్రీహ
ర్ష! రచించవలె గణిత శా
స్త్ర రహస్యా విష్కరణకు గ్రంథములింకన్

మహదాశ్చర్యకరత్వదీయపటు ధీమాహాత్మ్యమున్ గాంచి ప్ర
త్యహమున్ తతగతిన్ గురించిన వ్రతమ్ముల్ యాగముల్ సేయు మీ
గృహదైవమ్ములు తల్లిదండ్రులు మహాదృష్టప్రమోదాత్ములై
రహియింపన్ గణితక్రియా విజయవిక్రాంతుండవై వెల్గుమా

ఎన్. రుద్రయ్య

(1932–2019) (బెంగుళూరు)

పరిశోధన కళలో గురు
వరుడని కీర్తి గొని శిష్యవత్సలుడై ప
త్ర రచన యందు కుశలుడై
న రుద్రయాచార్యుదలతు నమ్రతనెపుడున్

తన శిష్యులకెందరికో
చనువున శిక్షణలొసగి విజయులుగ జేసెన్
మనుగడలకు మార్గము పర
చెను; **రుద్రయ్య**కు యశస్సు చేకూరవలెన్

వి. కణ్ణన్

(1946) (హైదరాబాద్)

అకళంక గణిత పాండితి
ప్రకటిత వాగ్విభవము గల ప్రాచార్యుడు, బో
ధకుడు, సుజనుండు, మృదు భా
షి **కణ్ణ**ను నుతింతు నాదు చిత్తము పొంగన్

వేదము లక్ష్మీనారాయణ

(19, 20 శతాబ్దులు) (మదరాసు)

లీలావతిఁ దెనిగించెను
మూల విధేయముగ వేదము కులతిలకుఁడౌ
శ్రీలక్ష్మీనారాయణ
చాల ప్రశంసింపదగు రచనగా నెంతున్

తడకమళ్ల వెంకట కృష్ణారావు

(19వ శతాబ్దం) (ఆంధ్రదేశం)

టీ.వీ. కృష్ణా రావ్, వి
ద్యావేత్త గణితమున కృతులందించిన మే
ధావి అతడు వ్రాసిన లీ
లావతి, బీజగణితము విలక్షణ రచనల్

తెన్నేటి వేంకట సుబ్బారావు

(1924–2015) (వరంగల్లు)

సారమతి, సుబోధినియు, మ
నోరంజని వ్యాఖ్యలను వినూతన ఫణితుల్
నేరిచి రచించె టి.వి.సు
బ్బారావు మహాశయుండు, పరిశోధకుడున్

హరిశ్చంద్ర

(1923–1983) (భారతదేశం, అమెరికా)

ఆధునిక ప్రౌఢ గణిత
వీధులలో నెదురులేక విహరించిన మే
ధా ధనుని, హరిశ్చంద్రు న
సాధారణ శాస్త్రవిదుని సంభావింతున్

R.C. Gupta (1935-2024) (Jhansi)

చిరునామా నీవు గణిత
చరితమునకు జగమెరుగును – శాస్త్ర చరిత్రల్
పరిశోధించుట మిక్కిలి
అరుదు! గణిత జనుల కాప్త! **ఆర్ సీ గుప్తా**

సాతమంగలం రంగఅయ్యంగార్ శ్రీనివాస వరదన్

(1940) ఎస్.ఆర్.ఎస్. వరదన్ (ఇండియా, యు.ఎస్.)

నోబెల్ బహుమతి బోలిన
ఏబెల్ బహుమతిని స్వీకరించిన నిజమే
ధా బల విలసిత **వరదా**
ప్రాబబిలిటీ గణితబ్రహ్మ ప్రణతులగొనుమా

సి.టి. రాజగోపాల్

(1903–1978) (చెన్నై)

ప్రగత గణిత దేశికుడై
అగణిత యశమున్ బడసిన ఆచార్యుడుగా
పొగడబడె **రాజగోపాల్**
నిగర్వి, సౌజన్యమూర్తిని నుతించవలెన్

ఒమ్మి రామస్వామి

(ఆంధ్ర విశ్వకళాపరిషత్తు) (1920–1961)

గణితమునకు ప్రాణము లా
క్షణికత యని నుడివెనెపుడు, క్షాత్రముతో శి
క్షణ నిచ్చిన ఆచార్యా
గ్రణిని తలతు నెమ్మి **నొమ్మి రామస్వామిన్**

ఎస్. మీనాక్షీ సుందరం

(1913–1968) (ఆంధ్ర విశ్వకళాపరిషత్తు)

దక్షుడు గణిత కళన్ **మీ**
నాక్షీ సుందర గురువని అభినందింతున్
శిక్షణ గొను శిష్యుల సం
రక్షించిన దేశికుడని ప్రణమిల్ల వలెన్

దత్తాత్రేయ రామచంద్ర కప్రేకార్

(1905–1986) (నాసిక్)

సుందర సంఖ్యాజగమున
సౌందర్యము, సత్యమును ప్రసన్నమొనర్చెన్
స్పందించెను గణిత జనత
వందనమిడె **కప్రేకరు**కు స్వాంతముపొంగన్

టి. వెంకట్రాయుడు

(1910–1979) (ఆంధ్రవిశ్వకళాపరిషత్తు)

అభినవ సంఖ్యావాదము
నభివృద్ధిపరచ శ్రమించె నధ్యాపకవ
ల్లభుడై **వెంకట్రాయుడు**
విభవమ్మును గూర్చె గణిత వృత్తికి వరమై

మతుకుమల్లి వెంకటసుబ్బారావు

(1921–2006)(తిరుపతి, కెనడా)

అంకెల కాననమందు వి
శృంఖలముగ తిరిగినట్టి సింహమనంగా
వేంకట సుబ్బారావ్ మో
దంకర బోధకుడు, గురువు తలతును ప్రీతిన్

కందుల సీతారామ్

(తిరుపతి) (1931–2017)

కందుల సీతారామ్ అతి
సుందర హస్తాక్షరములు శోభనిడగ నా
నందకరముగా గణితము
నందించెను పాఠములుగ నవ్యతనిండన్

భోజరాజ్‌సేత్

(భారతదేశం) (1907–1979)

వినియుక్త గణిత పరిశో
ధనలకు స్ఫూర్తిగ నిలిచిన ధన్యుడు, మేధా
ధనుడైన **భోజరాజ్‌సే**
తు నతని గణిత కృషిని తలతును వినమ్రుడనై

స్వామి దయాళ్ నిగమ్

(ఐఐటి, మద్రాసు) (1924–2009)

ద్రవగమన శాస్త్రమందున
స్తవనీయకృషి నొనరించి తన శిష్యుల స
ద్భవితకు బాటలు వేసె గు
రు వరుడు **ఎస్.డి. నిగాము** మ్రొక్కెద నతనిన్

J.N. Kapur (1923-2002) (India)

దేశములోనన్ గణిత
ప్రాశస్త్యమునుగ్గడించి పలువిధములుగా
నీ శాస్త్రమ్మును పెంచె మ
హాశయుడు **జె.ఎన్. కపూరు** నభినందింతున్

పి.ఎస్. శేషాద్రి

(1933–2020) (చెన్నై)

బీజీయ జ్యామితితో
బీజీయ సమూహములకు పెంపొనరించెన్
పూజితుడై బహుభంగుల
రాజిలు శేషాద్రి కేను ప్రణతుల నిడుదున్

ఎస్. చంద్రశేఖర్

(1910–1995) (భారతదేశం, యు.ఎస్.)

వినియుక్త ఖగోళాధ్యయ
న నేతగ ప్రసిద్ధిగాంచిన మహావిజ్ఞా
నిని **చంద్రశేఖరు**ని తల
చినపుడు సంతుష్టికలుగు చిత్తము నిండన్

C.R. Rao (1920-2023) (India, US)

కళ, శాస్త్రము, సాంకేతిక
తలు ముప్పేటలుగ వికసితమ్మై విజ్ఞా
నులకు వరము సాంఖ్యకమని
పలికె **సి.ఆర్.రావు** గారు ప్రాజ్ఞులు మెచ్చన్

గణితము గణాంక శాస్త్రము
లను సంపన్న మొనరించి విలసిలు సి.ఆర్. రా
వును జగమెల్ల నుతించె, న
తని పరిశోధన విలువ కతన తథ్యముగా

''కొలువనిది కొలుచుటకును క
నులకు కనబడనిది కనుగొనుటకిప్పుడు వీ
ల్గలుగును గణాంక శాస్త్రము
వలన'' సి.ఆర్. రావ్ ఉవాచ: వాసింగాంచెన్

విజయకుమార్ పటౌడీ

(1945-1976) (భారతదేశం)

ఉష్ణసమీకరణముపై
తృష్ణన్పరిశోధనముల తెన్నున **పటౌడీ**
నిష్ణాతుడయ్యె కానీ
ఉష్ణకుడై ముప్పదులకె ఉర్విని వీడెన్

ఎన్.వి. సుబ్రహ్మణ్యం

(1929-2012) (ఆంధ్రవిశ్వకళా పరిషత్తు)

అధునాతన బీజ గణిత
మధురిమలావిష్కరించి మన్ననలందెన్
బుధవర్గము హర్షింపగ
సుధీమణిగ చెలగె **ఎన్.వి.సుబ్రహ్మణ్యం**

బీజగణితనభమున నెల
రాజు నడింపల్లి వంశరత్నమ్మనగా
రాజిలె సుబ్రహ్మణ్యము
సౌజన్యము నుగ్గడింప సంబర పడుదున్

మంజుల్ భార్గవ్

(1974) (భారతదేశం, కెనడా, అమెరికా)

ప్రముఖుండయి సంఖ్యావా
దములో విజయశిఖరమ్ముతాకి గొనెన్ ఫీ
ల్డ్సు మెడలు మనజాతికి ప్రథ
మమిద్ది అభినందనములు **మంజుల్ భార్గవ్**

ఎం. సత్యనారాయణ

(శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి & అమెరికా)

ఆధునిక బీజగణితపు
శోధనలో నిపుణుడని యశోవంతుండౌ
సాధిష్ఠ గణిత విద్యా
నాధు నుతుల **ముంతు సత్యనారాయణు**నిన్

కె.వి. మునస్వామి రెడ్డి

(1925–1992) (తిరుపతి)

గణితము తెలియని వారికి
గణితము బోధించి మివుల ఖ్యాతి గనన్ జే
సె నిల పలువురిని గురు గ్రా
మణియై **మునసామిరెడ్డి** మాన్యుని దలతున్

నక్కా రామారావు (తిరుపతి)

లెక్కల యెడ శిష్యతతికి
మక్కువ ఏర్పడు నటుల శ్రమపడిన మాన్యున్
నక్కారామారావును
చక్కని ఆచార్యుడనుచు స్మరియింపవలెన్

పొన్నలూరు సూర్యనారాయణ

(తిరుపతి, హైదరాబాదు)

రసవత్తరముగ గణిత
ప్రసంగముల, పాఠముల నిబద్ధతబోధిం
చి సుజనుడని నుతులందిన
పి.సూర్యనారాయణ నిట ప్రీతిగ దలతున్

S^3 : S.S. సుబ్రహ్మణ్యం

(1928–2015) (తిరుపతి)

''మూడెస్సుల'' గుణలబ్ధము
వేడుక ''నిక్‌నేం'' (nick name)గ, గణిత విద్యను నేర్పెన్
చూడగ **సుబ్రహ్మణ్యం**
వాడిన బోధన విధమ్ము వాసిని గూర్చెన్

P.S. Rao (1931-1982) (Tirupati)

సదిశల యెడ కడు ప్రీతి
ప్రదముగ గణిత తరగతుల పాఠ్యాంశములన్
విదిత మొనర్చిన మాష్టరు
గద **పీ.ఎస్. రావ్** తలతును గారవమొప్పన్

సదిశా విశ్లేషణపై
ముదమేర్పడ గణిత పాఠములం జెప్పిన సౌ
హృదయుడు పీ.ఎస్ రావును
మృదుభాషిని తలతు నతడు మిత్రగురుడహో

తెన్నేటి సూర్యనారాయణ

(1892–1963) (విజయవాడ, హైదరాబాదు)

సాటిగ రామానుజుతో
ఫోటోలో దిగిన ఘటన పులకింతలిడెన్
మేటి గణిత ''ర్యాంగ్లరు'' (Wrangler) తె
న్నేటి సుధీమణికి గణిత నీరాజనముల్

సుందరేశన్

(1931– 2018) (తిరుపతి, యు.ఎస్.)

బోధనకు కష్టమైనది
సాధనకును సులువుగాని శాస్త్రాంశములన్
బోధించె **సుందరేశన్**
సాధారణ గణితమటుల చాతుర్యముతోన్

ఎస్.కె. లక్ష్మణరావు

(1925-2007) (NIT (REC)- వరంగల్)

గణితనభస్త మందు, ద్యు
మణిగ వెలగిన మృదుభాషి మంచి మనిషి ల
క్ష్మణరావున్ దలచి నుతిం
తు నతని పాండిత్యగరిమ తులలేని దహో

గణితాచార్య నభమున ద్యు
మణిగ వెలిగిన విబుధుండు మాన్యుండును ల
క్ష్మణరావును గురుతుల్యుని
వినియుక్త గణిత కళావివేకిని దలతున్

దేవినేని జగన్మోహనరావు

(విజయవాడ)

గణితము నభిమానించిన
గుణవంతుడు **దేవినేని** కులభూషణుడై
గణుతిం గాంచె **జగన్మో**
హనరావు, రచించె పెక్కు లనుపమ కృతులన్

ఎం.ఎస్. రఘునాధన్

(1941) (ముంబయ్)

దేశములో గణితమునకు
ప్రాశస్త్యము పెరుగు కొరకు పలువిధములుగా
ఆశించి మించు మేధా
కోశము **రఘునాధ**నతని కొండాడ వలెన్

జొన్నలగడ్డ గోపాలకృష్ణ

(1933–2017) (ఆంధ్రవిశ్వ కళా పరిషత్తు)

''జేజీకే'' గా గణిత స
మాజములో వ్యవహృతుడు ''సామాను''గణిత సం
స్థాజనకుండు సహృదయుడు
నౌ **జొన్నలగడ్డ**బిడ్డ కభినందనముల్

వి.లక్ష్మీకాంతం

(1924–2012) (భారతదేశం, యు.ఎస్.)

అవకలన సమీకరణము
లవలీలగ ఢీకొనియెడి ఆచార్యుండహో
భువనైక యశస్వి సుజను
డు **వి. లక్ష్మీ కాంతము**న కిడుదునంజలులన్

చిరునామా రేఖీయే
తర విశ్లేషణలకు గణితజగతినని కీ
ర్తి రమాకాంతుడవైతివి
గురువను పదమునకు వన్నెగూర్చితి వన్నా

గణితమ్మున విశ్లేషణ
మున రేఖీయేతరము (Non-linear Analysis) న
ముమ్మరముగ శోధనల నొనర్చి జగత్ ఖ్యా
తిని **లక్ష్మీకాంతము** గనె ధీమంతుడహో

కొమరవోలు చంద్రశేఖరన్

(1920–2017) (జ్యూరిక్, స్విట్జర్లాండ్)

భారత గణిత జ్యోతిని
'యూరపులో వెలుగ నిచ్చి ఉజ్వలరీతిన్
జ్యూరికులో స్థిర పడితివి
గౌరవముగ **కొమరవోలు** గగన శశాంకా

కె. ఆనందరావు

(1893 – 1966) (మదరాస్)

రామానుజు సహవాసి, అ
సామాన్య గణిత కుశలత స్వంతమతనికిన్
ధీమంతులు శిష్యులయిరి
ప్రేముడి **ఆనందరావు** పేరు నిలుపగన్

జయంత్ విష్ణు నార్లేకర్

(1938) (పుణే)

గణితము ఖగోళ శాస్త్రము
లను మథియించి ధరణీతల స్థాయిని కీ
ర్తి లతల ప్రాకించిన ధీ
విలసితు, **జె.వి. నార్లెకరు**ను వినుతించవలెన్

పూని చదువునప్పుడే; అపూర్వమనిరి వి
ద్యానాధులు కేంబ్రిడ్జిలో –
ఈ నార్లేకరునిప్రతిభ నెన్నన్ దరమే
ఈతని నేతృత్వములో
ఖ్యాతి గడించెను ప్రపంచమందు ''నయూకా''
(IUCAA) ఈతరమున విజ్ఞానుల
లో తలమానికముగా వెలుగును గద జయంత్

పి.వి. కృష్ణయ్య

(1932) (ఆంధ్రవిశ్వ కళాపరిషత్తు)

గణితమ్మున ''అపభావము''
లను దూరమ్ములకు తరిమి లాక్షణికతకున్
పెను గౌరవమ్మొసగి బో
ధనచేసె, నుతింతును సహృదయు కృష్ణయ్యన్

గణితమ్మున మాయాద
ర్పణమై చెలగును ప్రమేయ భావనమనియెన్
గణితాచార్యుడు కృష్ణయ
గణిత జనుల మన్ననలను కరముగ పొందెన్

పి. కృష్ణారెడ్డి

(1915-1971) (కార్వేటినగరం, చిత్తూరు జిల్లా, ఆం.ప్ర.)

కార్వేటినగరమందు ని
గర్వి గణితపాఠములను కమ్మగఁ జెప్పెన్
నిర్వర్తించెను బాధ్యత
సర్వులు సంతసిల రెడ్డి సంతుష్టుండై

మును బడిచదువులు సాగిన
దినములు; గణితమున అద్వితీయముగా శి
క్షణ **శ్రీకృష్ణారెడ్డి** వ
లన బొందిన శిష్యులము తలతుమాగురువున్

వి. గణపతి అయ్యర్

(1906-1987) (అణ్ణామలై యూనివర్శిటి)

గణితమ్మున పాఠముల న
గణిత ప్రతిభాయుతముగ గానము చేసెన్
గణపతి అయ్యర్ పరిశో
ధన లోను తన గరిమను ప్రదర్శించె సుమా!

గణితమున బోధనలన ర
మణీయముగ నందజేసి మైమరపించెన్
తన శిష్య గణములను శ్రీ
గణపతి అయ్యర్ నిరతము గణనీయుడయె

ఎం. వెంకటరామన్

(1923–1990) (మధురై కామరాజ్, హైదరాబాద్ యూనివర్శిటీలు)

పరిశోధన బోధనకే
పరిమితమవక గణితమును ప్రగతి పథమునన్
పరుగిడ జేయ శ్రమించెను
విరివిగ నరవిందభక్త **వెంకటరామన్**

G.S.R. Sarma

(1937-2006) (Andhra Univ.& Germany)

పరదేశాలన్ మేధా
గరిమను చాటెను తెలుగుల గర్వముగా **సుం**
దర రామశర్మ వెలిగెను
స్థిరపడి ''గొట్టింజను''న నుతింతును ప్రీతిన్

వ్యాస్

(1912–1995) (విజయవాడ)

బెజవాడ గణిత సంస్కృతి
కి జవమ్మును సత్త్వము నొసగిన మాన్యుడు వ్యాస్
సృజనీయత పిల్లలలో
సృజియింపగ పాటుబడి ప్రసిద్ధుండయ్యెన్

మణీంద్ర అగ్రవాల్

(1966), నీరజ్‌కాయల్ (1979), నీతిన్ సక్సేన (1981) (ఐ.ఐ.టి. –కాన్పూర్)

ప్రైముల స్వరూపమెరిగిన
స్వాములు ముప్వురు **మణీంద్ర, సక్సేన, కాయల్;**
ప్రైముల పరీక్షను ''పాలీ
నామియలు'' వ్యవధికి దించినారు విజయులై

బాబయ్య నాయుడు

(1925–2006) (హైదరాబాదు)

గణిత ఒలింపియడున కొక
మణిమండపమేర్పరచిన మాన్యుడు **బాబ**
య్యను గణితోపాధ్యాయులు
ప్రణుతింతురు మివుల స్నేహ పాత్రుడటంచున్

పి. ధర్మారావు

(1927–1991) గాజుల బాలసుబ్రహ్మణ్యం (GBS) (1929–2017),

వసంతపిళ్ళై

(1924 – 2005) (శ్రీకాళహస్తి, కార్వేటి నగరం)

గణితముతో బాటుగ నా
ధునికతలను నేర్పిరి విబుధులు **ధర్మారా**
వును, జీ.బీ.ఎస్ లు తలం
తును ప్రీతిగ నాటి బడి చదువులదినములన్

మును హైస్కూలున గణిత
మ్మును బోధించిన గురూత్తములు ధర్మారా
వును, సీ మాథ్స్ పాఠము చె
ప్పిన మృదుభాషిని వసంత పిళ్లెను దలతున్

V.K. Balachandran

(1927-2018) Ramanujan Institute, Chennai

రామానుజ పేర వెలయు
ప్రామాణిక సంస్థ కతడు ప్రాచార్యుడయెన్
ధీమాన్య బాలచంద్రన్
ప్రేమాస్పద హృదయునేను ప్రీతిగ దలతున్

K.S. Amur

(1931-2018) (Dharwad)

అవకలన జ్యామితిపై
నవలీలగ కృతులు వ్రాసె – అరవిందుని త
త్త్వవిశేషము లధ్యయనము
న వర్ధిలె**నమూర**తనికి నాకైమోడ్పుల్

C.T. Rajagopal, M.S.Rangachari

(1938) (Ramanuja Institute, Madras)

ఆచార్య **రాజగోపాల్**
ఆచార్యులు **రంగ** ఉభయులన్వేషింపన్
ప్రాచీన కేరళ గణిత
రోచిస్సులు బయలుపడె నిరుపమానముగా

భరతోర్విని గణితము భా
స్కరుని పిదప నాస్తియనెడి శాస్త్రచరిత ఈ
యిరువురు ఆచార్యవరుల
పరిశోధన వలన పూర్వపక్షం బయ్యెన్

M. Venkataraman

(Madurai, Hyderabad)

గణితము నాధ్యాత్మిక భా
వనలను పొందుపరచి రసవత్తరము బో
ధన జేసిన వేంకట రా
మనునకు ముదమున నిడుదు నమస్కారములన్

శరత్‌చంద్రశంకర్ శ్రీఖండే

(ఎస్.ఎస్. శ్రీఖండె) (1917–2020) (ముంబయ్, వారణాసి, అలహాబాదు)

‘‘ఆయిలరు స్పాయిలరు’’గ న
మేయమయిన కీర్తిగనిన మేటిగణితమే
ధాయుత! కాంబినటోరిక్స్
తోయ చంద్రమ! గొనుము నుతులు శ్రీఖండే

ద్రాక్ష, నారికేళమ్ము, కదళి, యనంగ
పాకముల్ మూడు సాహిత్య లోకమందు
అటులె గణిత సాహిత్యము నందు కలవు
మూడుపాకములు ప్రసంగములు, రచనలు
తరగతులలోన పాఠ్యబోధనములందు

సూత్రములు, సమీకరణాలు క్షేత్రములను
దాటి, భావములు, నరూపతలకు పెద్ద
పీటవేసి విజృంభించు నేటిగణిత
శాస్త్రమవసరమ్మిపుడన్ని శాస్త్రములకు

గణన కౌశలమే ఒకకాలమందు
గణిత ప్రతిభకు చిహ్నమై ప్రణుతిగాంచె
నేడు భావనలను గూడనేర్చి గణిత
మున నరూపతకు కడుప్రాముఖ్యమిచ్చి
నేర్పవలెను శాస్త్రమ్మును

(Mathematics got a shift in the 19th century from a subject of formulas and equations to one of ideas and abstract theory)

మేధకు, మదికి, కరములకు (HHH)
బోధనల వలన వికాసమును కలిగింపన్

సాధనమగు విద్యల నా
మోదించు నిపుడు సమాజము ప్రపంచమునన్

ఊహలు గణితధరిత్రిని
వాహనమగునొక్కొకతరి వరసిద్ధాంత
వ్యూహములకు సృజనా ని
ర్వాహమ్మున కుపకరించు వైనము గనరో

సహజ జ్ఞానపుటూహల
బహుళముగా ప్రౌఢగణిత ఫలితములబ్బన్
తహతహపడి ఉపపత్తుల
కహరహము శ్రమింతురు గణితాచార్యవరుల్

కాంతినటోరిక్స్ శాఖకు
ముంబయి లోన గలదొక ప్రముఖ సంస్థ ప్రపం
చంబున ఖ్యాతిగనిన కేం
ద్రంబది శ్రీఖండెకృషికి తగుసాక్ష్యంబై

Akshay Venkatesh

(India, Australia - 1981)

వైశ్లేషిక సంఖ్యావా
దశ్లోకుడు సద్గణిత విదగ్ధుండతనిన్
నేశ్లాఘించెద నిజగణి
తశ్లీలము **వేంకటేశు** తలపుల ప్రోవుల్

ప్రియమైన గణితశాస్త్రా
ధ్యయనమున శిఖరము జేరి ఖ్యాతుడయిన అ
క్షయ వేంకటేశు గైకొనె
ను యశస్కర ఫీల్డ్సు మెడలును నుతులతనికిన్

కంభంపాటి పట్టాభిరామశాస్త్రి

(కె.పి.ఆర్. శాస్త్రి) (1940) (ఆంధ్రాయూనివర్శిటి – విశాఖపట్నం)

స్థిరబిందుగవేషణలో
పరిశోధనలు జరిపించి పలుసిద్ధాంతాల్
కురిపించిన **కే.పీ.ఆర్.**
వరశేముషికిన్నెలవని వాసింగాంచెన్

డి. సూర్యనారాయణ

(1934–1981) (ఆంధ్రాయూనివర్శిటి – విశాఖపట్నం)

మోదమొసంగెడిసంఖ్యా
వాదమున కృషియొనరించి వర్ధిలఁజేసెన్
మేదురముగ నవఫలితాల్
మేధావి **డి.ఎస్;** అతనిని మివులనుతింతున్

ఎం. పేరిశాస్త్రి

(1926) (విజయనగరం)

గొప్ప గణితభావుకుడని
గొప్పగ పాఠములు చెప్పు గురువని జనులె
ల్లప్పుడు మెప్పులు గురియుదు
రిప్పుడతని **పేరిశాస్త్రి** నేను పొగడదున్

డి. రామకోటయ్య

(1936) (ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, గుంటూరు)

పరిశోధన పరమేష్ఠిగ
పరమాద్భుత ఫలితములను పండించెను ప
త్రరచనలు కూర్చె మేధా
విరామ కోటయ్య గణితవేత్తగ వెలుగున్

భావనారి సత్యనారాయణ

(1957) (ఆచార్య నాగార్జున యూనివర్శిటి, గుంటూరు)

అభినవ బీజగణితమను
నభమున తారయని **భావనారి**ని వర్ణిం
తు భువన యశస్సునుబడసెను
శుభమగు నతని గణిత పరిశోధనకెపుడున్

యు.ఎం. స్వామి

(1947) (ఆంధ్రా యూనివర్శిటి, విశాఖపట్నం)

అభినవ బీజగణితమున
ప్రభవించిన షీఫు (Sheaf) థియరిపై పరిశోధిం
చి భళీయనిపించే గణిత
విభుడు **యు.యం. స్వామి** అతని విద్యకభినుతుల్

కె.ఎల్.ఎన్. స్వామి

(1942) (ఆంధ్రా యూనివర్శిటి, విశాఖపట్నం)

క్రమబీజగణిత నిర్మితు (Ordered Algbraic Structures)
ల మర్మముల వింగడించి లాఘవమొప్పన్
రమణీయ గణిత సృజనకు – నిమిడిక కూర్చితివయా **కె.ఎల్.ఎన్. స్వామీ**!

కె. శ్రీనివాసరావు

(1934) (చీఫ్ జనరల్ మేనేజర్ (రిటైర్డ్),
ఎస్.బి.ఐ. తిరుపతి, హైదరాబాదు, యు.ఎస్.)

గణిత ప్రతిభగల శ్రీ **రా**
వును స్టేట్ బ్యాంక్ లాగెను కొలువునొసగి కలిగెన్
పెనునష్టము గణితమ్మున
కనియెద, హితుడతడు నాసహాధ్యాయుండున్

వి.వి. సుబ్రహ్మణ్యశాస్త్రి

(1937–2025) (**శ్రీవేంకటేశ్వర యూనివర్శిటి, తిరుపతి**)

వీ.వీ.ఎస్. ఫలితమ్ముల
నావిష్కరణ మొనరించె నంకెలశాఖన్
ప్రావీణ్యమ్ముగల గణిత
కోవిదుడని నేను మెచ్చుకొనెదను శాస్త్రిన్

ఆర్. సీతారామస్వామి

(1928–2000) (శ్రీకాళహస్తి, శ్రీవేంకటేశ్వర యూనివర్శిటి, తిరుపతి,
శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటి, అనంతపురం)

ప్రేమించెను తన వృత్తిన
సామాన్యముగా హితులకు ఛాత్రుల కొసగెన్
ప్రేమాదృతులా **సీతా**
రామస్వామిని సుగణిత ప్రతిభునిదలతున్

వనజా అయ్యంగార్

(1925–2001) (ఉస్మానియా యూనివర్సిటి, హైదరాబాదు, శ్రీపద్మావతి
మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి)

వనజా అయ్యంగారిని
వినియుక్త గణితమున విరివిగ పరిశోధిం
చిన మహిళను "పద్మశ్రీ"
గొనిన యశస్విని దలంచి కొనియాడవలెన్

సుజాతా రామదొరై

(1962) (భారతదేశం (TIFR), కెనడా (Vancouver)

ఆధునిక గణితమునపరి
శోధన ప్రచురణలొనరించి శోభిలు గణితాం
భోధి **సుజాతా రామ దొ**
రై దీవిస్తృతి నుతింతు ప్రహ్లోన్నుడనై

ఐ.హెచ్. నాగరాజారావు

(1940) (ఆంధ్రా యూనివర్శిటీ, విశాఖపట్నం)

భావుకుడు **నాగరాజా**
రావు వివిధ గణిత కళల రాణించిన మే
ధావిగ పరిశోధనలో
వైవిధ్యము జూపి మివులవాసింగాంచెన్

శ్రీబాల

(1941) (రామానుజన్ ఇన్స్టిట్యూట్ మద్రాసు యూనివర్శిటి, చెన్నై)

రామానుజున్ గణిత సం
స్థా ముఖ్య (డైరెక్టర్) అయిన గణిత విశారద శ్రీ **బా**
లా మహిళ బీజగణిత క
ళామూర్తి, వినుతి యొనర్తు ఆహ్లాదముతోనన్

లంక రాధాకృష్ణ

(1936) (కొల్హాపూరు – బెంగళూరు)

గణిత రచనల కవసర మ
యిన విధులు విధానముల పయినొక కృతి రచిం
చిన **రాధాకృష్ణ** గణిత
జనుల ప్రశంసల గొనిన యశస్విగ వెలుగున్

ఎం.ఆర్. గోవిందరెడ్డి

(1931) (నంద్యాల, ఆంధ్రప్రదేశ్)

గణితో పాధ్యాయుడు బహు
గణిత సభలు నిర్వహించి గణనీయుం డై
ప్రణుతిన్ గనె నంద్యాలన్
గుణనిధి **గోవిందరెడ్డి** గొనియాడవలెన్

శ్రీధర చంద్రశేఖరశాస్త్రి

(1959) (విజయవాడ)

గణితాభ్యాసములో త
ప్పని సరిగ ప్రయోగశాల ప్రావీణ్యపు వృ
ద్ధిని ప్రోత్సహించునని న
మ్మి నిర్మితికి **శాస్త్రి** కృషిని మెచ్చుకొనవలెన్

కె. జగన్మోహనరావు

(వి.ఆర్. కాలేజి, నెల్లూరు)

గణితమ్మున విద్యార్థుల
మనములు రంజిల్లు నట్లు మధురముగా బో
ధన మొనరించిన **జగన్మో**
హన రావు ప్రతిభను దలచి ఆనందింతున్

క్షితి ప్రభు కాంతా హిత స
మ్మితమై యలరు కవితవలె మేథమెటిక్స్‌లో
ను తరగతి బోధనల నవ
గతమగు నీలక్షణాలు గణగణఘంటా

సిహెచ్. వి. నరసింహారావు

(1939) (విజయవాడ)

బెజవాడ గణిత సంఘపు (*A.I.M.Ed.)
విజయములకు కృషి సలిపెడి విజ్ఞులలో స్ఫూ
ర్తి జనింప శ్రమియించెడి
సుజనుడు **నరసింహరావు** శుభమాతనికిన్

* Association for Improvement of Mathematics Education

పి.ఎస్.ఎన్. శాస్త్రి

(1943) (విజయవాడ)

తనదైన విలక్షణ ధో
రణిలోన గణితమునకు నిరంతర సేవన్
దనిసెడి వ్యక్తిని మంచి హి
తుని **పిల్లలమర్రి**ని దలతును మోదముతో

డి.ఎస్.ఎన్. శాస్త్రి

(1947) (మచిలీపట్నం)

గణితము బోధించుటలో
ననుసరణీయమ్ములైన అంశమ్ములలో
ఘనుడైన మనీషిని మి
త్రుని దువ్వూరి కులజు దలతునుత్సుకతన్

ఎస్.వి. రమణయ్య

(1930–2020) (వి.ఆర్. కాలేజి, నెల్లూరు)

తరగతిని గణితబోధన
నిరతము రుచికరముగ జేసి నెల్లూరున కా
పురముండిన సజ్జనుడు **యశ
స్వి రమణయ** మహాశయునకు సేతునమస్సుల్

శైలేష్ షిరాలి

(1954) (రిషీవ్యాలీ, చిత్తూరు జిల్లా, ఆం.ప్ర.)

గణితమును గురించిన చ
క్కని వ్యాసములు రచియించి కమ్మని వాక్కుల్
వినిచెడి **షిరాలి** మేధా
విని మెచ్చుకొనంగ మదిని వేడుక పొడమున్

పరిశోధనలో పొత్తము
ల రచనలో బోధనమున లబ్ధయశస్కుం
డు రిషీవేలీ ప్రముఖుడు
షిరాలి గణితజ్ఞునభిలషింతు నుతింపన్

పి. శేషప్ప

(1927–2005) (కడప, ఆం.ప్ర.)

గొప్పగణిత బోధకుడని
మెప్పొవడసె శిష్యగణమమేయము **పీ.శే.**
షప్పకు మాన్య చరితుడత
డెప్పుడు తనశిష్యవరుల హితమును గోరెన్

వెంకటేశ్ మూర్తి

(1941– 2018) (బెంగుళూరు)

జనరంజక పుస్తకములు
గణితమ్మున వ్రాసి కమ్మగా తరగతి బో
ధన యొనరించెడి పంతుల
ని నుతిగనిన **మూర్తి**ని హితుని దలతు సుమతిన్

వి. శివరాం ప్రసాద్

(1947) (ఉస్మానియా యూనివర్శిటి, హైదరాబాదు)

ప్రావీణ్యము పండగ సం
ఖ్యావాదమున ప్రచురణల గావించిన వి
ద్యావేత్తను, సుజనుని, మే
ధావిని **శివరాం ప్రసాద్**ను దలచిన ముదమౌ

వై. వెంకటేశ్వర రెడ్డి

(1947) (ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, గుంటూరు)

పేరు ప్రతిష్ఠలు తెచ్చిన
వారై మీ శిష్యవరులు వర్ధిల్లగ న
వ్వారిగ శ్రమియించెడి **వై**
వీ రెడ్డిని దలప మదిని వేడుక పొడమున్

కె. సత్యనారాయణ

(1949) (ఉస్మానియా యూనివర్సిటి, హైదరాబాద్)

పరిశోధన సాగించిన
పరిమితమౌజ్యామితి (Finite Geometry)
పయి పత్రాల్ ప్రచురించి రసభరిత ప్రసంగాల్
నెరపెడి **నారాయణ**కగు నిత్యము శుభముల్

ఎ. రాధాకృష్ణ

(1935) (కాకతీయ యూనివర్సిటి, వరంగల్)

బీజ గణితమందున ను
త్తేజ పరచి శిష్యుల ప్రగతికి కారకుడై
రాజిలు **రాధాకృష్ణ**ను
సౌజన్యాకృతిని హితుని సంభావింతున్

వి.జి. టికేకర్

(1935) (ఐ.ఐ.ఎస్ సి, బెంగుళూరు)

తరగతి బోధన మందున
పరిశోధనలన్ సభలనుపన్యాసములన్
సరళత రమణీయతలను
కురిపించు టికేకరుడు సఖుడు సహృదయుడున్

ఎన్.ఎం. బుజుర్కే

(1944) (కర్ణాటక యూనివర్సిటి, ధార్వాడ్)

ద్రవగత్యధ్యయనమునకు
నవ పథములను సృజియించి నవసిద్ధాంతాల్
హవణిల్ల జెసె బుద్ధి బ
లవంతుడు బుజుర్కెను తలతు లలితవచస్విన్

B.S. Kirangari

(1943) (మైసూర్ యూనివర్సిటి, మైసూరు)

సోఫస్లీ (Sophus Lie) గణితము న
ధ్యాపన మొనరించు మేటి ఆచార్యుండై
రూపుగొనినట్టి సౌమ్యత
గా పేరున్న **కిరణగిరి**కి కలుగుశుభమ్ముల్

ఎస్. భార్గవ

(1940) (మైసూర్ యూనివర్సిటీ, మైసూరు)

రామానుజు గణితమ్మును
ప్రేమించెను సంఖ్యలను గురించిన రచనల్
ప్రామాణికములు జేసెన్
ధీమంతుడు భార్గవు నుతింతు ముదమునన్

కె.బి. నాయుడు

(1939) (IIT-Madras, Sri Satya Sai Institute of Higher Learning, Puttapati)

గణితనమూ నాలపయి న
గణితముగా కృషి యొనర్చికనుగొనె ఫలితాల్
గణనీయముగా మెచ్చు కొ
నెను ★బాబా కే బి యన్ ను స్నిగ్ధమనస్కున్
(*Sri Satya Sai Baba, Puttaparti)

జి.వి. కృష్ణారెడ్డి

(1938) (Moscow Univ. - Moscow, PSG Tech. Coimbatore)

గణితమ్మున పాండితి, బో
ధన పరిశోధన యెడల విదగ్ధత పరిపా
లన మందభిరుచి యున్న హి
తుని కృష్ణారెడ్డిని చరితును మోదముతో

ప్రహ్లాద చంద్రవైద్య

(1918-2010) (P.C. Vaidya) (అహ్మదాబాద్)

గణితాచార్యుడు గాంధీ
యనుసారిగ ప్రముఖుడు ఘనుడైన్‌స్టీన్ వాద
మ్మునకు విజయగీతిక పా
డిన **పీ.సీ. వైద్య**ను పొగడిన సంతసమౌ

వేణుగోపాల్ హేరూర్

(1952) (గుల్బర్గా, కర్ణాటక)

భారత గణితమ్మనబడు
పారావారమున మునిగి బయటికిఁదెచ్చెన్
నేరుపున **వేణుగోపాల్**
హేరూరు పలుకృతులుగ రహిల్లెడిముత్యాల్

ఎం. వెంకటాచలప్ప

(1947) (బెంగుళూరు యూనివర్శిటి, బెంగుళూరు)

ద్రవగమన శోధనమ్మున
నవీన ఫలితములు దెచ్చిన గణిత విజ్ఞా
ని వినుతిగొనే పలువిధములు
గ వెంకటాచలమతడు నిగర్వి సుజనుడున్

కె. శ్రీనివాసరావు

(1942) (Math Science,చెన్నై)

భౌతిక శాస్త్ర గణితములు
ప్రీతిగ నధ్యయనమునొనరిచి **కే.ఎస్.రావ్**
ఖ్యాతిగనె రచయితగ, వా
క్చాతురిగల విజ్ఞుడుగ, విశారదుడు గనున్

పి. కందసామి

(1948) (భారతియార్ యూనివర్శిటి, కోయంబత్తూర్)

పరిశోధన బోధనము ప్ర
చురణ ప్రసంగాల యందు శోభిల్లన్
నిరతము కృషి సలిపెడి మి
త్రరత్నము **పి. కందసామి** ధన్యుని తలతున్

ఆర్. బాలకృష్ణన్

(1937) (అణ్ణామలై, భారతిదాసన్ యూనివర్శిటీలు చిదంబరం, తిరుచిరాపల్లి)

గణిత జనుల కార్బీగా (RB)
వినుతిగొనిన పండితుండు, విరివిగ శిష్యా
ళిని గలిగిన ఆచార్యుం
డు, నిరంతర గణితరక్తుడు జయమతనికిన్

ఎస్. కుమరేశన్

(1950) (హైదరాబాద్ యూనివర్శిటి)

గణితమున వివిధ కుశలత
లను గలిగి రచనలు చేసె శ్లాఘ్యుడు **కుమరే**
శను పిల్లల గణితాస
క్తిని బెంచ ఎం.టి.టి.ఎస్. కధిపతిగ నమరెన్

M.T.T.S (Mathematics Training and Talent Search) A Trust established to promote skill in higher mathematics since 1993.

I.R.B. శర్మ

(1940) (ఆచార్య నాగార్జున యూనివర్శిటి, గుంటూరు)

గణితమ్మున గల విశ్లే
షణ భాగమ్మున నిపుణుని సదమల గుణభూ
షణునిన్ **ఐ.ఆర్. బీ.శ**
ర్మను ప్రస్తావింప కోర్కె మదిలో పొడమెన్

T. Amarnadh

(1951) (హైదరాబాదు యూనివర్శిటి)

ద్రవగతిపరిశోధనకై
అవకలన సమీకరణములధ్యయనమొన
ర్చి విలువ గల రచనలుచే
సివాసి గనె గణితవేత్త స్నిగ్ధుడ**మరనాధ్**

S.G. Dani

(1947) (IIT-Mumbai)

గణితవిశారదుడుగ ఖ్యా
తిని బడసి వివిధ పదవులధిష్ఠించిన డా
ణిని భారతగణిత జ్యో
తిని ప్రస్తుతి జేయుటకు మది ముదము కలుగున్

రవి పి. అగర్వాల్

(1947) (ఐ.ఐ.టి. కాన్పూరు, Texas A & M Univ., US)

భారతదేశపు గణిత వి
శారదుడు విదేశమున యశస్వంతుండై
గౌరవమందిన దేశికు
డై **రవి** ప్రచురించే కృతుల నతులిత భంగిన్

రతన్ పి. అగర్వాల్

(1925–2008) (లక్నో, జైపూర్ యూనివర్శిటీలు)

పరిశోధక సంస్కృతి ను
ద్ధరించి శిష్యగణములకు తగుశిక్షణ లి
చ్చి **రతన్ పి. అగర్వాల్** గణి
తరాణ్మణిగ వెలిగె శాస్త్ర ధరణిన్ గురువై

రామానుజ గణితమ్మును
ప్రేమించెను వివరణల గురించి శ్రమించెన్
ప్రామాణికమైన కృతుల
భూమికలిచ్చెను గణిత విభుడగు నగర్వాల్

ఎం.ఆర్. అధికారి

(1944) (కలకత్తా యూనివర్సిటీ)

ప్రగత గణితశాఖలపై
పొగడఁ దగిన పత్రములను పొత్తములు వ్రా
సి గణిత బోధనలో పే
రు గడించిన మిత్రుని గనరో **అధికారిన్**

కె.వి.వి. సత్యనారాయణ

(1962) (రామచంద్రాపురం, తూ.గో. జిల్లా)

రామానుజు పేర గణిత
ప్రేమికులను గౌరవించి పిల్లల గణనా
సామర్ధ్యము పెంచు కృషిన్
నేమంబుగ నిర్వహించు నేర్పరి **కె.వి.వీ.**

వి.ఎన్. సింగ్

(1920–1989) (జోధాపూర్, ఢిల్లీ, భోపాల్)

ఇరువదవ శతాబ్ది గణిత
గురుతిలకులలో నౌకరుగ గుర్తింపబడెన్
పరిశోధన పరిపాలన
మిరుతెరగుల మివుల ఖ్యాతికెక్కె **యు.ఎన్. సింగ్**

S.N. Majhi

(1940)(ఐ.ఐ.టి. మదరాసు)

ద్రవగతి శాస్త్రాధ్యయనము
నవలీలగ జేసె వ్రాసె నద్భుత పత్రాల్
నవనీతమనస్కుడు సం
స్తవనీయాచార్యుడు సహృదయుడును **మాఝీ**

*దినేష్ సింగ్

(1955)(Imperial College, London, Univ. Delhi)

గణితమ్మున తండ్రికి మిం
చిన తనయుడుగా **దినేష్** ప్రసిద్ధిబడయ పూ
నెను, పలు కొలువుల నమరి, కొ
నెను పద్మశ్రీ పతకము నిత్యకృషికుడై
★ Prof. V.N. Singh కుమారుడు

స్వాధీన్ పట్టనాయక్

(1940) (Institute of Mathematics and Applications
Bhuvaneshwar - Odissa)

గణితాచార్యనభమున ద్యు
మణిగ వెలుగు, జనహితుడగు మాన్యుని తేజ
స్విని **పట్టనాయకుని** స
ద్గుణి నై. ఎం.ఎ (I.M.A) ను పెనిచినగురువును దలతున్

వీరవల్లి శేషాద్రి వరదరాజన్ (V.S.V) (1937-2019)

(ISI – కోల్‌కతా, కాలిఫోర్నియా యూనివర్శిటీ, U.S.)

వివిధ గణిత శాఖలలో
భువన స్థాయిని యశమును బొందిన **శేషా
ద్రివరదరాజన్** గని వి
శ్వవిబుధులబ్బుర పడిరి – నివాళులతనికిన్

కె.ఎం. శాస్త్రి

(1940) (ఆంధ్ర లయోలా కళాశాల, విజయవాడ)

బోధన, గణిత సమస్యల
సాధన, పఠనములొనర్చి శాస్త్రజ్ఞుల నా
రాధించు కె.ఎం. శాస్త్రిని
మేధావిని దీర్ఘకాలమిత్రుని దలతున్

బి.ఆర్. సేత్

(1907–1979) (ఐ.ఐ.టి., ఖరగ్‌పూర్)

వినియుక్త గణిత భవన
మ్మున మణిదీపముగవెల్గి, ముమ్మరముగ శి
ష్యనికాయమ్ములను మహా
గణితజ్ఞులుగా మలచిన ఘనుడుగదా **సేత్**

హంసరాజ్ గుప్త

(1902–1988) (పంజాబ్ యూనివర్సిటి, చండీగడ్, కెనడా)

కష్టమయిన గణితాంశము
లిష్టము కలిగించు రీతి నింపుగ కడు సం
తుష్టికరముగ బోధించెడి
మేష్టరు గుప్త గణితమున మేటిగ వెలిగెన్

M.K. Jain

(1932-2020) (I.I.T. - Delhi)

గణితపు సంఖ్యా విశ్లే
షణమునకు సమగ్రమైన చక్కని గ్రంథ
మ్మును వ్రాసి వినుతి కెక్కిన
గణితాచార్యుడు పేరుగనె **యం.కే. జైన్**

అడ్లూరి నరసింహమూర్తి

(1958) (హనుమకొండ, వరంగల్)

నరసింహమూర్తి గణితము
కొరకై యొనరించు కృషిని గొనియాడ వలెన్
గురువులలో పిల్లలలో
పెరిగెనుగద ప్రీతి గణితభీతి తొలంగన్

కె. ప్రభాకర్

(1949) (విజయవాడ)

బెజవాడ గణిత సంస్థను (AIMEd.)
విజయ పథమున నడిపించి విజ్ఞులు మెచ్చన్
విజయుండయ్యె **ప్రభాకర్**
సుజనుడు సహృదయుడు గణితసూరి కభినుతుల్

జె. ప్రకాశ్

(1944) (Botswana, South Africa)

సంచార గణితవేత్త ప్ర
పంచమ్మున పెక్కుచోట్ల ప్రాసంగికుడై
మంచి గణిత పండితుడని
పించుకొని **ప్రకాశ్** ప్రముఖుల ప్రేముడి బొందెన్

పూజ్యం కామేశ్వరశర్మ

(1945) (విజయవాడ)

బెజవాడ గణిత సంస్థను (AIMED)
నిజ సంతానమనుకొని బెంచెకడు ప్రేమన్
సుజనుడు **పూజ్యం శర్మ** గు
రుజాతి రత్నమతడు చతురుడు బోధనలో

అల్లాడి కృష్ణస్వామి

(1955) (Univ. of Florida, Gainesville, US)

భారత గణిత జ్యోతిగ
ఫ్లోరిడలో వెలుగుచున్న ప్రొఫెసర్ సంఖ్యా
పారగు **కృష్ణస్వామిని**
పేరిమి నల్లాడి బిడ్డ పేర్కొన వలయున్

కె.ఎస్.ఎస్. నంబూద్రి పాద్

(1935– 2020) (కేరళ యూనివర్సిటి, తిరువనంతపురం)

కేరళ గణితవికాసము
కోరి కృషి యొనరించె గణితకోవిదుడు సదా
చారుడు **నంబూదిరి,** మన
సార ప్రశంసింతు నతని శాస్త్రప్రతిభన్

ప్రముఖుండాల్ జీబ్రాలో
ప్రముఖులుగా జేసె శిష్య పరిశోధకులన్
సెమిగ్రూప్ ఫలితము లతనివి
అమెరిక గణిత సముదాయ (AMS) మభినందించెన్

A.M. Mathai

(1935) (Centre for Mathematics, Pala - Kerala,
Mc Gill Univ., Canada)

పాలాలో ప్రౌఢగణిత
శాలకు సంచాలకుడు, విశారదుడు "**మత్తై**"
మౌలిక పరిశోధనలకు
శాలగ సంస్థను మలచెను శ్రద్ధాసక్తిన్

దామోదర ధర్మానంద కోశాంబి

(1907–1966) (గోవా, వారణాసి, పూణె, ఇంగ్లండ్
(Cambridge), Harward, IAS (Princeton) - US)

గణితము, భారత విజ్ఞా
న నిధులు, కమ్యూనిజమును, నాణేల కథల్ –
ఘనులు, ఘన సంస్థలతో
మనుగడ – **కోశాంబి** చరిత, మానితము గదా!

కోశాంబి మేప్ ప్రమేయ (Kosambi Map Function)
ప్రాశస్త్యమునుగ్గడించి, పై బీటా కా
పాశ్రృంగము, బూర్ బాకీ
ఆశయాదరణల గణితావని మెచ్చెన్

జె. హనుమంతాచారి

(1942) (శ్రీవేంకటేశ్వర యూనివర్శిటి, తిరుపతి)

హనుమంతాచారి గణిత
మున సెమిగ్రూప్‌ల పయి కృషి ప్రముఖముగ సాగిం
చెను శిష్యగణములను శి
క్షణ నిచ్చుచు గణిత జనులుగా తీర్చెనహో

టి. ఫణీంద్ర

(V.I.T, Vellore) (1971)

గణితమునకు తొడుగులుగా
తెనుగును సమకూర్చు ధీనిధి **ఫణీంద్ర**ను బో
ధన శోధనలందును యశ
మును సాధించిన గణిత ప్రముఖుడని చెబుదున్

టి. విజయరాఘవన్

(1902–1955) (రామానుజన్ ఇన్‌స్టిట్యూట్, మదరాసు యూనివర్శిటి)

గణితపు విశ్లేషణలో
ఘనుండు హార్డీని (GH Hardy) గురువుగ గొనిన ధన్యుం
డు నవగణిత వైతాళికు
డ నర్గళ వచస్వి విజయ కభినుతులివిగో

రామానుజ సంస్థ

(రామానుజన్ Institute)కు తొలి
గ్రామణి (Director) గా సేవచేసి గణిత జనులలో
ధీమణిగ, **విజయ రాఘవ**
సామర్థ్యము జూపె గణితశారద మెచ్చన్

బి. మహేశ్వరి

(1955) (శ్రీపద్మావతీ మహిళా యూనివర్శిటి, తిరుపతి)

పరిశోధన గ్రాఫ్ థియరీ
వరపత్రాలు వెలువరిచి వాసిగనె **మహే**
శ్వరి, బోధనలో జూపె చ
తురత తరగతిని నిరతము సంతుష్టలు శిష్యుల్

టి. త్రివిక్రమన్

(1943- 2024 CUSAT - కొచ్చి, కేరళ)

టీటీగా ప్రఖ్యాతుం
డై టోపాలజి మధించే నట కేరళలో
మేటి, గణితమ్మున ఘనా
పాఠి, **త్రివిక్రము**ని ఛాత్రబాంధవుడందున్

ఐనంపూడి చంద్రమోహన్

(1945–2018) (శ్రీవేంకటేశ్వర యూనివర్శిటి, తిరుపతి)

పుస్తక రచయిత శిష్యుల
మస్తకముల కెక్కునట్లు మక్కువ మీరన్
నిస్తులమగు బోధనతో
విస్తృత కీర్తిగనె గణితవేత్తగ **మోహన్**

ఎం. శ్యాంబాబు

(1941–1999) (శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి)

గుణవంతుడైన వ్యక్తిగ
గణిత ధరిత్రిని మని అకటకట పరమపదిం
చెను నడిప్రాయముననే **శ్యామ్**
గణితము బోధించె శిష్యగణములు మెచ్చన్

నందనూరు భాస్కరరెడ్డి

(1955) (శ్రీవేంకటేశ్వర యూనివర్సిటి, తిరుపతి)

ద్రవగమనాధ్యయనమ్ము వి
లువైన పత్రప్రచురణలు గణితకళ యం
దు విశేష ప్రతిభ వాగ్వై
భవమ్ము గల విజ్ఞుడనెద **భాస్కరరెడ్డి**న్

రవీంద్రనాధ్ బాబు

(1963) (రాయచోటి – ఆం.ప్ర.)

బడిపిల్లలలో గణిత
మ్మెడ ప్రీతి పెరుగుట కొరకు నినుమిక్కిలిగా
కుడియెడమల శ్రమియించెడి
బడిపంతులు **రవి**ని నేను ప్రస్తావింతున్

ఎస్. లీల

(1936) (న్యూయార్క్, యు.ఎస్.)

అసరళ విశ్లేషణమున (Non Linear Analysis)
ప్రసిద్ధిగనె మహిళ "**లీల**"– పలువిధములుగా
న సమానమైన పాండి
త్య సంపదల కావిడ నిలయమ్మై వెలయున్

కొత్తపల్లి రామమోహనరావు

(1950) (ఆంధ్రా యూనివర్శిటి, విశాఖపట్నం)

గ్రూపుథియరి వినియోగము
పై పరిశోధనలు జేసి పత్రాల్ వ్రాసెన్
నైపుణ్యము గల మేష్టరు
గా పుస్తక రచయితగ నుతిగనె **రామ్మోహన్**

జి.సి. రావు

(1954) (ఆంధ్రా యూనివర్శిటీ, విశాఖపట్నం)

బూలియనాల్ జీబ్రా నవ
లీలగ శోధించి వరఫలితరాశిని ప
త్రాలుగ ప్రచురించి ప్రసం
గాలొనరించిన విబుధుదు గద **జీ.సీ. రావ్**

ఎల్. నాగమునిరెడ్డి

(1943) (శ్రీవేంకటేశ్వర యూనివర్శిటి, తిరుపతి)

విద్యార్థి జనుల ప్రేమ స
హోద్యోగ గణ ప్రశంసలుత్తమ పత్రాల్
హృద్యము బోధన ప్రతిభా?
చోద్యము! **నాగమునిరెడ్డి** సూరికి శుభమౌ

డి. రాధాకృష్ణరెడ్డి

(1944) (ఆంధ్ర యూనివర్శిటీ, విశాఖపట్నం)

రిలెటివిటి కాస్మాలజిపై (Relativity & Cosmology)
విలువ గల ఫలిత చయముల వెలువరచెను శి
ష్యుల ప్రగతి ప్రోత్సహించెను
విలక్షణ గణిత విభుడు, కవియు, **డీ.ఆర్.కే.**

టి. లింగరాజు

(1961) (ఆంధ్ర యూనివర్శిటి, విశాఖపట్నం)

ద్రవగతి గణితాధ్యయనము
నవబోధము శోధనమున నలరుచు పత్రాదుల్
లు వెలువరచు మేష్టరుగా
ప్రవర్ధిలుహితుండు **లింగరాజు**కు జయమౌ

R.P. Bambah (1925-2025) (UK (Cambridge), US (Ohio State Univ.), Panjab Univ., Chandigarh)

పుంభావ గణితవాణిగ
బంభానీ నాటి గణిత పండిత వృషభుల్
సంభావింతురు సంఖ్యా
గంభీర విదుడతడనెడి ఖ్యాతిన్‌గాంచెన్

గణితమున పద్మభూషణు
డను బిరుదము బడసినట్టి ఆచార్యవరుం
డని దేశశాస్త్ర ప్రవరుం
డని కొనియాడబడి మనెడి యతడే బంభా

సర్వదమన్ చావ్లా

(1907-1995) (British born Indian American Mathematician U.K., India, US)

గణితమున వివిధ భాగము
లను సంపన్నమొనరించి లంపటుడై ఖ్యా
తిని గనెను ప్రపంచ స్థా
యిని **సర్వదమన చవల** గయికొనుము ప్రణతుల్

కె.రామసుబ్రమణియన్

(1969)(ఐ.ఐ.టి. ముంబయ్)

భారత విజ్ఞాన నిధుల
నోరిమితో త్రవ్వి కృతుల నుత్తనామరీతిన్
గూరిచిన **సుబ్రమణియన్**
పారంగతుడు పలుశాస్త్రవిభాగములందున్

ఆర్.ఎస్. మల్లికార్జునమ్

(1938)(జవహర్ భారతి, కావలి)

కావలి జవహర్ భారతి
లో విద్యార్థులు సహచరులు ప్రశంసింపన్
సేవించె గణితవాణిని
భావుకుడు సహృదయుడు హితవరుడార్ **ఎస్.ఎం.**

సి. సంజీవరావు

(1928) (వి.ఆర్. కళాశాల, నెల్లూరు)

గణితము తత్త్వమును గలిపి
తనదైన విలక్షణతను తరగతి గదిలో
ననుదినము ప్రదర్శించిన
మనీషి **సంజీవరావు** మాన్యుడు తలతున్

రేమెళ్ళ అవధానులు

(1948) శ్రీవేదభారతి, హైదరాబాదు

భారతోర్విని పూర్వగణిత
చరిత్రలను జనులకు పరిచయమును గావిం
చు రచనలను జేసిన నే
ర్పరి రే**మెళ్ళ అవధాని** ప్రముఖుని దలతున్

అంబట్ విజయకుమార్

(1958)(CUSAT, కొచ్చి, కేరళ)

బోధన విస్తరణము పరి
శోధన రంగముల నేర్మి జూపిన **అంబట్**
సాధనమున బడిపిల్లల
మేధావుల జేయు కృషియు మిక్కిలిచేసెన్

ఎ.ఎస్. వత్సల

(1947) (చెన్నై, బెంగుళూరు, U.S.)

అవకలన సమాకలనము
ల వరలు★ లాక్షణికముగా
వివరణములిచ్చె గణిత వని
త వత్సల సతము విజయ పథమ్ముల నడచున్
*(Differential and Integral In-equalities)

రామన్ పరిమళ

(1948)(చెన్నై, TIFR (ముంబయ్), Emory Univ. (US))

బీజగణిత వనమున మృగ
రాజుగ విహరించి మంచి ప్రచురణములతో
రాజిల్లు మహిళ **పరిమళ**
తేజోవతి గణిత శాస్త్రదీప్తిని జూపెన్

టి.ఎ. సరస్వతి అమ్మ

(1918-2000) (కేరళ (పాలక్కాడ్, ఎర్నాకులం, ఓట్టపాళెం), చెన్నై, వారణాసి, రాంచి)

భారతదేశపు జ్యామితి
నేరిచి కూర్చెనొకకృతిని నిపుణత్వముతో

సూరివరులు మెచ్చుకొనగ
సారమతి **సరస్వతమ్మ** జన్మ తరింపన్

*రతన్ శంకర్ మిశ్రా (R.S. Misra)

(ఢిల్లీ, గోరఖ్‌పూర్, అలహాబాద్, లక్నో, జమ్ము మొ॥)(1918–1999)

రిలెటివిటి ద్రవగతియు నవ
కలనజ్యామితులలోనఖండప్రతిభా
నిలయున్ పద్మశ్రీగా
విలసితు **మిశ్రా**నుగౌర వింతున్ మివులన్

యూనిఫయిడ్ ఫీల్డ్‌థియరీ
లో నిష్ణాతుడు గణితములో బహుముఖ ప్ర
జ్ఞానిధి పద్మశ్రీ మి
శ్రాను నమస్కృతులతో ప్రశంసింపవలెన్

ప్రఖ్య సత్యనారాయణ శర్మ

(1955) (విజయవాడ)

బెజవాడ గణిత సంస్థను (AIMEd)
భుజములపై మోసినట్టి ముఖ్యుల నొకడై
సృజనాత్మకబోధనమున
విజయము సాధించే "**ప్రఖ్య**" విబుధులు మెచ్చన్

ఎ.ఎం. వైద్య

(1935) (గుజరాత్ యూనివర్శిటి, అహ్మదాబాదు)

గణితపు సంఖ్యావాద
మ్మున ప్రావీణ్యము కలిగిన ప్రొఫెసర్‌గా కీ
ర్తిని గాంచిన మిత్రుని **వై**
ద్యను గణిత కళానిధియని అభినందింతున్

డి.వి. కృష్ణ

(1945-2010) (శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటి, అనంతపురం)

ద్రవగతి విన్యాసములను
వివరింపం గోరినూత్న విజ్ఞానమ్మున్
చివురించు కీనుచు పత్రాల్
అవిరళముగ వెలువరచిన ఖ్యాతుడు **డి.వి.కే.**

డి.ఆర్.వి. ప్రసాదరావు

(1951) (శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటి,అనంతపురం)

పరిశోధక విద్యార్థుల
విరివిగ నుత్సాహ పరచి విజయశిఖరముల్
బిరబిర జేరగ కృషి చే
సి రాజిల్లు **ప్రసాదరావు** క్షేమము నెంతున్

జి. బాలసుబ్రహ్మణ్యం

(1937) (శ్రీవేంకటేశ్వర యూనివర్సిటి, తిరుపతి)

మృదుభాషి మితభాషి స
హృదయుడు విద్యార్థి సన్నిహితుడు గణిత వే
త్త దయా గుణశీలి ఉదా
త్త దేశికుడు **జీ.బి.ఎస్** ను దలతును ప్రేమన్

వంగీపురం శ్రీనివాసన్

(1941) (శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి)

తొలిదశ సంఖ్యావాదము
మలిదశలో గ్రాఫుథియరి మంచి ఫలితాల్
వెలువరిచిన మేధావి గురు
తిలకము ''**యస్వీ**'' అనుచు నుతింతురు జనముల్

జి. సరోజమ్మ

(1955) (శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటి, తిరుపతి)

ద్రవగతి పరిశోధనలో
నవపథముల నడచినట్టి నారీమణిగా
స్తవనీయ **సరోజమ్మ**కు
శివమగు గాతయని చెప్ప చిత్తము మురియున్

వీరవల్లి శ్రీనివాసన్

(శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి)(1939)

పరిశోధన కృషిలో సహ
చరుడైన గణిత ప్రియుండు సాత్వికగుణ శే
ఖరుడు మితభాషి **వీ ఎస్**
తరగతి విద్యార్థుల యెడతాలిమి జూపెన్

ఇ. సంపత్కుమార్

(1936) (దార్వాడ్, మైసూరు)

ఇంపు గొలుపు గ్రాఫ్ థియరిని
సంపన్నము జేసినట్టి శాస్త్రజ్ఞుండై
సంపత్కుమార వ్రాసెను
నింపాదిగ పత్రములను నేరిమితోడన్

బిభూతి భూషణ దత్తా చిటగాంగ్

(చిటగాంగ్ ప్రస్తుతం బాంగ్లాదేశ్, కలకత్తా యూనివర్శిటి) (1888–1958),
అవదేశ్ నారాయణ సింగ్ (లక్నో యూనివర్శిటి) (1901–1954)

హైందవ గణిత చరిత్రల
నందరికిని దెలియజేయ "**నవదేశ్**" తోడన్
పొందికతో గ్రంథ ద్వయ
మందించెను ''భూషణుడు'' గుణాఢ్యులు మెచ్చన్

కె.వి. శర్మ

(1919-2000) (కేరళ, మదరాసు యూనివర్శిటీలు)

భారత ఖగోళ విజ్ఞా
నారామమున విహరించి, అద్భుత కృతులన్
గూర్చి కేరళ కీర్తికి
హారతులందించే శర్మకభివందనముల్

కృపాశంకర్ శుక్లా

(1918-2007)(అలహాబాదు, లక్నో యూనివర్శిటీలు)

భారత ఖగోళ శాస్త్రము
పై రమ్యమయిన కృతులను పత్రాలను వి
స్తారముగా **శంకర శు**
క్లా రచియించెను యశమును గాంచెను మివులన్

బాపుదేవశాస్త్రి నరసింహ దేవపరంజపే

(1821-1900) (నాగపూరు, వారణాసి)

ప్రాచీన భరత గణిత మ
ర్వాచీన గణితము లుభయ రంగమ్ములలో
వాచస్పతి యనియెద సం
కోచ పడక శాస్త్రి వరుని గురునిగ దలతున్

సువర్ణ

(1953) (శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటి, అనంతపురం)

నానసొసియెటివ్ రింగుల (Non-associative Rings)
పైనవిరళముగ కృషి యొనర్చె పలుశిష్యుల వి
జ్ఞానులుగా జేసిన ద
మ్మానిని కళతూర్ **సువర్ణ**, మన్ననలందెన్

పి. సుందరం

(1943) (పొల్లాచ్చి – తమిళనాడు)

టోపాలజీ విశ్లేషణ
లాపోశన పట్టె **సుందరాఖ్యుడు** మిత్రుం
డా పొల్లాచ్చి నగరమున
కాపురముండు బడసి నుతి గణితజ్ఞుడుగా

మారుతి ప్రసాద్

(1970) (GITAM యూనివర్శిటీ, హైదరాబాద్)

''గీతం'' సంస్థలకు గణిత
కేతనమై శోధనమున కీర్తి తరగతిన్
చేతో మోదము కలుగగ
ప్రీతిని బోధించి మంచిపేరుగనె **ప్రసాద్**

వై.ఎన్. రెడ్డి

(1958) (NIT, వరంగల్)

కవితకు వలె గణితమునకు
జవసత్త్వమ్ముల నొసగి ప్రసంగించెడి నే
ర్పు విరివిగ కల గణిత
వ్యవహారవిదుని దలతును **వై.ఎన్. రెడ్డిన్**

సుభాష్ ఎం. బుసునూర్ మఠ్ (ధార్వాడ, కర్ణాటక)

బుసునూర్‌మఠ్ కాంప్లెక్స్ అన
లిసిస్సున (Complex Analysis) ప్రతిభకతమైన వెలిగె
ను తనదుశి ష్యసమూహముల్ భళీయన
వసించు ధార్వాడుకు గరువము కలిగించెన్

Keith Devlin

(1947) (U.K, Canada, US)

గణితమ్మును జనరంజక
మొనరించుటకై నలయక నుత్సాహముతో
డ, నిరతము కృషి యొనర్చు సు
జనుండు **కీత్ డెవ్ లిను** ను ప్రశంసింపవలెన్

టీ. వేంకటేశ్

(1957) (బెళగావి – కర్ణాటక)

ఆవేశముతోడ గణిత
భావాంబర వీధి తిరుగు పండితుడనెదన్
టీ. వేంకటేశ్ సఖుని బెళ
గావిని వసియించు గణిత గంధర్వుడహో

పరశురాం పిళ్ళై

(1938–2018) (తిరుపతి, A.P.)

పిల్లలలో గణితముపై
నుల్లాసము పెల్లుబుకగ నుద్బోధించెన్
కొల్లలుగా శిష్యులు రా
జిల్ల మనిన హితుడు కీర్తిశేషుడు **పిళ్ళై**

శ్రీహరి నాగూర్

(1949) (M.I.T. USA)

సెమిగ్రూప్ గ్రాఫ్ థియరీలో (Semi group, Graph Theory)
ప్రముఖముగా ఫలితములను పండించిన మా
న్య మహిళ శ్రీహరినాగూరు
పంచి చొదెనీ మొసగు తరుణిగా వెలుగున్

ఆర్. బాలసుబ్రమణియన్

(1951) (Matscience, Chennai)

వారింగు సమస్య (Waring's Problem in Number Theory)ను కడు
నేరుపుతో విడమరచిన నిపుణుడు
సంఖ్యా పారగుడై పద్మశ్రీ
గౌరవ మందుకొనిన ప్రముఖ వ్యక్తి **ఆర్బీ**

నల్లూరి విజయప్రసాద్

(1942) (రాజమహేంద్రవరం, A.P.)

జ్యామితిపై వాల్లభ్యము
ప్రేమగణితబోధనమున పేరుప్రతిష్టల్
సామాజిక జీవనమున
ధీమాన్య **విజయప్రసాద్**ను దేవుడు బ్రోచున్

ఎం. సుందరమూర్తి

(1949) (శ్రీవేంకటేశ్వర యూనివర్శిటి, తిరుపతి)

నరహరిగురువుగ ఓ.ఆర్. (O.R.)
పరిశోధన భాగము పలు ఫలితాలను **సుం**
దరమూర్తి బయలు పరచెను
తరగతి పాఠములు జెప్పెతాలిమిగలగన్

పి.కె. శ్రీనివాసన్

(1924–2005) (చెన్నై)

గణిత ప్రసిద్ధికి కృషిచే
సిన అధ్యాపకుడు **పి.కె. శ్రీ** ని తలంతున్
మన రామానుజుని గురిం
చిన సేవలలో మురిసిన స్నేహితుడు గదా!

కె. వజ్రవేలు

(Univ. of Central Florida, Orlando, US)

ద్రవగమన వ్యవహారము
వివరించిన మీ కృతులు విస్తృతి కలిగెన్
భువనస్థాయిని, గనుక న
భి వందనములందుకొనుము ప్రేముడి కేవీ!

జి.పి. రాజశేఖర్

(1970) (I.I.T. Kharagpur, India)

కవితాగానము వలె గణి
త విషయ భాషణములు ప్రగత ప్రచురణమున్
చవులూరెడి బోధన
లివి శేఖర్ స్వంతములని యెదను ముదమునన్

నల్లూరు మహేశ్వరరావు

(1978) (National Univ., SUVA, Fizi)

బీజగణితముగ పిదప సం
ఖ్యాజగతిని కృషి గణిత ప్రకాండులు మెచ్చన్
ఫ్జి మహేశ్వర రావును
సౌజన్యాకృతిని దలప సంబరపడుదున్

కుంచం శ్యాంప్రసాద్

(1970) (Manipal Institute of Technology, Manipal, Karnataka)

గామా నియర్ వలయముల (Gamma Near Rays)
పై మేదురముగ పలుపత్ర ప్రచురణల్
ప్రామాణికమైనవి తన
శేముషికి నిదర్శనముగ జేసె ప్రసాద్ శ్యాం

టి.కె.వి. అయ్యంగార్

(1947–2017) (N.I.T. వరంగల్లు)

గణితముతో నాధ్యాత్మిక
గుణసంపద పరిమళింప, గురుశేఖరుడై
ప్రణుతిగనిన అయ్యంగా
రిని, పండితకులతిలకు స్మరించి మురియుదున్

జి. రాధాకృష్ణమాచార్య

(1953) (నెల్లూరు, N.I.T. వరంగల్, తాడేపల్లి గూడెం)

గంగాఝరివలె గణిత ప్ర
సంగాలు, గణిత జనుల ప్రశంసలు, విద్యా
రంగము, వృత్తి నిబద్ధత
సంగీత ప్రియత్వము గల సజ్జనుడార్కే

నండూరి శ్రీనివాసాచార్యులు

(1947) (N.I.T.వరంగల్లు)

మృదుభాషి స్నేహితుండు స
హృదయుడు ద్రవగణితవేత్త శ్రీ ఆచార్యున్
ముదమున శిష్యాళిని సం
పదగా నెంచెడి గురువని పరిగణియింతున్

ఎస్.బి. రావు

(1943) (I.S.I కోల్‌కత్తా, సి.ఆర్. రావూస్ ఇన్స్టిట్యూట్, హైదరాబాద్)

గణితము సాంఖ్యక శాస్త్రము
లను సంపన్నమొనరించి చెలంగెడి మేధా
విని యస్బీరావును బో
ధనలోన ప్రతిభావంతుడు ధన్యుండందున్

బి.ఎల్.ఎస్. రావు

(1942) (I.S.I కోల్‌కత్తా, సి.ఆర్. రాహూస్ ఇన్స్టిట్యూట్, హైదరాబాద్)

గణితము సాంఖ్యకముల ప్రతి
భను కనబరచిన కుశలుని, పరిశోధనలో
గణనీయుడైన రావును
ప్రణుతింతురు గణితజనులు పండిత ప్రవరుల్

హుజూర్ బజార్

(1919-1991) (Kolhapur, Pune and Univ. of Denmar, US)

గణితము సాంఖ్యకముల వృ
ద్ధిని కాంక్షించి కృషి సలిపి దేశమునకు కీ
ర్తిని దెచ్చె పద్మభూషణు
డను బిరుదునుగొనె హుజూరుకభివందనముల్

మోహన శ్రీఖండె

(1945) (Mumbai, Indiana, Central Michigan Universities, US)

మోహన శ్రీఖండె గణిత
గాహముతో తండ్రి మార్గదర్శన మీద ను
త్సాహమున విజయ శిఖరా
రోహణ మొనరిచి ప్రతిభ నిరూపించు కొనెన్

యూక్లీడ్ (అలెగ్జాండ్రియా) (క్రీ.పూ. 325–265)

జ్యామితి పితగా ఖ్యాతిన్
భూమండల మందు పొంది పుణ్యపురుషుడౌ
శ్రీమంతుని **యూక్లీడు** సు
ధీమంతుని అతని గణిత దీప్తినిఁ దలతున్.

సత్యం శివం సుందరం

సత్యశివసుందరములను
ప్రత్యక్షమొనర్చి శాస్త్రప్రగతికి శక్తిన్
నిత్యమిడ గణితము వినా
గత్యంతరమేది కలదు గణగణఘంటా

గణితము నందు సత్యమది కాలము దేశము దాటు నిచ్చటన్
గనబడు సత్యమెచ్చటను క్రాలును సత్యముగానె ఇప్పుడు
న్న నిజమదెప్పుడున్ నిజమె – నవ్యత నాణ్యత కెట్టిహాని రా
దని గణితజ్ఞులందురు కదా! గణితమ్మున సత్యమిద్దియే

మానవజీవితాలు శివమార్గమునన్ కొనసాగనివ్వ వి
జ్ఞానము చేయు లీలలకు సత్త్వమునెప్పుడు మెండు గూర్చుచున్
పూని విశాల విశ్వమున భూరి రహస్యములెల్ల విప్ప ఈ
మానవజాతి మన్గడకు మంచియగున్ గణితమ్ము వల్లనే

డెందంబున్ గిలిగింత పెట్టి అటకాఠిన్యంబు పోకార్చి ఆ
నందంబున్ విరియింపనెల్లపుడు నూత్నత్వంబు కాంక్షించుచున్
హుందాగా ప్రకృతిన్ విశిష్ట పదమందొప్పారు చున్నట్టి ఆ
సౌందర్యంబునకాది సౌష్ఠవము విశ్వమ్మెల్ల నౌనౌ ననన్

గణితము నందలిసారము, వినియుక్తతలోన గలదు వివరింపంగా
ననివిజ్ఞులు వాక్రుచ్చిరి జనహితవినియుక్తతకు విజయము కలుగగా

డా॥ డి.ఆర్.కె. సంగమేశ్వరరావు

(1928–2008) ఆంధ్ర విశ్వకళా పరిషత్తు

గణితమునకు ప్రాణము లా
క్షణికత యను భావమునకు సత్త్వము చేకూ
ర్చిన **ప్రొఫెసర్ డీఆర్కే**
గణనీయుండాంధ్ర దేశ గణితజ్ఞులలో

గణితశాస్త్రమును సత్కవితవోలె పలుకు
మధురభావుకుడైన మాన్యుడతడు
సిద్ధాంత రచనలో శిల్పము వెలయించు శాస్త్ర
కోవిదుడైన చతురుడతడు

లాక్షణికత పట్ల లక్ష్యము సడలని
గణిత తాపసుడైన ఘనుడతండు
గ్రంథాలు వ్రాయుచో గణనీయ శేముషి
ప్రతిఫలింపగజేయు ప్రాజ్ఞుడతడు

ఆంధ్ర విశ్వకళాశాల యందు గణిత
దేశిక పదవులను మెట్టె దీప్తి గూర్ప
ఛాత్రీ శతములు మెచ్చిన శాస్త్రియతడు
సంగమేశ్వర రావు విజ్ఞానమూర్తి

విద్య దౌషధమని వెఅచు వారికి కాదు
పీయూషమని జూపి ప్రీతిగూర్చి
అబ్బో! అయః పిండమనెడి వారలకిది
కలకండ తినుడని కలబలుకుచు
సుళువుగా భావింప నలవికాని వినూత్న
విషయములను తేనె విందుజేసి
త్రికరణ శుద్ధిగా సకలవేళలయందు
ప్రాచార్య కార్యమ్ము పరిమళింప
శాస్త్ర బోధన జేసి ప్రశస్తి గాంచె

నాలుగు దశాబ్దముల మించు కాలమందు
గణిత జగమున జ్యోతియై ప్రణతిగొన్న
సంగమేశ్వర రావును సన్నుతింతు
జాతి రత్నమై వెలుగు విఖ్యాతుడతడు

ఖ్యాతి కెక్కిన ''తెలుగు అకాడమికి''
గణిత పుస్తకాలను వ్రాయు కాలమందు
సహచరుడనై గ్రహించితి శాస్త్రమందు
మెళకువల నెన్నో మీనుండి మేదురముగ

గణిత విద్వత్కవిగ నేడు గణుతి కెక్కి
మాన్యులైన ప్రాచార్యులై ధన్యులైన
వారు బహు కొద్ది వారిలో వన్నె కెక్కె
సంగమేశ్వర రావు–విజ్ఞానధనుడు.

ఆయురా రోగ్యభోగ భాగ్యములతోడ
బ్రతుకు తీయని స్వప్నమై పరిఢవిల్ల
వరలు గావుత సంగమేశ్వర మనిషి
వేంకటేశ్వరస్వామి దీవెనలు గురియ
ప్రవహించే సంగీతం

డా॥ లక్కోజు సంజీవరాయశర్మ

(1907–1998) (ప్రొద్దుటూరు, కడప)

పుట్టుకతో లేవు కనులు
దిట్ట గణిత ఖేలనమున తికమక పరచే
గట్టి సమస్యలనెన్నో
అట్టె ఎదుర్కొనెను **శర్మ** అతనిని దలతున్

''అంకవిద్యాసాగరాఖ్యతో నడయాడు
సంజీవరాయని సన్నుతింతు''
గణిత బ్రహ్మ ''యటంచు ప్రఖ్యాతికెక్కిన
సంజీవరాయని సన్నుతింతు''
విశ్వసంఖ్యాచార్య విఖ్యాత గణితజ్ఞు
సంజీవరాయని సన్నుతింతు

నుతిగొనుచున్న ''గణిత సార్వభౌముడు''
సంజీవరాయని సన్నుతింతు

మంచి ''లెక్కలతాతయ్య'' మాన్యుడతడు
గణితమున అవధానముల్ గ్రాలజేసి
కనులులేకున్న నేమి? అంకములతోడ
ఆడుకొను నాతడవలీల నద్భుతముగ
పూని ఆర్వేలగణితావధానములొన
రించె వినోదవిజ్ఞానముల్ రుచులనిన
భాగహారము గుణకము బహువిధముల
ఘాతకార్యముల్ యుక్తి లెక్కలు ప్రధాన
సంఖ్యల ప్రసక్తి+అంకెలచదరములును
వర్గఘనముల గణనల నర్గళముగ
చేసి పండితుల మెప్పించి మించు
క్రీస్తు శకమునగల తేదికి సరియైన

తిథియు నక్షత్ర వారాది దిన వివరము
చాంద్రమానమున తెలుపు చతురుడతడు
మనుజకంప్యూట రనబడి వినుతిగాంచి
న విదుషి శకుంతలాదేవి భవదనంత
ధీ విశిష్టతల నభినందించెనంట
ఎన్నని వచింతు లెక్కలేనన్ని గణిత
కళల నవధానవిద్యగా వెలువరించు
బ్రహ్మ–గణితాన సంజీవరాయశర్మ

కన్నులు లేని బిడ్డ పలుకష్టములన్ బడునమ్మ–కావునన్
మున్నుగ వడ్ల గింజలవి మూటిని బిడ్డగళానవేయుమా
తిన్నగ వీనిజన్మ కడతేరును గుండెను రాయిచేసుకో
యన్న హితాప్త సూక్తులకు నాయమ లొంగక జాగరూకతన్
నిన్ను క్షమించి పెంచినది నీ భవితవ్యము నూహ సేసెనో!

కలమున్ బట్టగ లేదు కాగితము ప్రక్కన్ లేదు సంఖ్యావళుల్
చెలగున్ నీ రసనాగ్రమందు భళిరా! శ్రీ కాళహస్తీశ్వరున్
జలువన్–శాస్త్రజగాన నిట్టి మహదాశ్చర్య క్రియాపుంజముల్
కలవంచున్ కవితావిపంచిపయి వక్కాణింతు నీ చాతురిన్

దేశోద్ధారక పంతులు
కాశీనాధుని కులమణి ఘనకీర్తి అనీ
బీశెంటు త్వదవధాన
ప్రాశస్త్యము చూచినారు పర్యుత్సుకతన్
జవహర్ లాల్ నెహురూమహాశయుడు
వైశ్రాయ్ జారిస్టాన్లీయు మా
నవకంప్యూటరుగా చెలంగు గణిత జానాబ్ధి శాకుంతలా
నవలారత్నము, దేశభక్తుడగు కొండా వెంకటప్పయ్య వా

సి విరాజిల్లిన మాన్యరాష్ట్రపతి రాజేంద్ర ప్రసాదాదులున్
స్తవనీయుండని నిన్ను మెచ్చిరిగదా
సంజీవరాయాహ్వయా!
వేంకటేశ్వరు పేరున వెలసియున్న
విశ్వవిద్యాలయమ్మున విజ్ఞులొసగి
నారు డాక్టరు బిరుదమ్ము గారవించి
నీదు గణిత పాండిత్యము నిరుపమంబు
జయము సంజీవరాయాఖ్య జయము! జయము! 3–3–93

ధూళిపాళ అర్కసోమయాజి

(1910–1986) (భీమవరం, తిరుపతి)

సిద్ధాంత శిరోమణికి వి
శుద్ధాంగ్లీకరణ మిచ్చి జ్యోతిషము న శా
స్త్రోద్దండులు మెచ్చగ ప్ర
సిద్ధిం బడసె సోమయాజి స్థితప్రజ్ఞుండై

శ్రీపద్మావతి

(1965) (Central Univ., Hyderabad)

శ్రీపద్మావతి ద్రవగతి
పై పరిశోధన మొనర్చి పలుఫలితమ్ముల్
స్థాపించెను గణిత వనిత
గా పేర్కొని కవితనల్లి గౌరవ మిత్తున్
గణిత నమూనాలు (మోడల్స్)

ఎల్లయ మంత్రి (భారత దేశం)
గణితమున కృతులు, వ్యాఖ్యలు
గణనీయముగా రచించి ఘనుడయ్యె తెనుం
గున నెల్లయ మంత్రివరుడు
ప్రణుతించగ వలయునతని పరిణత ధిషణన్

ఆచార్య నల్లాన్ చక్రవర్తుల పట్టాభిరామాచార్యులు - వరంగల్లు

చతురవచోనిధి వితరణశీలి యౌ
పట్టాబి రామాభ్యు ప్రణుతి సేతు
అధ్యాపక విధుల నంకిత భావాన
పాటించు నాచార్యా ప్రణుతి సేతు
తరగతి బోధన తపముగా తలచి వృ
త్తికొనసాగించె ప్రతిష్ట గాంచె
విద్యార్థుల హృదయ వీధుల నిండుగా
జ్ఞాన కాంతులిడి ప్రఖ్యాతి గాంచె
నేడు విరమణ పొందుచున్నాడు
విజయవంతమైన ఉద్యోగ జీవనము చేసి
ఇంతకంటె మించిన దేమికోరు
కొనును ఉపాధ్యాయుడీ జగతినెటనైన?

సుందరకాండను వందల సారులు
పారాయణము సేయుభక్తుడితడు

గోదామహాలక్ష్మి కూర్చిన కృతులను
నిష్టతో వల్లించు శిష్యుడితడు
శ్రీ వైష్ణవాచార శీల సంపద పెంచి
క్రమశిక్షణను మను ఘనుడితడు
గణితశాస్త్రమున అఖండ పాండిత్యంబు
సాధించి మించునా చార్యుడితడు
వృత్తి వివరణ చేసెడి వేళ హితులు
పండితులు సంస్థలకు నధిపతులు మంచి
స్నేహితులు ఛాత్రులు ప్రభృతుల్ చిత్తములర
నురిసి రభినందన కుసుమ గుచ్ఛములను

బోధన సుగణిత శాస్త్రా
రాధన నూతన విషయ పరామర్శయు సం
శోధనలే ఊపిరిగా
సాధించితివి ఘనీమశమ్ము సన్మిత్రమణీ!

ఆంధ్రదేశాన గణిత సమాఖ్య నొకటి
స్థాపన మొనర్చి పోషించి శాస్త్ర విధులు
ఛాత్రవరులును పాల్గొని చర్చ చేయు
వేదికగా దిద్దితీర్చిన విజ్ఞుడవని
సర్వులంగీక రింతు రాచార్యవర్య

రంగస్థల నటనలలో
నంగడు నిపుణుడ వని అభినందించుచు చె
ప్పంగ మదంపడు మది నీ
ప్రాంగణమున బుధులు యెదట రామాచార్యా!

చిన్ననాడు జ్యామితి మీద శ్రేష్ఠమైన
గ్రంథమొక్కటి మీచేత వ్రాయబడిన
ది చదివితిని శ్రద్ధగ నల్వదేండ్ల మాట
చెక్కు చెదరక నిల్చెనా స్మృతి పథాన

గణితాచార్య నభోతలాన ధ్రువనక్షత్రమ్ముగా వెల్గు ల
క్ష్మణ రావున్ గురుదేవుగా గొనిన మీ సంస్కార మర్యాదల్
ప్రణుతింతున్ గురుషష్ఠి పూర్తిని మహాపర్వమ్ముగా చేసి
సద్గుణవంతుండని పేరుగాంచితివి సంతోషంబు మిత్రోత్తమా

ఐహిక సమస్యల వలలో నంతరంగ
ము తగులు కొనినన్ జడియక వెతలతోడ
''పద్మపత్ర మింవాంభసా'' ప్రవచనమ్ము
ననుసరించి మనుట నేర్చిన విబుధుడవు
రమ్యగుణధామ! పట్టాభిరామా నామా!

శ్రీ తిరుమల స్వామి దయగురియ సతమ్ము
ఆయురారోగ్యభోగ భాగ్యముల తోడ
నడచి శ్రీ వైష్ణవర వధాన విడువకుండ
గణిత భారతి సేవలు గ్రాల వయ్య
మనుగడ పంతుళభరితమే చెలంగ. 31-10-93

Claudius Ptolemy (85 - 165) (Greece, Egypt)

భూకేంద్ర వీదపుష్టికి
శ్రీకారము చుట్టినట్టి శిష్టుడు కృతులన్
లోకోత్తరముగ కూర్చెను
వాకొనవలె **టాలమీ**ని వందనములతో

Archimedes of Syracuse (క్రీ.పూ. 287 – 212)

‘‘నా వృత్తాలను చెరపకు
ఆవిష్కరణలివి’’ యనెడి **ఆర్కిమిడీ**సున్
ఆవేదన గణియింపక
కావరమున జంపెనొకడు కర్కోటకుడై

ఆర్కిమిడీస్ విజ్ఞానిని
పేర్కొనగానే ‘‘యురేక’’ పిలుపు వినబడున్
కర్కశమౌ గణితమ్మును
శర్కర వలె మార్చెనతడు చతురత తోడన్

ఒక దుర్మార్గుని దుశ్చ
ర్యకు విజ్ఞానోన్నత శిఖరముధర కూలెన్
ఒక తృటి ఇది ఘోర విషా
ద కథ మహాదారుణము హృదయము ద్రవించున్

Nicolaus Copernicus (1473-1543)(Poland)

రవికేంద్ర విశ్వవాదము
ప్రవచించిన ధీయుతుడు **కొపర్నికసు**ను సం
స్తవనీయుడు యుగపురుషుడు
భువనైక ఖ్యాతుడనుచు పొగడుదురు బుధుల్

Zeno of Elea (క్రీ.పూ. 490 – 425) (Lucania, Italy)

గమన స్థితితో సంబం
ధము గల ‘‘పెరడాక్సులు’’(Paradoxes) గణిత జగతిలో క్లే
శము గల్గించెను **జీనో**
ప్రముఖుండయె తత్కతమున భాగ్యమతనిదే

Pythagoras of Samos (క్రీ.పూ.569 – 475)

జగమును శాసించును సం
ఖ్య గదా యన్న ప్రకటనకు కర్త గురువు పై
థ గొరసు – అతని భావుక
తగరిమ ఎంత నిజమయ్యె దండమతనికిన్

ధరణీ పాలన జేయుచు
కరము ప్రముఖముగ వరలెడి ఘనతను పొందెన్
స్థిరముగ సంఖ్యలు పైథా
గరసు ఉవాచ యిది మిన్నగ నిలిచెను గదా

సమకోణ త్రిభుజమునకు
రమణీయపు సూత్రమొకటి ప్రాచుర్య మొన
ర్చిమహిత కీర్తిని గనెను
త్తమ తత్త్వజ్ఞుండతడె పైథాగరసు సుమా

Leonardo Pisano Fibonacci (1170 - 1250) (Italy)

పలుప్రకృతి సన్నివేశ
మ్ములకు కలుపుసంఖ్యల సరమునకును నడుమన్
గల అద్భుత సంబంధము
తెలిపిన **పిసానా** ఘనత తెలిసి నుతింతున్

Leonardo da Vinci (1452-1519)(Italy)

బహుముఖముల ప్రజ్ఞ గలిగి
విహరించిన జ్ఞానధనుడు – విస్మయమగు నా
మహనీయుని సృజనీయత
మహిని నరుదతడే వినిసిని మనిన **లియోనార్డ్**

Omar Khayyam (1048 -1131) (Nishapur-Present Iran)

పంచాంగపు లెక్కల సవ
రించిన గణితజ్ఞుడు కవి యింకెన్నో సా
ధించిన ఘటికుడు **ఖయ్యా**
మ్నెంచి హృదయపూర్వకముగ నిత్తునివాళిన్

Pappus of Alexandria (290-350)

గణితాష్టాధ్యాయిని వ్రా
సిన మహనీయుని ప్రసిద్ధి జెందిన తత్త్వ
జ్ఞుని గ్రీకు గణితమాపో
శన బట్టిన **ప్యాపసు**ను ప్రశంసలముంతున్

Apollonius of Perga (262 BCE)(Greece, Egypt)

జ్యామితిలో శాంకవముల
స్వామిగ ఫలితముల పెక్కు సాధించెనహో
ధీమంతుం**డవలొనియస్**
సామర్థ్యము నెన్న తరమెశాస్త్రజ్ఞులకున్

Alkhwarizmi (790 - 870)(Baghdad, Iraq)

బీజగణితమ్మునకు పిత
గా జగతిన్ నుతిబడసిన గణకుడు "**ఆల్ క్వా**
రీజమి" బాగ్దాదు పురిన్
రాజిల్లిన శాస్త్ర విదుడరబ్బుల వరమై

హైందవ సంఖ్యాగణనము
నందించె, పలువిధములుగ ఆల్క్వారిజమీ
సుందర మిస్లాముగణిత
బృందావన వృద్ధికిన్ తపించె నిరతమున్

Hypatia of Alexandria (370 - 415)

ప్రముఖులు రాసిన కృతులకు
సమకూర్చెను తొలి గణిత విశారద హైపా
కమనీయమైన వ్యాఖ్యా
నములా మహిళామణి కభినందన శతముల్

హీపాషియ గణితమహిళ
పాపాత్ముల చేత జిక్కిప్రాణాల్ వదిలెన్
శాపమది గ్రీకు భవితకు
నేపథ్యము మతవిషయమనె చరిత్రమ్ముల్

Diophantus of Alexandria (200 - 284)

బీజగణిత పితరునిగా
పూజితుడై మన గణిత విభూతిని పెంచెన్
తేజస్వి **డయోఫాంటస్**
రాజిల్లునతని సమీకరణ మెప్పటికిన్

Eratosthenes of Cyrene (276 B.C.)

భూమి కొలత, సంఖ్యలలో
ప్రైముల జల్లెడను బట్టు పథకము నిచ్చెన్
ప్రేమించెను విజ్ఞానము
శ్రామికు**డెరటోస్తనీసు** చరితార్థుడహో

Plato (BC ca 428 - ca 348) (Greece)

జ్యామితి ఆత్మను సత్యపు
సామీప్యమున నిలబెట్టు శక్తిగలది ఈ
జ్యామితి నెరుగని వారల
కేమాత్రము స్వాగతమ్ము నీయడు **ప్లాటో**

Thales of Meletus (BCE. Ca 624 - 548)

మెలిటస్‌లో ''మొదటి శాస్త్రవేత్త విశ్వంబున'' శి
ష్యులు పైథాగరసాదులు
కలకాలమ్మతని కీర్తికాంతికి దివ్వెల్‌

పిరమిడ్ ఎత్తును కొలుచుట
కొరకై కనుగొంటివి సరికొత్త ఉపాయ
మ్మరసి జనులబ్రమున పరి
పరివిధముల పొగడిరయ్య ప్రజ్ఞానిధి **థేల్స్‌**

Hippasus of Metapontum (BCE – 5వ శతాబ్దం)

కరణీయ సంఖ్యనావి
ష్కరించినందులకసువులొసంగెను పైథా
గరసు గురుకులము నందున
చరితార్థు **హిపాససు**ను ప్రశంసించవలెన్‌

Tartaglia (Niccolo Fontana) (1500 – 1559) (Italy)

గణిత ఘన సమీకరణ
మ్మును సాధించుటను పద్యములతో వివరిం
చిన చతురుడు **టార్‌టాగ్లియ**
వినసొంపగు నతని చరిత వేడుక పొడమున్‌

Hippocrates of Chios (క్రీ.పూ. 470 – 410)

తొలుదొలుతగజ్యామితిపై
ఎలిమెంట్సనెడి కృతిని రచియించి **హిపో** వ
ర్తులమును చదరమొనర్పగ
తలచి ప్రశస్త కృషి చేసిధన్యతగాంచెన్‌

Menaechmus (Greece) (BC 380 -320)

కనుగొనెను శాంకవములను
ఘనుండని గణిత జనులు పొగడగా ప్లేటో
మునివరునకు స్నేహితుడై
మనిన **మెనాక్మసు** కిడుదు నమస్కారములన్

Ahmes (Egypt) (BC 1605)

అతిచారిత్రక యుగమున
ప్రతిభావంతుం **డహమెసు** పత్రము వ్రాసెన్
నుతికెక్కె రిండ్ పేపిరిసని (Rhind Papyrus)
ప్రతిగణితచరిత్రలోన ప్రస్తావితమై

Nicole Oresme (1320 - 1382) (France)

హార్మానిక్ శ్రేణి గణిత
ధర్మము నేనాడొ తెలిపె తార్కిక రీతిన్
నేర్మిని **నికోలురైస్మే**
కూర్మినుతించవలెనతని కుశలత ఘనతన్

Aristotle

(Greece)(384 - 322 BC)

క్రమము పరిమితియు సౌష్ఠవ
ము మహిని సౌందర్యమునకు మూలస్తంభా
లు మనోజ్ఞముగ గణిత శా
స్త్రమున వెలయు గుణములవ్వి శాస్త్రశ్రీలై

(The mathematical sciences particularly exhibit order, symmetry and limitation and these are the greatest forms of the beautiful - Aristotle)

Roger Bacon

(UK) (1214 - 1292)

జ్ఞానసముపార్జనమునకు
హాని కలుగును ''గణితమున అరయమి'' యనియెన్
జ్ఞానధనుడన్ని తెరగుల
మానిత గుణశీలుడు ధృతిమంతుడు **బేకన్**

(Ignorance of Mathematics works injury to knowledge)
- Bacon

Antori Zygmund Warsaw

(Poland), Chicago (US)(1900-1992)

గణిత విభాగము విశ్లే
షణలో నగణిత కృషి తలఛాత్రులకు సుశి
క్షణ, ప్రచురణములొనర్చి ధ
రణిని యశోవంతుడయ్యె ప్రాజ్ఞుడు **జిగ్మండ్**

లియొనార్డ్ ఆయిలర్

ఆర్కిమెడీసు న్యూటనులు నాపయి గౌసుమహాశయుల్ సదా
పేర్కొనదగ్గ ముప్వరు ప్రవీణులు, శాస్త్రములందు రాణిగా
పేర్కొనబడ్డ ఈ గణిత పృథ్వినటన్నది పూర్ణసత్యసం
పర్కము గాదు, కారణము? పండితుడాయిలరున్ తృతీయుగా
పేర్కొన లేదు గాన, నిక పెద్దలు నల్వురు లెక్కపెట్టగన్

మనుజులు శ్వాసించిన భం
గి, నింగిపై తేలియాడు గృధ్రములవలెన్
గణితఫలితములను సృజిం
చెననాయాసముగ సుప్రసిద్ధుండాయ్‌లర్

పదునెనిమిదో శతాబ్దికి ప్రౌఢగణిత
పండితోత్తముడతడు విభ్రాజమాన

గణిత చరితలోనతదగ్ర గణ్యుల నొక
డుగ పరిగణన కెక్కిన జగమెరిగిన
ఆయిలరును యుగపురుషుడని స్మరింతు

భువనమోహన సంగీత భూరికీర్తి
సకల మధుర రాగోజ్వల చారుమూర్తి
చతుర రసభర సురగాన చక్రవర్తి
ఆ మొజార్ట్‌కు గణితము నందు సముడు
ఆయిలరని ప్రాజ్ఞులనిరాహ్లాదమంది

గణితమున యుగకర్తగా ఖ్యాతిగలిగె
తత్సమమ్ముగా మానవతా పరిమళ
ము నలుదిశల ప్రసరింప మనిన ఖ్యాతి
కలిగిన పురుష వృషభుడా యిలరుగురుడు

ఘనులు బెర్నౌలి వంశమండనుల వలన
''స్విట్జరు'' ధరిత్రి కీర్తి భాసించి మించె
ఆయిలరువల్ల ఆ కీర్తి అంబరమ్ము
నంటెనందురు కాదిది అతిశయోక్తి

అతులితమ్మైన గణిత విద్యాసముద్రు
నకు మధుర రసనిలయమైన కమనీయ
సాహితీ నందనోద్యాన సాహచర్య
మున్న దవిరళముగ ''ఎనీడ'' న్న కావ్య
మంతయును కంఠపాఠము! ఎంత గొప్ప

ధారణ! మతవిషయములు తత్త్వశాస్త్ర

వైద్యవిజ్ఞాన పాండిత్య వైభవమ్ము
కరతలామలక మతని ఘనతకు పరి
మితులు లేవు; ఆయిలరు చరిత మహోద్భు
తమ్ము! తనువెల్ల పులకించు తలచినపుడు!

సర్ ఐజక్ న్యూటన్

(క్రీ.పూ. 1642–1727) (కేంబ్రిడ్జ్ – ఇంగ్లాడ్)

చీకటి నుండి వెలుగునకు
లోకము విజ్ఞాన పథములో పయనింపం
గా కృషి సల్పిన ఘన సు
శ్లోకుని **న్యూటన్** ప్రముఖుని స్తుతియింప వలెన్

John Willard Milnor (1931) (US)

గణితపు ''జెంటిల్ జైంట్'' గా
వినుతిన్గాంచితివి గణిత విద్వన్మణి! నీ
ఘనతకు బహుమతులు లభిం
చె ''నోబులు''ను గొంటివి నుతి సేతును నిన్ **జాన్**

Johann Carl Friendrich Gauss (1777-1855) (Germany)

చిరుప్రాయముననె గురువ
చ్చెరువందగ ధీవిభవము చిందులు ద్రొక్కెన్
పరమోత్కృష్ట గణిత జగ
తి రాకొమరుడవని కీరితిని గంటివిగాస్

''తక్కువె మరి పరి పక్వము''
చక్కని ఫలితములొసంగి శాసకుడయ్యెన్
లెక్కల రాజ్యములోనన్
చక్కురవర్తిగ వెలిగెను **జాహాన్ కార్లగాస్**

ఎన్నో వ్రాసితి నైనను
కొన్నియె పరిపక్వము లని గుర్తించితినా
కొన్నింటినె ప్రచురించితి
నన్నట్టి **ఫ్రెడరికు గౌసు** కభినందనముల్

Sir William Rowan Hamilton (Ireland)

హేమిల్టను, న్యూటను వలె
హేమాహేమి గణితమున, నితరవిధములన్
సామర్థ్యము గల చతురుడు
ధీమంతుడతని సతము నుతింపగ వలయున్

Tyco - Brahe (Denmark)

తొలినాళుల పరిశోధన
కళలో పారంగతుడయి గ్రహగతిమీదన్
తెలిపెను **టైకోబ్రాహే**
విలువైన విషయములన్ని విశ్వరహస్యాల్

George Neville Watson (1866 - 1965) (England)

బెసలు ప్రమేయాల గురిం
చి సమగ్ర మయిన కృతిని రచించిన **వాట్సన్**
లొసుగులు లేక వితేకరు
ని సాయమున వ్రాసె చక్కని ''అనాలిసిసున్''

Evgeny Michailovich Lifshiftz

(1915 - 1995) (Russia)

గణితము భౌతిక శాస్త్రము
లను మథియించుచు విలువగల కృతులను రచిం
చెను, విద్వన్మణి పరిశో
ధనలో తలపండినట్టి ధన్యుడు **లిఫ్షిట్జ్**

Gottfried Wilhelm Von Leibniz

(1646 - 1716) (Germany)

గణిత కలనము, ద్విసంఖ్యా
గణనము, తాత్త్వికతల మనుగడ భాసింపన్
ప్రణుతిన్ గాంచిన **లైబ్నిజ్**
ఘనతను కొనియాడు దేను కైమోడ్పులతో

Johannes Kepler

(1571-1630) (Germany)

గ్రహపథములను కనుగొనిన
మహాశయుడు **కెప్లరు** పరమస్తవ నీయుం
డు హృదయ కమలమున నిలిపి
సహృదయులు సెభాసనంగ స్మరియింపవలెన్

Neils Henrik Abel

(1802-1829) (Norway)

బ్రతికినది కొలది కాలమె
అతిముఖ్యమయిన ఫలితము లందగ గణిత
ప్రతిపత్తిని పై కెత్తిన
ప్రతిభామూర్తి ‘‘**ఏబెలు**’’ స్తుతిపాత్రుండు సదా

Bernoulli Family

(Switzerland, Russia, Germany)

Daniel Bernoulli (1700–1782)
Jacob Bernoulli (1654–1705)
Nicolaus II Bernoulli (1645–1726)
Nicolaus I Bernoulli (1687–1759)
Johann Bernoulli (1667–1748) Euler’s Mentor

Jacob II Bernoulli (1759–1789)
Johann II Bernoulli (1710–1790)
Johann III Bernoulli (1744–1807)

పలు తెరగుల **బెర్నౌలీ**
కులమండనులు గణితమునకు తరతరాల్గా
విలువైన భూషలిచ్చిరి
విలక్షణమిది చరితమున విననబ్బురమౌ

Georg Fridrich Bernhard Riemann

(1826-1866) (Germany)

ఒక గొప్ప హైపోథీసిస్
ప్రకటించి గణిత ధరిత్రి పండిత సమితిన్
తికమక పడజేసెను తా
నెకిమీడై గణిత రాజ్యమేలెను **రీమాన్**

ఎనిమిది పుటలా పత్ర
మ్మున రీమాన్ తెలిపెను ''ప్రయిముల'' జాడలు క
న్గాను ఉపకల్పన నద్దా
ని నిరూపణ లేదికను గణిత చరితములోన్

హేమాహేమీల్ ఢీకొని
ఏమియు సాధించలేక ఎత్తిరిచేతుల్
రీమాన్ హైపోథీసిస్
ఏమాత్రము కొరుకు పడక నేడ్చిరిగాదే

''రీమాన్ హైపోథీసిస్
ప్రైముల కథ గుట్టు బట్టబయలొనరించున్''
ధీమాన్యులైన గణిత
స్వాములకును తెలియదిద్ది సత్యమొ? కాదో?

జ్యామితి సంఖ్యావాదము
సామాన్య సమాకలనము శాఖలనెన్నో
శ్రీమంతం బొనరించిన
శ్రీమా స్రీమాన్ యశస్వి జేజేలివిగో

Ernst William Hobson (1856-1933) (England)

గణితమున వర్ధిలు విల
క్షణప్రమేయాల మీద చక్కని రీతిన్
గణనీయమైన సాహితి
జనింప **హాబ్సను** శ్రమించే జయమాతనికిన్

Paul Richard Halmos (1916-2006) (Hungary, US)

పరిమాణమునకు (Measure) గణితపు
పరమార్థమును వివరించి ప్రాజ్ఞులు మెచ్చన్
వరపుస్తకమున వ్రాసిన
గురువరు **హాల్మాస్** సుజనుని గోరి నుతింతున్

Tom M. Apostol (1923) (US)

గణితమున బోధనకు స్థా
యిని గల్పించెను గణితమహిమను దెలుపుచున్
మనుగడ సాగించెడి స
జ్జనుండ **పొస్టలు**ను మిగుల శ్లాఘింపవలెన్

Andrew Russell Forsyth (1858-1942) (England)

అవకలన సమీకరణాల్
వివరణకై సంపుటాలు వెలయించి ప్రమే
య విశారదుడై భారత
భువి దర్శించిన గణిత విబుధ మణి **ఫార్శిత్**

James Clerk Maxwell (1831-1879) (Scotland, England)

విద్యుత్ ప్రేరిత గమనము
నాద్యంతాధ్యయనమునకు ననువుగనుండన్
హృద్యసమీకరణములను
విద్యానిధి **మాక్సువెల్** నివేదన జేసెన్

Jan Luitzen Egbertus Brouwer

(1881-1966) (Netherlands)

''సహజజ్ఞానమె (Intuition) మూల
మ్మిహమున గణితప్రగతికి'' నీ యుద్యమమున్
సహృదయ సహకారముతో
బహు గొప్పగ నడపినారు **బ్రౌవరు** ప్రభృతుల్

నేతగ నిజధీ దీప్తికి (Intuitionism)
ఖ్యాతిని స్థిరబిందు ''తీరమం''(Theorem) దున పొందెన్
ప్రీతిని దలతును **బ్రౌవరు**
నాతని గణిత కృషికి వినయాంజలులిడుదున్

Charles Babbage (1791-1871) (England)

ఆదిని కంప్యూటరు నీ
మేదినికిన్ దింపినట్టి మేధావియు దీ
క్షాదక్షుడు యంత్రకళా
వేదియునగు ''**బేబజి**'' ఘనవిజయము దలతున్

Janos Bolyai (1802-1860) (Romania, Hungary)

ధిక్కారము యూక్లిడు పై
చక్కని జ్యామితుల జనువు సాధ్య మొనర్చెన్
పెక్కురిలో యువ**బోల్యా**
ఇక్కార్యము చక్కజేసె నెంచెదనతనిన్

''ఏమియును లేకనె ఒక అ
సామాన్యమయిన జగత్ సృజన సాధ్యమయెన్''
ప్రేమన్నాన్నకు వ్రాసిన
ధీమంతుని బోల్యను ప్రణుతింతుముదమునన్
Janos Bolyai to his Father (1823)
''Out of nothing I have created a new universe''

Andrew Wiles (1953) (UK, USA)

మూడున్నర శతవర్షా
లేడిచిరేడిచిరి గణిత హేమా హేమీల్
వీడెగద చిక్కుముడి నీ
దాడివలన జయము నీదు దరిజేరెను **వైల్స్**

Georg Keith Batchelor

(1920-2000) (Australia, England)

ద్రవగమన లీలలను తా
నవలీలగ వింగడించి ఆచార్యుండై
స్తవనీయ కృతులను రచిం
చి వాసిగనె **బేచ్‌లరు** తలచి మురియుదు నెదన్

Galileo Galilei (1564-1642) (Italy)

గణితమ్మును గతిశాస్త్ర
మ్మును వినియోగించి ప్రకృతి మోహన సత్యా
లను కనబరచిన మహనీ
యుని శాస్త్రజ్ఞుని **గలీలెయో**ను స్తుతింతున్

Gotthold Eisenstein

(1823-1852) (Germany)

గౌను ప్రశంసించిన మే
ధా సంపన్నుడు గణితవిధాతగ వెలిగెన్
ఐన్‌స్టీన్ మహనీయుడు
శాసించెను గణిత కళను సమకాలమునన్

John Forbes Nash Jr. (1928-2015) (US)

గణిత సరస్వతి పూని క
రుణించగ గ్రహించె నొక నిరుపమాన జ్ఞా
ననిధి నొబెల్ బహుమతిని ని
పుణుండు జాన్‌నాష్ జగతి నపూర్వము చూడన్

Arthur Cayley (1821 - 1895) (England)

మాత్రికల బీజగణితము
సూత్రించెను యెదవుబడిని జూపెను ధీవై
చిత్రికి నెలవై నిలిచెను
స్తోత్రమునకు పాత్రుడతడు సుజనుడు **కేలే**

Eric Temple Bell (1883-1960) (Scotland, US)

గణితజ్ఞుల జీవితకథ
లను వారి గణితములను కలగలిపిన విల
క్షణమైన పుస్తకము **బెల్**
ప్రణీతము లభించె మనదు భాగ్యము పండెన్

Walter William Rouse Ball (1850-1925) (England)

గణితవినోదము నిచ్చెడి
జనరంజకమైన కృతిని చతురుడయి రచిం
చిన క్రీడా గణిత జ్యో
తిని **రౌస్‌బాలు**ను తలంచి తృప్తుడనగుదున్

George Dantzig (1914-2005) (US)

సమరాది వ్యూహములన్
సమర్థతను పెంచుట కని శాస్త్రీయతతో
ప్రముఖ గణితశాఖ ఒ.ఆర్. (OR)
అమరిచె **డాన్జిగ్** నుతింతునాతని ఘనతన్

Tobias Dantzig (1884-1956) (US)

గలిలియొ పలుకుల టీకగ
వెలయించెను సంఖ్య మీద విలువైన కృతిన్
తొలుతగ **టొబియస్ డాంట్జిగ్**
తలంతునతని అతని గణితఘనచరిత్రన్

Ludwig Prandtl (1875-1953) (Germany)

ద్రవగత్యధ్యయనమున క
నువుగ సమీకరణ గుణమును సుకర మొనరిం
చి వినుతి గొనె **ప్రాండిల్** గణి
తవిశారదు డింజనీరు తలచెద నతనిన్

బౌండరీ లేయర్ థియరీ
ఫౌండరుగా వాయుగతికి ఫాదరుగానూ
దండిగ విద్యార్థుల ను
ద్దండులుగా తీర్చిదిద్దె దక్షుడు **ప్రాన్డిల్**

Sir Michael James Lighthill
(1924-1998) (France, England)

రక్తగతి సూత్రముల నా
సక్తికరముగ తెలిపిన అసామాన్యుడు ధీ
శక్తి యుతుండాచార్యుడు
వక్త అతడె **లైట్ హిలు** అభివందనమిడుదున్

Rene Des Cartes (1596-1650) (France)

‘‘నేనాలోచిస్తున్నా
గాన వ్యవస్థితుడన’’ నియె గణితజ్ఞుండౌ
రేనెడికార్టే తత్త్వ
జ్ఞాన సముద్రుడు నయిన యశస్వికి జేజేల్

‘‘ఆలోచిస్తాను గనుక
నాలో జీవుడు కలడ’’ని నమ్మినమేధా
లీలానిపుణుడు ప్రతిభా
శాలి రెనెడికార్ట్ యశోవిశాలుండు గదా!
‘‘Cogito ergo sum’’ I think therefore I am.

జ్యామితి బీజగణితముల
ప్రేమ వివాహ మొనరించె రేనేడీకా
ర్టే మహనీయుడు తత్త్వ
స్వామి, గణితమున విరించి సైనికుడు సుమా!

పరిపూర్ణ పుణ్యపురుషులు
పరిణతి బొందిన సుజనులు పరికింపంగా
అరుదుగ నుందురటులనే
‘‘పరిపూర్ణపు సంఖ్యల’’రుదు (Perfect Numbers) పరిశీలింపన్

S.S. Pillai (1901-1950) (Tamil Nadu, Kerala)

‘‘వారింగ్’’ సమస్యకు మిగుల
నేరుపుతో ఋజువునిచ్చి నిపుణుండయ్యెన్
ఘోర విమాన ప్రమాదము
బారిన పడి వీడెభువి నభాగ్యుడు **పిళ్ళై**

Louis Nirenberg (1925) (Canada, America)

సహగణిత వేత్తల గలసి
విహరించెను గణితగగన వీధులలో చెర్న్ (Chern)
బహుమతి మొదట గ్రహించిన
మహామహుడు **నిరెనుబర్గ్** నమస్కృతులిడెదన్

Stephen Hawking (1942) (England)

అష్టావక్రుని బోలిన
కష్టమయిన మనుగడ బహు కఠినవిషయముల్
స్పష్టమగునట తనధిషణ
కుష్టీఫెనతని తాపమెంత గొప్పది చూడన్!

Albert Einstein (1879-1955) (Germany. US)

శివశక్తుల మార్పిడులను
భువనస్తవముగ వచించి పుణ్యపురుషుడై
న విబుధుడు ఘనుడు **ఐన్‌స్టైన్**
అవిరళముగ స్తుతుల నింపు దాతని చరితన్

జ్ఞానము కన్నను ప్రముఖ
మైనవి భావమ్ము లూహలని నుడివిన ఐన్
స్టైనును యుగపురుషుని వి
జ్ఞాన ఖనిని తలచినపుడు స్వాంతము పొంగున్

మతమును వలదను శాస్త్రము
క్షితిలో నవిటి దగు శాస్త్రసీత్కృతి చేసే
మతమది గుడ్డిదగుననేను
మతిమంతుడయిన్ స్టైయన్ నమస్సులతనికిన్

Rolf Hermann Nevanlinna (1895-1980) (Finland)

గణితపు విశ్లేషణలో
గణనీయ కృషి యొనరిచిన ఘనుడ వటంచున్
ప్రణుతింపవలెను నిను **హె**
ర్మను నేవన్ లిన్న! గణిత రత్నమవన్నా

Blaise Pascal (1623-1662) (France)

సంభవతా వాదమ్మును
పుంభావసరస్వతి యగు పూజ్యుడు **పాస్కల్**
శుంభద్గణితముగా నా
రంభించె నతని ధిషణకు ప్రణుతులొనర్తున్

గణితము భౌతిక శాస్త్రము
గణాంకమున సంభవతయు గణనకు యంత్రాల్
ప్రణుతింగనె **పాస్కలు** కత
మున తీరని బాధ తనను మోసెను చితికిన్

Arthur Erdelyi (1908-1977) (Hungary, UK)

తాపసి బేట్మేన్ కర్జపు (Project)
సాఫల్యమునకు శ్రమించి సంతుష్టుండై
దీపస్తంభమ్మయిన మ
హా పండితు**డెర్డెలి** హృదయాంజలినిత్తున్

Abraham De Moivre (1667-1754) (Paris, London)

పొందుగత్రికోణ మితిలో
సుందరమగు సూత్రమొకటి చొప్పించి జగ
ద్వందితుడయ్యెడు **మాప్రే**
వందన శతములివిగో నివాళులు లివిగో

Harry Bateman (1882-1946) (US)

గణిత ప్రమేయపు విల

క్షణ సర్వస్వమయి వెలయగా కృతిగూర్చెన్

ఋణపడెను గణితలోక మ

తని సేవలకతడె గణిత తాపసి **బేట్‌మేన్**

Joseph Louis Lagrange (1736 - 1813) (France)

పలువిధ సూత్రసముచ్చయ

ములను వెలువరించిన ఘనముఖుడయె **లెగ్రాంజ్**

విలువైన ప్రౌఢగణితము

కళకళలాడె తన వలన కైమోడ్పులివే.

Pierre de Fermat

(1601 - 1665) (France)

మూడున్నర వందేళ్ళుగ

పీడించే గణిత జగతిని ఫెర్మారాతల్

పీడల జాడల గణిత

ప్రౌఢిమ వికసించే నతని పాండితికి నుతుల్

Jean Le Rond D’Alembert

(1717-1783) (France)

గతి విశ్లేషణ మొదలగు

నతికీలకమైనవి గణితాంశము లొసగెన్

చతురుడు **డీ అలంబర్ట్**

అతని యశము శాశ్వతముగ నవనిన్ నిలుచున్

Edmund Georg Hermann Landau

(1897-1938) (Germany)

లాండో సంఖ్యావాదపు
పాండిత్యము నెన్నదరమె? ప్రజ్ఞానిధులౌ
పండితులు నుతించిన మా
ర్తాండుడు గణిత గగనమున దలచెదనతనిన్

Brook Taylor

(1685-1731) (England)

శ్రేణులుగ ప్రమేయాలను
రాణింపన్ జేసి వాటి ప్రాముఖ్యము వి
న్నాణమును గణిత శాస్త్ర ది
వాణమున నిలిపె నదృష్టవంతుడు **టేలర్**

Jean Alexandre Eugene Dieudonne

(1906-1992) (France)

బీజీయ జ్యామితి, టొపా
లజియు, విశ్లేషణ మొదలగు శాఖలలో
రాజిల్లిన దిట్టబూర్ బా
కీజీవమరూపతకు వకీలు **డియోడిన్**

John Von Neumann

(1903-1957) (Hungary, US)

ఒకటా రెండా చూడగ
సకల కళావల్లభుండు సరసుడు పరిశో
ధక పరమేష్ఠి స్తుతింతును
ప్రకటిత గురుభక్తి **జాను వాన్ న్యూమను**

Guiseppa Peano (1858-1932) (Italy)

స్వీకృత బలమున సంఖ్యల
రాకకు తార్కికత గూర్చి ప్రకటించిన
మే కుశలత నిండిన **పీ**
నోకృషి గణిత జగతిని వినుతినార్జించెన్

Julius Wilhelm Richard Dedekind

(1831 - 1916) (Germany)

కరణీయ సంఖ్య విల్ హెమ్
తరమున ''ఐడియలు'' ను గణిత కృతుల్ పత్రాల్
మురిపించెడి వాగ్విభవము
స్ఫురించు **డెడికిండ్** మన తలపున భాసింపన్

George Andrews (1938), **Bruce Berndt** (1939) (US)

రామానుజ నిజగణిత
ప్రాముఖ్యము మరొక సారి ప్రకటించిరిగా
ధీమంతులు **బ్రూస్ ఆండ్రూస్**
ఆమోద మెలర్ప వారి కభినందనముల్

Pierre Simon Laplace (1749-1827) (France)

ప్రకృతి ఒక నిర్ణయ మయిన
ప్రకారము ప్రవర్ధిలు నని ప్రవచించెను పా
క్షిక అవకలన సమీకర
ణకేళిని విజయుడు గణితనాథుడు **లాప్లేస్**

Sergei Sobolov (1908-1989) (Russia)

సార్వత్రిక ప్రమేయపు
పర్వము సృజియించి గణితభాగ్యము పండన్
సర్వామోద కరమ్ముగ
పేర్వడసిన **సోబోలౌ**ను ప్రీతిగ దలతున్

Georg Ferdinand Ludwig Philipp Cantor

(1845-1918) (Russia, Germany)

మితిమీరిన వరసంఖ్యల
స్థితిగతులను నిర్వచించి స్థిరతను చేకూ
ర్చి తరించే **కాన్టర**తని ఘ
నతను నుతించెను గణిత జనసమూహమ్ముల్

గణితమున అనంతమ్మును
గణించిన మహామనీషి కాన్టర్; సంఖ్యా
గణనమున నూతనస్థా
యిని స్థాపించె నతని స్తుతియింపంగ తగున్

అంతస్తులనేర్పరచి అ
నంతమ్ముల నధివసింపనాజ్ఞాపించెన్
వింతగ జూచిరి కొందరు
సొంతము **కాన్టరు**దేజయము సాహస్ అతడే

''మనకై కాన్టర్ నిర్మిం
చిన స్వర్గమ్మిదియ సాహసించరు తరుమన్
మనలనెవరునిక'' హిల్‌బర్ట్
అనెను భరోసా నిడునుడులవి **జార్జ్ కాన్టర్**!

Vito Volterra (1860-1940) (Italy)

అరయ సమాకలన సమీ
కరణములు ప్రమేయ జనిత కలనము నందున్
పరిశోధనగావించిన
చరితార్థుడు **వోల్‌టెరా** ప్రశంసింపవలెన్

Leopold Kronecker (1823-1891) (Germany, Poland)

''దేవుండొసంగెనంకెల
నావల మానవుని వలన నన్నియు జరిగెన్''
ఈ వాక్యము **క్రానెకరుది**
భావుకుడు గణితమున స్తుతిపాత్రుండు గదా

Ivan Matveyevich Vinogradov (1891-1983) (Russia)

మోదమునిచ్చెడి సంఖ్యా
వాదములో ప్రతిభ జూపి వర్ధిల్లెను, సం
పాదించే యశమ్ము **వినో**
గ్రాదావు జగద్విదితుడు గణితార్ణవుడై

Johann Peter Gustav Lejeune Dirichlet
(1805-1859) (France, Germany)

శ్రేణులు సంఖ్యావాదము
ప్రాణముగా శాస్త్ర కృషి విభాసిల జగతిన్
రాణించెను **డీరిచ్లెట్**
కాణాచి గణితమునకని గౌరవమందెన్

శ్రేణులలో కనుగొనియెను
గూఢమయిన ప్రైముల అడుగుల గూ
స్టావ్‌డిష్లే గణిత
ప్రౌఢిమకై కృషి సలిపిన పండితుడు గదా!

Marin Mersenne (1588-1648) (France)

గణితాభిమాని **మెర్సెన్**
గణితజ్ఞుల నెయ్యమంది ఘనుడై పరిశో
ధనమున ప్రధాన సంఖ్యా
గణములు తనపేర వెలయ కనుగొనెను గదా

Jules Henri Poincare (1854-1917) (France)

గ్రహగమనము టోపాలజి
సహా వివిధ విషయములను సంశోధించెన్
సహజధిషణా విభవముల
సహకారము పాయిన్‌కేర్‌కు సమకూరంగన్

తుదియూనివర్సలిస్టని
త్వదీయ గణిత ప్రతిభను వర్ణించెను శా
స్త్ర ధరిత్రి పాయిన్ కేర్!
అదృష్టమే నీజననము ఖ్యాత చరిత్రా

Grigori Yakovlevich Perelman (1966) (Russia)

తుదిమొదలు లేని విశ్వ
మ్మిది జూల్స్ పాస్కారె దీని నెరుగుట కొరకై
వదలెను ''కంజెక్చర్'' కటి
అది ఋజువయె గ్రెగొరివరలుమన్ కృషివలనన్

గణితమున దేవదూతగ
ప్రణుతించిరి బాల్యసఖులు **పెరలుమను**న్ పల్
గణిత ఘనపురస్కృతులను
తృణీకరించిన కథతనది కదా జగతిన్

Ferdinand Georg Frobenius (1849-1917) (Germany)

అవకలన సమీకరణము
లు వలచు సాధనల శ్రేణులుగ రూపొందిం
చు విధము తెలిపిన **ఫ్రొబినియ**
సు విలక్షణ ధీనిధియని స్తుతియించవలెన్

Henri Leon Lebesgue (1875-1941) (France)

వన్నెలిడి సమాకలనకు
నున్నతి కల్పించి నట్టి ఒజ్జ, గణిత సం
పన్నుండు ''కొలతల''కు న
భ్యున్నతి గూర్చిన **లెబేస్గు** ఉత్కృష్టుడిన్

John Venn (1834-1923) (England)

సమితుల అధ్యయన సులభ
మొనర్చుట కొరకు **వెన్**ఉపాయము జూపెన్
సమితుల ప్రక్రియ తెలుప ప
టములు వెలయు నతని పేరిట అదృష్టమహో

Nikolai Ivanovich Lobachevsky (1792-1856) (Russia)

జ్యామితిని విస్తరింపగ
ధీమంతులు చేసిన కృషి దిగ్విజయమయెన్
శ్రీమాన్లొబాచ విస్కీ
గ్రామణిగా వెల్గునిచట కైమోడ్పులివే

శకుంతలా దేవి (1929–2013) (బెంగుళూరు)

మానవ కంప్యూటరుగా
రాణించు **శకుంతల**ను కరము ముదమున స
న్మానించెను భారత మ
మ్మానినికి గణితమొసంగె మహిత యశశ్రీల్

Simeon Denis Poisson (1781-1840) (France)

వినియుక్త గణిత జగతిని
వినుతిగొను ఫలితములకు ప్రవేశము గల్పిం
చిన ధీమాన్యుడు **పాయిసోన్**
ఘనతను ప్రతి గణితవేత్త గానము చేయున్

Oliver Heaviside (1850-1925)(UK)

వినియుక్త గణిత పద్ధతు
లను పరిపుష్టమొనరించి లాఘవమును కూ
ర్చెను **హేవిసైడు**, అతని క
లన శాస్త్ర ప్రక్రియలు చెలగు నెల్లెడలన్

Edward Thomas Copson

(1901-1980) (England, Scotland)

గణితాధ్యాపక సమితిన్
మణియై స్తవనీయకృతుల మనకందించెన్
గణిత వికాసమునకు సం
స్థనొకటి స్థాపించి పెంచే **థామస్‌కాప్సన్**

David Hilbert (Germany) (1862-1943)

ఉభయగణిత గగనతల
ప్రభాకరుడు జగమెరిగిన ప్రాజ్ఞుడు **హిల్‌బర్ట్**
శుభకరమాతని మేధా
విభవము నిత్యనవము వినవేడుక గలుగున్

తెలుసుకొనవలెను తప్పక
తెలుసుకొనెదమని గణిత గతికి నూతనమౌ
మలునేర్పరచిన హిల్‌బర్ట్
కలియుగ గణితమున బ్రహ్మగా భావింతున్

Wir mussen Wissen, Wir Werden Wissen- we must know, we will know

Erik Ivar Fredholm (Sweden) (1866-1927)

విసుగన్న దెరుంగడు ఒక
దెసగణితము మరొకదెసను దేశోద్యోగా
లు సమాకలన సమీకర
ణ సాధనాసక్తి గలిగిన బుధుడు **ఫ్రెడ్‌హోమ్**

John Napier (Scotland) (1550 - 1617)

గణనము సులభమొనర్పగ
మనుజుడు చేయు కృషిలో సమర్థమ్మెంతో
గణనీయమైనదీ లఘు
గణకము **నేపియ రొ**సగె జగము హర్షించెన్

Jacques Saloman Hadamard (1865-1963) (France)

ఒక దత్తసంఖ్యకు దిగువ
ను కల ప్రధానముల సంఖ్యను తెలిపే **హడమార్ట్**
ప్రకటించె మరెన్నో గణి
త కర్మల లభించిన ఫలితము లిబ్బడిగా

Sofia Kovalevskaya

(1850-1891) (Russia, Germany, Switzerland)

అవకలన సమీకరణము
లవలీలగ నాడుకొనియె నామె మెదడునన్
కొవలస్కీ విదుషీమణి
భువన ఖ్యాతిని **గడించే** పున్నెము పండన్

Emmy Amalie Noether

(1882-1935) (Germany, US)

నూతన గణిత జగత్తున
ప్రాతః స్మరణీయురాలు ప్రౌఢగణితమున్
చేతో మోదమ్ముగ **నో**
యీతరు సృజియించెను భజియించెదనామెన్

Marie Sophia Germain (1776-1831) (France)

మేరీ సోఫీ జర్మేన్
పేరున్న గణితజనాళి ప్రేరణ తోడన్
సారమతిన్ గణితమ్మున
కీరితి నార్జించి మించె కైమోద్పులివే

Ruth Moufang (1905-1977) (Germany)

విక్షేప జ్యామితిని స
లక్షణముగ నభ్యసించే లాఘవమొప్పన్
దీక్షన్ **మూఫాంగ్** జ్యామితి
లక్షణముల జెప్పె గొప్పలలనా మణియై

George Polya (1887-1985) (Hungary, England, US)

నవగణిత విభాగమ్ముల
నవిరళ కృషి చేయ హితులు హార్డీ ప్రభృతుల్
భవదీయశేముషిని మె
చ్చ వాసిగాంచితివి నీవు **జార్జిపోల్యా**

Benoit Mandelbrot (1924-2010) (Poland, US)

నిజమైన జ్యామితిని వి
జ్ఞై జగతికి తెలిపిన ధీ విశారదుడు మహా
విజయము సాధించిన ధ
న్యజీవి **మెండల్‌బ్రటు** వినయమున తలంతున్

Horace Lamb (1849-1934) (England)

ద్రవగతి శాస్త్రమ్మున కతి
స్తవనీయ కృతి నెపుడో ప్రసాదించిన శా
స్త్ర విదుడు లాంబ్ ఇప్పటికిన్
నవకృతిగానే వరలు గుణము కలిగినదై

Bertrand Arthur William Russell
(1872-1970) (England)

గణితమునకు నిర్వచన
మ్మునొసగి తార్కిక గుణమె ప్రముఖ మీ శాస్త్ర
మ్మున యనుచు నుద్యమించిన
ఘనకీర్తి **రసెల్** మనీషి – గౌరవమిత్తున్

గణితజ్ఞుండని తాత్త్వికు
డని సాహిత్యము మథించినట్టి ప్రవీణుం
డని శాంతిగోరు వీరుం
డని గొని యాడుదుము నిన్ను అంజలి గొనుమా

Alfred North Whitehead (1861-1947) (England, US)

గణితమున మేల్మి పరిశో
ధన పరిశీలనలు మించి తత్త్వజ్ఞుండై
ప్రణుతిన్ గాంచిన **వైట్ హెడ్**
గణితాచార్యుని దలంతు కైమోడ్పులతో

Godfrey Harold Hardy (1877-1947) (England)

భారత గణిత జ్యోతికి
ప్రేరణ గల్పించి పెంచి పెద్దగజేసిన
కారణ జన్ముడు **హార్డీ**
గౌరవ పాత్రుడు సతతము గణిత ధరిత్రిన్

గణితమునకు నాణ్యత నే
ర్పిన ఆచార్యుండు గణిత బృందంబెల్లన్
వణకిరతని ముందర లా
క్షణికత విషయము గురించి చతురుడు **హార్డీ**
ప్రీతిన్ రామానుజు వి
ఖ్యాతికి నెంతో శ్రమించె **హార్డీ జీ. హెచ్**
పూతమనస్కుడు ధీనిధి
ప్రాతఃస్మరణీయుడతడు భరతావనికిన్

Andrey Nikolaevich Kolmogorov

(1903-1987) (Russia)

నవసంభవతా సిద్ధాం
తవికాసమ్మున కతండు తండ్రియగును, సం
భవతను స్వీకృతములతో
హవణించిన **కొలమొగొరవు** కంజలినిత్తున్

Kazimierz Kuratowski

(1896-1980) (Poland)

ఆదర్శోపాధ్యాయుడు
మేదురముగ నవగణితపు మేరలు పెంచెన్
ఆదరణీయ కొ**రటవిసి**
కీదక్షత కచ్చెరు వగు కీర్తింతు మదిన్

Stanisław Marim Ulam

(1909-1984) (Poland, US)

గణితమ్మున సాహసమగు
పనులను జేసిన కుశలుడు బాంబును కూడా
కనుగొన్న నేర్పరి **ఉలా**
మును తలచినపుడు తనువున పులకలు పుట్టున్

Ludwig Josef Johann Wittgenstein

(1889-1951) (Austria, UK)

గణితపు పునాదులను శో
ధన జేసిన గడసరిగను తాత్త్విక పరిశీ
లనలో ధీసంపన్నుడు
గ నలరె **విట్‌గెన్స్టయిను** ప్రకటిత ప్రతిభన్

Andre Weil (1906-1998) (France, US)

బీజీయ జ్యామితిపై
రాజిల్లగ కృషి సలిపిన గ్రామణి మేధా
తేజస్వి **ఆంద్రీవైల్** తొలి
రోజుల'' బూర్బాకి కులగురువుగా నిలిచెన్

Joseph Fourier (1768-1830) (France)

వాస్తవ మాధ్యపు టుష్ణ
ప్రస్తారమ్మును గురించి పరిశోధనలన్
విస్మృతిగ జేసి తరగతి
పుస్తకముల కెక్కినాడు **ఫొరియర్** గురువై

Edmund Taylor Whittaker

(1873-1956) (England, Scotland)

గణితమ్మున విశ్లేషణ
మును లాక్షణిక మొనరించి ముఖ్యాంశము బో
ధనకని పాఠ్యములో జే
ర్చెను **వితెకర** గురువరుండు శిష్యులు మెచ్చన్

Hermann Klaus Hugo Weyl (1885-1955)

(Germany, Switzerland)

జ్యామితిలో విశ్లేషణ
ఆ మీదట టోపలాజి, అన్నియు జేరన్
ప్రాముఖ్య మందిన గణిత
సామగ్రిజనించినది **హ్యూగో వైల్** వలనన్

Norbert Weiner (1894-1964) (US, Sweden)

సైబర్నాటిక్స్ శాఖను
రాబట్టి గణిత పరిధికి రంజిలె **వీనర్**
బాబు మురిసిరి గణిత సా
హేబులు బహువిద్యల కలయిక యిది యనుచున్

Augustus De Morgan (1806-1871) (India, England)

పుట్టెను మధురైలో కని
పెట్టెను సమితి క్రియలకు పేరిమి న్యాయాల్
పుట్టెడు కష్టాలున్నను
తట్టుకొని **డిమోర్గను** గణితకృషి యొనర్చెన్

Girard Desargues (1591-1661) (France)

గ్రీకేతరమొనరిచి ప్ర
త్యేకముగా జ్యామితికి ప్రతిష్టన్ నవతన్
చేకూర్చినట్టి **డేసార్గస్!**
నీకును నీ స్నేహితులకు నిండుగ దండాల్

Rene Thom (1923-2002) (France)

గతిచర్య టొపాలజి జ్యా
మితి కలనములు కలుప కుసుమించెను త్వరగా
నుతి కెక్కె ''కెటాస్ట్రఫి'' ''**రే**
నెథామ'' నవసృష్టిగ నతనికి వందనముల్

Lotfi A. Zadeh 1921-2017) (US)

జీవితమున అస్పష్టత
కావలసిన లక్షణమని గణితీయముగా
భావించె **జాడె** – ''ఫజ్జీ''
ఆవిర్భవము జరిగె గణితావనిలోనన్

George Boole (1815-1864) (England, Ireland)

భావములకు న్యాయములను
భావించి రచించినట్టి ప్రథముడితండే
ప్రావీణ్యమతని దెంతో
భావింపగ నబ్బురమగు ప్రతిభా నిధి **బూల్**

Edwend John Routh (1831-1907) (Canada, England)

స్తుతమతియై పలుచక్కని
గతిశాస్త్రగ్రంథములను కానుకగ నొసం
గి తరించినట్టి ఆచా
ర్యతల్లజుడు "**రౌతు**" నెంతు నానందముతోన్

Stephan Banach (1892-1945) (Hungary, Poland)

అభినవగణిత సరస్వతి
నభివృద్ధి పథాన నిలిపి హర్షించిన మే
టి **బనాకు** నాతని గణిత
విభూతిని స్మరింప మదిని వేడుక పుట్టున్

Edouard Jean Bapliste Goursat (1858 - 1936) (France)

గణితపు విశ్లేషణమున
వినుతింగాంచిన ప్రసిద్ధ విద్వాంసునిగా
గణితజ్ఞులు గుర్తించిన
గుణనిధి **గూర్సాట్** నుతింతు గురువరుడంచున్

Kurt Godel (1906 - 1978) (Australia, Hungary)

స్వీకృతబల సంపదతో
ఆకృతికి సమగ్రత గణితావని లోనన్
చేకూరదనెను, **గోడెల్**
వాకొన లేక హడల్ బుధవర్గములెల్లన్

George Gabriel Stokes (1819 - 1903) (Ireland, England)

ద్రవగతికి సమీకరణాల్
వివరించెలా పలు వినియుత విషయములను చా
ల విశదముగ పరిశోధిం
చి వినుతి కెక్కిన మనీషి **శ్రీజార్జీస్టోక్స్**

Ernt Friedrich Ferdinand Zermelo

(1871 - 1953) (Germany)

సమితుల వాదములోనన్
రమణీయమగు ఫలితముల రాబట్టిన ది
ట్ట మహా గణిత ధనుండు **జ**
రిమిలో అతనిని మనసా స్మరించి తనియుదున్

George Green (1793 - 1841) (England)

తనపేర నొక ప్రమేయము
నొనరగ నేర్పరచినట్టి ఒజ్జగ నిలిచెన్
గణితమున పాక్షికావ క
లనపు సమీకరణముల కెలంకున **జార్జ్‌గ్రీన్**

Friedrich Wilhelm Bessel

(1794 - 1846) (Germany, Russia)

గ్రహగమనాధ్యయన కృషియు
ప్రహర్షమొదవెడి ప్రమేయవిల్‌హెల్మ్ ని
ర్వహణము విద్యాబోధన
మహనీయత బెసలుకొనరె మనుగడ పండన్

Carl Gustav Jacob Jacobi (1804 - 1851) (Germany)

గణితమున పలుతెఱంగులు
ఘనుండెలిప్‌టిక్ ప్రమేయ కాంతుడగు **జకో**
బి ని చూడము నడిప్రాయము
ననె మృత్యువు గొనెనతని ననయము తలంతున్

Ernt Edward Kummer (1810 - 1893) (Germany)

ఆదర్శోపాధ్యాయుడు
ఔదార్యగుణుండు కరుణ కాకరమై ప్రే
మాదృతుల బ్రోచు శిష్యుల
స్వాదుహృదయుడు **కుమర్**కు నివాళుల నిత్తున్

Adrien Marie Legendre (1752 - 1833) (France)

తనపేరు చిరస్థాయిగ
కొనసాగన్ ప్రక్రియలను గూర్చె **లెజాండ్రె**
గణితమ్మున్నంతదనుక
కొనియాడుదు రతనికీర్తి కువలయమందున్

Yau Shing Tung (1949) (China, US)

యౌషింగ్ టుంగ్ చైనా ఉ
ద్ఘోషించును ఫీల్డ్‌పతకము గొనెనని విద్యా
భూషణుడని తనవాడని
భాషించును గణిత గగన భాస్కరుడంచున్

Hua Loo Keng (1910 - 1985) (China, Japan)

హూవా లూకెంగుకు సం
ఖ్యావాదములోన పేరు కలిగెను చైనా
ప్రావీణ్యము పెంచెనతడు
సేవలనందించె దత్తచిత్తము తోడన్

Chern Shiing Shen (1911 - 2004) (China)

"**షీయాంగు షెన్ చెరన్**" చై
నీయుడు జ్యామితి అవకలనీయతపై నెం
తో యుత్తమ ఫలితాలను
పూయించెన్ తలతు నతని బుద్ధి విభవమున్

Seki Kowa alias Seki Tawakazu (1642 - 1708) (Japan)

"అంకగణితముని" గా బిరు
దాంకితుడైన **సెకికోవ** ఆద్యుండని ని
శ్శంకన్వచింత్రు గణిత వ
శంకరులు జపాను నందు స్వాతిశయముతో

Michael Francis Atiyah (1929 - 2019) (England)

జ్యామితి విశ్లేషణములు
భూమికగా కొత్త ఫలిత పుంజము లిచ్చెన్
ఆ మీదట ''కే థియరీ
స్వామిగ'' ఫీల్డ్స్ మెడలు పొంది వరలెను **మైఖేల్**

నోబెలు బహుమతి గూడా
రాబట్టెను తనదు గణిత ప్రతిభ కతమునన్
నోబెలు పురస్కృతికి సమ
మీ బహుమతియున్ వరించె నీతనినతియాన్

Yaug Hui (1238, 1398) (China)

చైనాకు దశాంశ గణన
వైనమ్మునుఁ దెలిపినట్టి **వైయాగ్ హూయై**
జ్ఞానిని తలపోయుదు నత
డా నేలకు గౌరవమును ప్రహర్షము నొసగెన్

Kenjiro Shoda (1902 - 1977) (Japan)

రూప రహిత బీజగణిత
దీపద్యుతి సాంద్రత, పరిధి పెరిగె – **కెంజి**
రో పండితుని వలన – ఆ
లాపింతు జపానువోలె నాతని కీర్తిన్

Hans Hahn (1879 -1934) (Austria)

ఒనర ప్రమేయపు విశ్లే
షణలో గణనీయమైన చరితము సృష్టిం
చెను, మౌలిక సిద్ధాంతము
లను **హాన్** అందించెను, సఖులను మెప్పించెన్

Alfred Haar (1885 - 1933) (Hungary)

పరిమాణ నిర్వచన మెం
దరికో స్ఫూర్తి నొసగెను విదగ్ధుడు **హారున్**
మురిసెను తద్విషయమ్మున
కురిపించెను ఫలితములను కుప్పల్ తెప్పల్

Emile Borel (1871 - 1956) (France)

కేళీవాదమ్ము మొదలు
చాలావిషయాల మీద చర్చించిన ''**బో**
రేలు'' మహా ధీనిధి సమ
కాలీన గణిత జనగణ గౌరవమందెన్

Edward Lorenz (1917 - 2008) (US)

వాతావరణ సమీక్షన్
చేతోమోదమ్ము గలుగ చింతించె **లరెంజ్**
నూతన గణితా ధ్యాయము
చేతికి జిక్కెను ''ఖెయాసు'' (Chaos) చిత్రము చూడన్

Benjamin Bannekar (1731 - 1806) (US)

గ్రహ గమన చింతనమ్మున
సహచరు లాశ్చర్యమంద శ్రమియించి ముదా
వహమైన మన గగన తల
రహస్యములను ''**బనెకరుడు**'' రచ్చకు దెచ్చెన్

Hermann Minkowsky (1864 - 1909) (Germany)

జ్యామితి ద్వారా సంఖ్యా
ప్రాముఖ్య సమీక్ష జేసి ఫలితము పొందెన్
శ్రీమింకోవిస్కీ మే
ధామహితుడు నడివయసున తనువును వీడెన్

Marius Sophus Lie (1842 - 1899) (Norway)

అవకలన సమీకరణము
నవీన బీజగణితముల నందనవనిలో
చివురించిన తరువులతో
భవితకు విరులను పరచిన పండితమణి **లీ**

Lars Valerian Ahlfors (1907 - 1996) (Finland)

వివిధ గణిత శాఖలలో
నవిరళముగ కృషి సలిపిన **అల్ఫారసు** గౌ
రవ కరము ''ఫీల్డ్సు పతకము''
ను వరించె, రచయితగను వినుతి నార్జించెన్

Constantin Caratheodary (1873 - 1950) (Germany)

అవకలన సమీకరణాల్
నవగణితమ్ము చలన కలనము నింకను వా
స్తవ విశ్లేషణములలో
ప్రవర్ధిలెను నీదు కృషి **కరాథీయొడరీ**!

Clifford Ambrose Truesdell (1919 - 2000) (US)

యాంత్రిక శాస్త్రమున గణిత
తంత్రము తర్కమును మిగుల దట్టించుచు నా
మంత్రించెను **ట్రూయిస్‌డెల్**
యాంత్రిక శాస్త్రాధ్యయనము నందురు మెచ్చన్

Garret Birkhoff (US) (1911 - 19966)

ద్రవగతి శాస్త్ర రచనలను
సవరించెను బీజగణిత సంపుటములలో
నవతను గూరిచి వినియు
క్త వేదికను విస్తరించె ధన్యుడు **బిర్కాఫ్**

Felix Christian Klein (1849 - 1925) &
August Ferdinand Mobius (1790 - 1868) (Germany)

క్లయను మొబీయసను మహా
శయులు టొపాలజి చదివెడి సమయమ్మున ని
శ్చయముగ పరిచయమొందురు
భయులకును శుభమొన గూడె భాగ్యము పండెన్

Ervin Rudolf Josef Alexander Schrodinger

(1887 - 1961) (Austria)

''యుగ గణితవేత్త శాస్త్ర
ప్రగతికి నేత ప్రకృతిని తరంగ గతి రహ
స్యగవేషణా విజేతా!
జగతిని కీర్తింతు రిటుల **ష్రొడింగరునిన్**

Max Karl Ernst Ludwig Planck

(1858 - 1947) (Germany)

యుగపురుషుడతండు గణిత
జగమున అలపొడవునకును శక్తికి నడుమన్
నెగడు మహాద్భుతమైత్రి క
నుగొనెను నోబెలు పతకమును గొనెను **మాక్స్‌ప్లాంక్**

Ludwig Boltzman (1844 -1906) (Austria)

నవసాంఖ్యక గతిశాస్త్ర
మ్మవతరణకు కారకుడు మహాద్భుత ధిషణా
ర్ణవుడు బ్రతుకు ముగిసె ననం
త విషాద భరితముగా నతండే **బోల్ట్జమాన్**

Bernard Placidus Johann Nepomuk Bolzano

(1781 - 1848) (Bohemia Navin, Czech Republic)

గణితమ్మున విశ్లేషణ
మును జ్యామితి నుండి దూరముగ చేయ శ్రమిం
చిన గణిత తాపసిని **బో
ల్జనో**ను మనసార పొగడ సంబరపడుదున్

Claude Louis Marie Henri Navier

(1785 - 1836) (France)

సివిలింజనీరు వివిధ ప
దవులందు నిబద్ధత గణితము నందాస
క్తి వెలయ శ్రమించి **నవియర్**
ద్రవ గతికి సమీకరణము రాబట్టె గదా

Richard Courant

(1888 - 1972) (Germany, US)

గణితమనగ నిదియను వివ
రణకై బహుచక్కని కృతి రచనన్గావిం
చిన **కూరాంటు**కు గణిత ధి
షణా విభూషణునకేను సన్నుతులిత్తున్

Louis Victor Pierre Raymond duc de Broglie

(1892 - 1987) (France)

''ప్రకృతిని పదార్థములుగ
ను కణములుగను ప్రచలితమ'' ను వినూతన భౌ
తిక వాదము ప్రతిపాదిం
చి కీర్తి నగ్గలముగ బడసెను **డీ బ్రూగ్లీ**

Hermann Ludwig Ferdinand Von Helmholtz

(1821 - 1894) (Germany)

సకల కళా వల్లభుడై
ప్రకటిత మేధా విభవము పలురంగములన్
వికసింపగ **హెల్మ్ హోల్ట్జు** మ
రొక లియొనార్డై విరజిల్లె నుర్వీవరమై

Theodore Von Karman

(1881 - 1963) (Hungary, Germany)

వాయుగతిశాస్త్రమును పలు
స్థాయిలలో నధ్యయనము సాగించి మహా
నాయకుడైనాడయ్యెడ
థియోడర్వాన్ కరమన్ ధీనిధి తలతున్

Heinrich Eduard Heine

(1821 - 1881) (Germany)

గణితపు విశ్లేషణలో
గణనీయ కృషి వెలయించి కలిసి బరేల్ తో
గణుతి గనిన సిద్ధాంత
మ్మును **హీనే** తెలిపెమనకు ముదముప్పొంగన్

Christian Goldbach (1690 - 1764) (Russia)

మోదము నొసగెడిసంఖ్యా
వాదములో కృషి నెరపిన వంద్యుడు **గోల్డ్‌బాక్**
ఏదో సరదాగా సం
వేదించెను ఋజువులేని వింత ఫలితమున్

Josiah Willard Gibbs (1839 - 1903) (US)

సందిశావిశ్లేషణమును
కుదురుగ నభివృద్ధిజేసి కుశలత **జిబ్స్** సొం
పొదవెడి వినియుక్త గణిత
సదనమ్మునలంకరించి చరితార్థుడయెన్

Yakuta taniyama (1927 - 1958) (Japan)

నవసంఖ్యావాదమ్మున
యువకుడు చిచ్చరపిడుగుగ నుండిన **తనియా**
మ విషాదముగ బ్రతుకు త్రుం
చి వేసుకొనె కతమిదియని చెప్పక పోయెన్

Oliver Dimon Kellog (US)

నవసంఖ్యావాదమందున
ప్రవీణుడై గణితశాస్త్ర పరిశోధన కై
సవివరముగ ముఖ్యాంశము
ల వాహికగ నొక కృతిని **కెలాగు** రచించెన్

Gustav Kirchoff (1824 - 1887) (Russia)

సైద్ధాంతిక భౌతిక శా
స్త్రోద్ధతికైతపము జేసి యుత్తమ రీతిన్
శ్రద్ధాసక్తియుత నియమ
బద్ధముగా మనిన ఘనుడు పంతులు **కిర్చాఫ్**

Thomos John I'Anson Bromwich

(1875 - 1929) (England)

శ్రేణుల తత్త్వమెరిగిన ప్ర
వీణుడు **బ్రామ్విచ్** విశిష్ట విషయాగార
మ్మొనటు శ్రేణులపై కడు
నాణెమ్మౌ కృతిరచించె నలువురు మెచ్చన్

Sergi Lang (1927 - 2005) (France)

ల్యాంగు ప్రతిభ గల గురువని
సంగీతము వలె గణితము చతురతతో చె
ప్పంగల శాస్త్రజ్ఞుడనియు
పొంగున్ మనమా మనీషి పొత్తము చదువన్

Gespard Monge (1746 - 1818) (France)

జ్యామితి తో విశ్లేషణ
సామీప్యత పెంచి ఉభయశాఖా సంఖ్య
ప్రాముఖ్యముద్ధరించను
సామూహిక కృషి సలిపిన సాహసి **మూంగే**

Jean Victor Poncelet (1788 - 1867) (Francce)

గురువరుల స్ఫూర్తి దీక్షా
గరిమ నిశిత ధీమహత్తు కలసెను **పాన్‌స్లే**
వరవిక్షేప జ్యామితి
వరివస్యనొనర్చెను బుధవర్గము మెచ్చన్

William Kingdon Clifford (1845 - 1879) (England)

ప్రతిభామూర్తి గణితమున
మతిమంతుడు తత్త్వమందు మధురిమము మహో
చతురత గల రచయితయై
బ్రతికి **క్లిఫార్డ్** చిరువయసుననె పరమ పదించెన్

Pafnuty Lvovich Chebyshev (1821 - 1894) (Russia)

సమకాలీన గణిత ర
త్నములకు నేస్తము **చెబిషెవు** నవ సంఖ్యావా
దము సంభావ్యతల విభా
గముల పరిశ్రమలతని ఖ్యాతుని జేసెన్

Andrei Markov (1856 - 1922) (Russia)

సంభావతా వాదమునకు
జృంభణమొన గూర్చినట్టి చెబిషెవ్ ఠ్రోవన్
పుంభావ వాణి **మార్కోవి**
జృంభించెను బుధులు మెచ్చి జేజేలనగన్

Gregorio Ricci - Curbastro (1853 - 1925) (Italy)

కలన గణితమును టెన్సరు
చలరాశికి అన్వయించి చక్కగ **రిక్కీ**
వెలయించె సాధనముగా
పలుశాస్త్రములకు వరమది పరికింపంగా

Magmus Gosta Mittag - Leffler (1846 - 1927) (Sweden)

మిట్టగులెఫ్లర్ గణిత వి
రాట్టుగ సమకాలికులకు ప్రతిభను జూపెన్
గట్టి కృషిన్ గణితమునకు
పట్టము గట్టెను బుధులు సెభాసని మెచ్చన్

Alexander Grothendic (1928) (Germany, France)

శేముషిలో గ్యాల్వావలె
రామానుజు వలె ధరను వరలి బీజీయ
జ్యామితిలో నిరుపమమౌ
సామర్థ్యము గల్గె నీకు జయము **గ్రొథన్‌డిక్**

Maryam Mirzakhani (1977 -2017) (Iran, US)

మరియమ్ మీర్జాఖని తొలి
తరుణీమణి ఫీల్డ్సు మెడలు ధరియింపంగా
పరిశోధన టోపాలజి
ఇరాను నోముల ఫలమ్ము ఇమ్మహిళ కదా

C.E. Weatherburn (1984 - 1974) (Australia)

సదిశా గణితము నేర్తురు
త్వదీయ పుస్తక పఠనము వలనన్ విద్యా
సదనంబులలో నెప్పుడు
వెదర్బరన్ నీకు నాదు వినయ ప్రణతుల్

Marie Ennemond Camille Jordan

(1838 - 1922) (France)

ఆతడె బీజగణిత వి
ఖ్యాతికి శ్రమియించినట్టి ఘటికుడు **జోర్డాన్**
నూతన విశ్లేషణమున
కీర్తిడిన స్ఫూర్తిని స్తుతియించెను హార్డీ

Martin Gardner (1914 - 2010) (US)

గణిత రచనలకు సద్వివ
రణలొసగిన జగమెరిగిన రచయిత ఎం **గా**
ర్డన రెంతో కృషిచేసెను
గణిత ప్రాచుర్యమునకు గా నుత్సుకతన్

జనరంజక విజ్ఞానము
వినోద గణితమును మిగుల వృద్ధియొనర్చెన్
గణిత జనులు ఘనులు సెభా
సన **మార్టిన్ గార్డనరు** ప్రశంసించవలెన్

John Edensor Littlewood

(1885-1977), Eric Harold Neville (Cambridge, UK) (1889-1961)

ఎందరొ మహానుభావులు
ముందుండి సహాయపడిరి మోదము తోడన్
అందరు రామానుజునకు
అందు **లిటిల్వుడ్ నెవిలు**ను హారాల్డ్ ప్రముఖుల్

సుజనుడు హార్డీతో కల
సి జగము మెచ్చిన గణితము జేసెన్ రామా
నుజు ప్రగతిని హర్షించెదను
సృజనాత్మక గణిత కళకు చేవ **లిటిల్‌వుడ్**

Stephen Smale (1930) (US)

అల్లరి చిల్లరి పిల్లా
డెల్లప్పుడు గొడవల దిశ కెగబ్రాకెడి స్మేల్
మెల్లగ పాన్‌కరె లెక్కల
అల్లిక లొక కొంత విప్పి అందెను ఖ్యాతిన్

Augustus Edward Hough Love (1863 - 1940) (UK)

అకలంకముగ స్థితిస్థా
పకత పయిన్ శాస్త్రజగతి ప్రఖ్యాతిని గొ
న్నకృతిని గూర్చిన మేధా
వికి **ఎ.ఇ. హెచ్. లవ్**కు నాదు వినుతుల నిత్తున్

Louis Melville Milne Thomson (1891 - 1974) (UK)

ద్రవగతి శాస్త్ర పఠనమున
కవసరమయినదిగ వెలయు నవనీస్థలిపై
భవదీయ గ్రంథమ్మును
మివుల ప్రియమ్ముగ చదివితి – **మిల్నేథాంసన్**

Theodor Wilhelm Karl Weierstass

(1815 - 1897) (Germany)

అవధికి చక్కని చిక్కని
నవ నిర్వచనము నొసంగి నాణ్యత పెంచెన్
ప్రవరుండై గురుకులమున
నివసించెను గణితశాస్త్రవేత్త **వయర్‌స్ట్రాస్**

ఒక కొంత కవిత్వాంశము
ప్రకటించిన గణితవేత్త పాండిత్యము పూ
ర్ణ కళా సంశోభితమగు
ట కుదరదని చెప్పె **వయరుస్ట్రాస్** స్తుతమతియై

Alan Turing (1912 -1954) (UK)

టీ.సీ.ఎస్. (★TCS) ఏఐ (★AI) లను
భాసిల్లగఁ జేసి తనదు పరిశోధనలన్
వాసిగన్ **అలాన్ టూరింగ్**
స్యూసైడుకు పాల్పడియెను క్షోభమిగిల్చెన్
*Theoretical Computer Science, Artificial Intelligence.

Girolamo Cardano & Lodovico Ferrari

(Italy) (1501 - 1576) & (1522 - 1560)

అమరెన్ క్యూబిక్ క్వార్టిక్
సమీకరణములకు గణితసాధనములు నీ
దు మహితదీక్షను **ఫెరరీ**
శ్రమనెప్పటికి మరువదు ధరణి **కార్డానో**

Pierre Laurent Wantzel (1814 - 1848) (France)

కోణము త్రిధాకరించుట
పూని ఘనము రెట్టి సేత పొసగని కార్యాల్
దీనికి ఋజువుల నిచ్చిన
మానిసి **వాంట్జల్** అకాల మరణము జెందెన్

Ferdinand, Von Lindemann (1852 - 1939) (Germany)

భావాతీతమ్మని సం
ఖ్యయా వర్గమున ప్రముఖమయి ఖ్యాతిని గనె పై
భావుక విభుండు **లిండ్మ్యాన్**
ప్రావీణ్యము కతన ''పై'' (π) కి భాగ్యములందెన్

Johann Heinrich Lambert

(1728 - 1777) (Switzerland & Prussia)

పై (π) కరణీయకుతొలుత
శ్రీకారము చుట్టినట్టి శిష్టుడు **లేంబర్డ్**
లోకము మెచ్చిన ఋజువును
చేకూర్చెను దండుకొనియె స్థిరమగు కీర్తిన్

Charles Hermite (1822 - 1901) (France)

ఇ(e)ని ఒకట్రాన్ సెన్ డెన్ట ల(Transcendental)
ని నిరూపించిన గణితమనీషిని **హెర్మీ**
టును, పాన్ కారే గురువరు
డని, అతని ప్రతిభకు నుతుల నందించవలెన్

Israel Nathan Herstein

(1923 - 1988) (Poland)

బీజగణిత పరిశోధన
తేజమున, విశిష్టమైన తీరున గ్రంథాల్
రాజిల యశోవిశాలుం
డై జీవించెను గురువరుడై **హెర్‌స్టైయిన్**

Nathan Jacobson (1910 - 1999) (Poland, US)

తనతరమున బీజగణిత
మున నేతగ జగతిని యశమున్ బొందెను, నా
ధను జేకబ్ సన్ ఆతని
గణిత విదగ్ధతకు నిదుదు కైమమోడ్పులివే.

Paul Cohen (1934 - 2007) (US)

పరిశోధన ఫలితాలను
ధరణీతలమెల్ల నరసి తర్కింపంగా
విరజల్లి, ఫీల్డ్సు పతకము
ధరియించిన గురువృషభుడు తాన్ **పాల్‌కోహెన్**

Alfred Tarski (1901 - 1983) (Poland, US)

గణితము తర్కము తత్త్వము
లను క్షుణ్ణముగా తెలిసి విలక్షణమేధా
ధనుడై ప్రపంచ మెల్లెడ
ననురాగము నందు కొన్న **ఆల్‌ఫ్రెడ్** అన్నా!

Donald Knuth (1938) (US)

''పిత అల్గోరిథములక'' ని
నుతి బడసిన ''**నూత్**'' గణితమును మథించి మహో
న్నతి గనె కంప్యూటరునం
దు తలంతు నతని ప్రతిభ నతులిత ప్రీతిన్

David Blackwell (1919 -2010) (US)

ఎదురొడ్డెను అడ్డంకుల
పదిలముగా గణితమందు ప్రతిభన్ జూపెన్
తదుపరి సాంఖ్యక మందున
కదలె విజయశిఖరములకు ఘనుడై **బ్లాక్‌వెల్**

Emil Artin (1898 -1962) (Austria & German)

ఆధునిక బీజగణితపు
మాధుర్యము తన రచనలు మాధ్యమముగ తా
బోధించి చూపె జనులా
రాధించిరి ''**యెమిలు**'' నతని ప్రతిభకు జేజేల్

Terence Tao (1975) (Australia & US)

ముప్పదుల వయస్సునకే
గొప్పగ గణితమును నేర్చుకొని గౌరవముల్
కుప్పలుగ పొందె **టావో**
ఇప్పుగిదిని గణిత విబుధులిలలో గలరే!

Van der Waerden (1903 - 1996)
(Netherlands, Switzerland)

బీజగణిత ధరణిని రా
రాజుగ వెలిగి విలువైన గ్రంథాలను కా
లేజిలలో పాఠాలకు
పేజీలుగ నిలిపినట్టి ధధీనిధి **వేర్డన్**

Francois Viete (1540 - 1620) (France)

బీజగణితమ్మునకు నవ
తేజము గలిగించెను పలుతెన్నులలో ఫ్రాన్స్
రాజుల గౌరవ మంది వి
రాజిల్లె ''**వియిాట్**'' విశేష ప్రజ్ఞకు నెలవై

John Wallis (1616 - 1703) (England)

న్యూటనుకు ముందు తరమున
మేటి గణితవేత్త **జాన్**, అజేయుడు, ''ఇన్ఫై
నేటు'' (∞) అనంతము కు సంజ్ఞను కనుగొనె
పీటనొసగె కలనమునకు పేరునిలబడెన్

John Charles Fields (1863 - 1932) (Canada)

కెనడా గణితమునకు స్ఫూ
ర్తినిడిన ఆచార్య **జాను** దిగ్దంతులతో
గణిత విషయములు చర్చిం
చెను, **ఫీల్డ్స్** పతకము బెట్ట సిరులిచ్చెనహో

Donald J. Newman (1930 - 2007) (USA)

ప్రైములసిద్ధాంతమ్ము (PNT) ను
న్యూమను సులభముగ తేల్చెను గణితవేత్తల్
ప్రేమించి రతని నతిప్రతి
భామూర్తి యని తనయశము భద్రము చరితన్

Waclaw Sierpinski (1882 - 1969) (Poland)

సమితి టొపాలజి సంఖ్యల
సముద్రముల మునిగి రత్నచరము సునాయా
సముగా ప్రోవులు పోసిన
సమర్థుని "**షిర్ పినిసికిని**" స్మరియించవలెన్

పోలెండ్ గణితఖ్యాతికి
చాలశ్రమించిన ప్రసిద్ధశాస్త్రజ్ఞుడు ధీ
శాలి "షిరు పినిసికి" పలు వి
ధాల గణితము వికసింప దారులు చూపెన్

Charles Jean de la Valle Poussin

(1866 -1962) (Belgium)

అతిముఖ్యమైన గణిత ఫ
లితము పి.ఎన్.టి. (PNT★)కి "**డిలావలీ పౌసి**" నొసం
గె తొలి ఋజువును ప్రపంచ గ
ణిత సంఘములు సెహబాసని ప్రశంసింపన్

*Prime Number Theorem

Augustin Louis Cauchy (1789 - 1857) (France)

"ఆయిలరుగణిత మట్లు త్వ
దీయగణితము తరగతి గదిని పాఠములై
వేయారుగ వెలయు గదా" –
లూయీ కోషీ" యశము నిలుచునెల్లపుడున్

Joseph Liouville (1809 - 1882) (France)

భావాతీతపు సంఖ్యల
భావించి సృజించినట్టి ప్రతిభావంతున్
"**లోవియలి**" ని సంస్థలనె
న్నోవర్ధిల జేసిన ఘను నొకపరి తలతున్

ఎవరిస్టీ గ్యాల్వా కృతి
ని వెలుగునకు దెచ్చె బహు గణితశాస్త్రవిభా
గ విశారదుడు "లొవియలి" వి
రివిగ పలుకుబడి గలిగి తరించెను ఫ్రాన్స్‌లో

బహుముఖ ప్రజ్ఞా నిధియై
విహరించెను వివిధ గణిత వీధులలోనన్
వహియించె బాధ్యతలను ని
రహం కృతికి తావలమయి బ్రతికెను **లోవిల్**

Yitang Zhang (1955) (China, US)

ప్రైముల విభజన మందున
సీమాంతరముల పొడవులు చెప్పిన **యైటాంగ్**
ధీమంతుని పరిశోధన
భూమండల మందు ఖ్యాతి పొందగ జేసెన్

ప్రైము కవలలకు హీరో
గా మర్యాదలను పొంది గణనీయుండై
ప్రైముల శోధనలో నొక
స్వామిగ వెలుగొందుచున్న జాంగుకు జేజేల్

Hermann Schlichting (1907 -1982) (Germany)

బౌండరి లేయర్ థియరీ
పండితుడై గ్రంథమొకటి ప్రచురణ జేసెన్
ఖండాంతరముల కీర్తిని
పండించెను పుష్కలముగ ప్రముఖుడు **స్లిష్టింగ్**

Theodore Von Karman (Hungary & Germany, US)

ద్రవగమనమునకు గణితము
నవలీలగ మలచుకొనియె ఖ్యాతిని పొందెన్
స్తవనీయుడు **వాన్ కార్మన్**
నవ యేరోడైనమిక్సున ప్రముఖుడయ్యెన్

Issac Barrow (1630 - 1671) (U.K.)

తనపీఠమును గురువు శి
ష్యున కొసగి మురిసిన వింత శోభిల్లు గదా
గణిత చరిత **నైజక్** న్యూ
టను మనుగడ ముఖ్య సంఘటనగా నెపుడున్

Bourbaki (1935) (Group of French Mathematicians)

భావముల రూపములుగా
గావించిన కట్టడములె గణిత ధరిత్రిన్
చేవగల ఆయుధములని
భావింతురు "**బూరుబాకి**" పండిత వృషభుల్

- Structures are the Weapons of Mathematics

Sri Thomos Browne (1605 - 1682) (UK)

దేవుడనబడు అమోఘ మ
హా విభవ సముజ్జ్వలిత మహత్తరశక్తిన్
భావింతురు జ్యామితిలో
ప్రావీణ్యముగల ప్రశస్త రమ్యాకృతిగాన్

- God is like a skilful Geometrician

Alexander Gelfond (1906 - 1968) (Russia)

పండితుడు గణితనభమున
చండార్కుడు సుప్రసిద్ధ శాస్త్రజ్ఞులకే
గుండెలదరగ మనిన **గె**
ల్ఫాండు మహాశయుని దలచి ప్రణమిల్లవలెన్

Joseph Bernstein (1945) (Tel Aviv Univ., Israel)

బీజీయ జ్యామితిలో
తేజోమూర్తిగ వెలిగెడి ధీనిధి **జోసెఫ్**
రాజిలు సంఖ్యల శాఖన్
తాజా ఫలితములనొసగి ధన్యత గాంచెన్

Daniel Kan

(1927 - 2013) (Hebrew Univ. - Jerusalem & MIT-US)

హోమొటపీ వాదములో
హేమా హేమీగ ఎదిగి ఎన్నోపత్రాల్
ప్రామాణికములు గూర్చిన
ధీమంతుడు **డేనియలు** ప్రతిభకు ప్రశంసల్

Alexander C. Aitkin

(1875 - 1967) New-Zealand Scotland

గణితము, సాంఖ్యక శాస్త్రము
లను సరిపన్నము నరిచిన లబ్ధయశస్వం
తుని **ఏట్కిను**ను తలచు కొం
దు నాతని కృషికి నమస్కృతులొసంగవలెన్

Haris Aziz

(1980) (లాహోర్ యూనివర్శిటి, పాకిస్తాన్ & న్యూయార్క్ (యు.ఎస్.))

పాకిస్థానున గణిత ప
తాక మెగురు నట్టుల గణిత ప్రగతికి నెం
తో కృషి సలిపెడి **హారిస్**
ధీ కుశలుని కమనుతులనుఁ దెలుపముద మగున్

Jamal Nazrul Islam

(1939 - 2013) Univ. of Chittagng, Bangladesh

గణితాది శాస్త్రములలో
ప్రణుతి గనిన నేరు పరిని బంగ్లాదేశ
స్థుని **నజురూలిస్లాము**ను
వరశాస్త్రవేత్తగా మోదముననౌ్గరవింతు

Abram Samoilovitch Besicovitch

(1891 - 1970) (Ukraine, Russia & UK Cambridge)

గణితమ్మునందు విశ్లే
షణలో ఘనకీర్తి గొన్న శాస్త్రజ్ఞ శిరో
మణి **బెసికోవిచ్** ఆతని
గణిత ప్రతిభనభినుతింతు గౌరవమొప్పన్

Cora Ratto de Sadosky

(1912 - 1981) (Argentina & France)

గణితము, విప్లవములతో
మనుగడ సాగించె గణితమానిని అర్జం
టినలో ‘‘కోరా’’ ఆవిడ
వినుతిన్ గనె గణితధరణి విస్మయమందన్

Javier Perez Capdevila Guantanamo (1963) - Cuba

వినియుక్తగణితశాఖన్
గణనీయ కృషి యొనరించి ఖ్యాతిన్ గాంచెన్
మనియెడి క్యూబా దేశ
మ్మున **పీరెజ్ కేప్ డెవి**ల ప్రముఖ విజ్ఞుండై

Amit Miriam

(1947) (Ben Gurion Univ., Israel)

బాలల గణితమున, కళా
శాలల గణితముననుభయశాఖలలో ప
త్రాలు రచించి, నడచు గ్రం
థాలయమై వెలుగు మహిళ – **ఆమిత్మీరియమ్**

Kang Tae Kim

(1957) (Pohong Univ. of Science & Technology, South Korea)

పొత్తములెన్నో వ్రాసిన
ఉత్తమ గణితజ్ఞునుత్తమోపాధ్యాయున్
ముత్తెరగులగణిత సం
పత్తికి కాంగ్ టే కిము శ్రమ పడు వ్యక్తి సుమా

Sangtae Kim (1958) (Univ. - US)

కెమికల్ ఇంజనీయరయిన
ను మంచి గణిత ఫలితములను ప్రసాదించెన్
కిము సాంగ్టే జగత్ ఖ్యాతిని
సముపార్జించిన నిపుణులు శాస్త్రజ్ఞుడుగా

Sergei Novikov (1938-2024) (Russia)

బీజీయ టొపాలజిలో
రాజిల్లిన కృషి సొలిటను (Soliton) రంగము నందున్
తేజములు నింపగా నుల్ఫ్
ప్రైజును ఫీల్డ్స్ మెడలును గొనె ప్రాజ్ఞుడు **నొవికోవ్**

Freeman Dyson

(1923-2020) (Univ. of Birmingham UK & IAS Princeton US)

గణితము భౌతిక శాస్త్రము
లను క్షుణ్ణముగా జదివి విలక్షణముగ ఖ్యా
తిని గాంచె మంచి తీర్పరి
గ నేర్పరిగ కూర్పరిగను గ్రాలెడి **డైసన్**

William Dunham

(1947) (Pittsburg & Harvard - U.S.)

గణిత చరిత్రను గూర్చి, ర
మణీయమౌ కృతులొసగిన మాన్యుని మేధా
విని ఘనముగ **యూలరును** (Leonard Euler)
ప్రణుతించిన **దన్హమును** కరముశ్లాఘింతున్

Sir Roger Penrose

(1931) (Univ. of Oxford, UK)

భౌతిక శాస్త్రము గణితము
ప్రీతిగ మథియించి కృష్ణబిలములు (Black Holes) మీదన్
నూతన ఫలితాలిచ్చిన
ప్రాతః స్మరణీయుడతడె **రోగర్ పెన్‌రోస్**

Atle Selberg

(1917 - 2007) (Norway & (IAS Princeton Univ. USA)

అనలిటికల్ నంబర్ థియ
రిని ఆటో మార్ఫికుథియరి జతపరచి నే
ర్మిని స్పెక్ట్రల్ థియరి కలి
పెను ఫిల్డ్సు మెడలును బడసె ప్రీతుడు **సెల్‌బర్గ్**

రామానుజు కృషి స్ఫూర్తిగ
ధీమంతుండట్లి గణిత తేజో నిధియై
ప్రైముల స్థితినెరుగుట కొరకై
క్కై మంచి ఋజువిడి ఫీల్డ్సు హారము గొనియెన్

John Henry Coates

(1945) (Australia, France, US and UK)

యుగ గణితవేత్త ఆంద్రూ (Andrew Wiles)
కు గురువు కేంబ్రిడ్జ్ ప్రొఫెసరు **కోట్స్** దిట్ట అనే
క గణితశాఖలలో విరి
విగ శిష్యవరుల గలిగిన విజ్ఞుండు గదా

Ada Lovelace

(1815-1852) (London (U.K))

తొలి కంప్యూటర్ ప్రోగ్రామ్
విలిఖించిన యట్టి గణిత విదుషీమణిగా
వెలసె **అడాలవ్‌లేస్** దుహి
తయెలార్డు బైరన్‌కు తనని తల్లిచెపెంచెన్

బాబేజు శిష్యురాలై (Charles Babbage)

ప్రాబల్యముగన్న యాతని భావమ్ములకున్
శోభించెడి యంత్రాకృతి
సౌభాగ్యము గూర్చె లబ్ధిజగతికి గలిగెన్

Alberto Calderon (1920-1998) (Argentina & USA)

సింగులర్ సమాకలను (Singular Intergral)
ముంగిట ముత్తెముల వోలె ముద్దులొలుకగా
చెంగ పేర్చుకొని గణిత
రంగములో **కాల్డెరాను** రాజైచెలగెన్

Bela Bollobas

